ప్రబోధచంద్రోదయము.

కృష్ణమిశ్రకవిరచితము

సంస్కృతనాటకము నుండి

రాజమహేంద్రవరపు హైస్కూలునందు

నాంధ్రోపాధ్యాయుఁడు

వడ్డాది - సుబ్బారాయుఁడు

తెలిఁగించినది

మొదటికూర్పు. ౧౦౦౦

ఏలూరు

దామరాజు - శివరామయ్యగారి

శ్రీమత్త్రిపురసుందరీముద్రాక్షరశాలయందు

ముద్రితమయినది.

౧౯౧౩-సం॥ మేనెల

——:0:——

వె. ౦—౧౦—౦

పీఠిక.

భాష్యాది బహుగ్రంథములవలన నీనాటకములోని యర్థము తెలియుచునే యున్నది; ఈప్రబోధచంద్రోదయమున నేమిప్రయోజనము? ఒకవేళం గవి దీనిని సంగ్రహార్థము రచియించి యుండు నని యూహింతురేమో; అట్టి సంగ్రహగ్రంథములును బెక్కు లీవఱకే పొడమియున్నవి; కావున నయ్యూహ దీనికిసార్థకతం గలిగింపజాలదు. అదేమన్న, నాటకంబున సర్వార్థంబును నభినయప్రధానం బయి వెలయుంగావున, వేదాంతార్థంబునకు నీప్రబోధచంద్రోదయంబునం గలిగినంతవిశదత్వంబు పరోక్షోపదేశపర్యవసానంబు లగు భాష్యాదిగ్రంథంబులం గలుగనేరదు.

నిదిధ్యాసనము దుదగాఁగల బ్రహ్మజ్ఞానసాధనంబు లగువస్తువిచారాదు లనేకంబులు ప్రత్యేకప్రత్యేకము చిరకాలానుష్ఠేయంబు లని శాస్త్రంబులు దెలుపుచున్నవి. అట్టివానిని బ్రత్యక్షప్రయోగప్రదర్శనాత్మక మగునభినయంబునం దక్క వేఱొక్కటఁ జక్కఁగా నెఱుంగఁదరంబుగాదు. యాజ్ఞికుఁ డధీతకల్పసూత్రుం డయ్యు యజ్ఞవాటంబులం బ్రత్యక్షప్రయోగవీక్షణంబుననే ప్రయోగదక్షతం గాంచుచున్నాఁడు. యోగియు సముపదిష్టయోగశాస్త్రుం డయ్యు స్వస్తికాద్యాసనబంధంబులం బ్రత్యక్షంబుగా గురుప్రదర్శ్యమానంబులం జూచియే వానియందు నమందప్రావీణ్యంబు వడయుచున్నవాఁడు. తార్కికులు మొదలగువారు గూడ నిదేవిధముగ, శాస్త్రాధ్యయనము లెస్సఁజేసినవా రయ్యు సభాస్థానంబులం బ్రవర్తమానంబు లగువాదజల్పవితండాదులం దఱుచుగఁ బ్రత్యక్షావలోకనంబుఁ జేసియే తత్సాధనసమర్థు లగుచున్నారు. కావున నీప్రబోధచంద్రోదయ మేతదర్థంబ.

ఇట్లనుటచే నేతద్గ్రంథోత్పత్తికిం బూర్వ మీలాభ మెవ్వరికిని గలుగ లేదా యని శంకింపవలదు. అత్యంతవిరళంబుగా వామదేవాదులుంబోలె జన్మాంతరసిద్ధిగలవారు గొందఱు ఉండనువచ్చును; తత్తజ్జన్మంబులం బలుమాఱు వారికి నాట్యసందర్శనంబును జేకూఱవచ్చును. పోనిండు. మహత్తరప్రజ్ఞామేధాతిశయశాలులును, బరిపూర్ణపరమేశ్వరానుగ్రహపాత్రులును నగుమహానుభావులకుం గొందఱకు, నాట్యసందర్శనం బక్కఱ లేకపోయినను, మందా[illegible] యాజ్ఞికులకుంబోలె [illegible] బ్రత్యక్షప్రయోగదర్శనాపేక్షయుండుంగావునఁ దదనుగ్రహార్థమే యీనాటకం బని యెఱుంగఁగోనుఁడు.

మఱియుం దీనివలనఁ బ్రయోజనాంతరంబును గాఁబట్టుచున్నది. జనుఁ[illegible] సర్వావయవసంపద గలిగి చక్రవర్తియయి సమస్తము లయిన[illegible] [illegible] సానందము. దానికి[illegible]

దేవతానందము. దానికిశతగుణము గంధర్వానందము. దానికిశతగుణ
కర్మదేవతానందము. దానికి శతగుణ మాజానదేవతానందము. దాని కి
గుణము విరాట్పురుషానందము. దానికి శతగుణము హిరణ్యగర్భానంద
దీనికి బ్రహ్మానంద మని పేరు. ఇట్లుమనుష్యానందము దొరంకొని యొండొం
నూఱేసిమడుంగు లెక్క డగునిరతిశయానందమే నిజరూప మయినపరబ్రహ
ము నిదిధ్యాసనంబునం బొడమునానందసాంద్రత్వంబు ముందుగనే బుద్ధ్యా
ఢం బగుట యసంభవంబు; కాంబట్టి యేదేని నొకసజాతీయం బగునాన
బు నవలంబించి దాని నుత్తరోత్తరాతిశయసంపన్నంబుగా ననుసంధించు
నికి నవిరకాలంబుననే యభ్యాసపాటవంబునంజేసి బ్రహ్మానందంబు పూ
బుగా బుద్ధ్యారూఢంబు గాంగలదు. ఈనాటకంబునం దభివ్యజ్యమానం
రసమే దానికి సజాతీయానందంబు. "రసో వై సః" అనుశ్రుతివలన రస
బ్రహ్మానందతుల్య మనియు బ్రహ్మానందాభిన్న మనియు మతభేదమున నా
కారికులు వాకొందురుగాన, ధ్యానావలంబనీభూతం బగురసంబున క
జకంబుగాను నిది యావశ్యకంబు.

నాటకాంతరంబులు పెక్కులు గలవుగదా! వానియందలిరసంబు
నావలంబనంబు గాంగూడదా యనిన నట్టివి శృంగారాదులలోనిదిగా ను
గావున, శాంతైకరసు లగుముముక్షువులకు నుపాదేయంబుగా నుపజా
ఇంతియ్యకాక మీందుమిక్కిలి చిత్తశుద్ధివిరోధి యగుటంజేసి రసాంతరంబ
రల కత్యంతానర్థకరంబు. మఱియు ననధ్యాయ కాలక్షేపాదికంబును
బ్రయోజనాంతరంబుగాం జింతింపవలయు.

పూర్వము పరమకారుణికస్వభావుం డగుశ్రీకృష్ణమిశ్రుండు తన
కొకరునికి, బహుశోధ్యాపితవేదాంతసిద్ధాంతుం డయ్యుం దదర్థావ
పరాఙ్ముఖుం డయ్యెడువానికి, నాటకాదులయం దత్యంతరసికత్వం
వానికి నాటకముఖంబుననే వేదాంతతత్త్వార్థంబు సుబోధంబు గాంగ
నిశ్చయించి తద్వ్యాజంబున సమస్తవేదాంతార్థసంగ్రాహకంబుగా జ
కారార్థం బీప్రబోధచంద్రోదయనాటకంబును విరచించెను.

ఇతరనాటకములయందుంబోలె నీనాటకమందు వచ్చుపాత్ర
గాని రాక్షసులుగాని మనుష్యులుగాని కారు. (ఇంద్రియనిగ్రహ
దాను దెలిసికొని యాత్మారాముం డగునట్లు ప్రతిపురుషునకును
వుట దీనిముఖ్యోద్దేశము గావున, నిందులో దుర్గుణములు దుష్ప
ష్టతములు దుశ్శాస్త్రములు నొకపక్షము గాను సుగుణములు

లు సుమతములు సుశాస్త్రములు నొకపక్షముగాను విభాగించి, మొదటిపక్ష ములోనిదుర్గుణాదు లజ్ఞానసంభవంబు లగుటఁజేసి యావైభవన రాజు (మహామోహ)మనియు, రెండవపక్షమందలిసుగుణాదులు సుజ్ఞానసంభవంబు లగుటఁ జేసి యాప్రకాశను రాజు (వివేక)మనియు నేర్పఱిచి, చీఁకటి యెంతదట్టముగా నున్నను దీపసన్నిధిని దానిసామర్థ్యమువ్యర్థముగావున, నెంతబలవంత మయ్యును మహామోహము స్వపక్షకామక్రోధాదులతోఁ దుట్టతుదకు వివేకమునకు నోటువడి హత మయినట్లు బహుచమత్కారముగా నితివృత్తమును గల్పించి బ్రహ్మజ్ఞానసంపన్నుఁడగుకృష్ణమిశ్రుఁ డాత్మానందజనకంబుగా నీనాటకమును ముగించినాఁడు. అందుచేత నిందలిపాత్రములు ముందుచెప్పినసుగుణదుర్గుణాదులకుఁ బ్రతినిధు లని తెలియవలెను.

విశేష్యశబ్దములు వానివానియర్థమునుబట్టి కాక తెలుఁగుగా రూపసిద్ధినిబట్టి సంస్కృతభాషయందుఁ బుంలింగము లని, స్త్రీలింగము లని, నపుంసకలింగములని-ముత్తెఱంగులుగలిగియుండు. అందు స్త్రీలింగశబ్దవాచ్యంబు లయినరతిహింసాతృష్ణా ప్రభృతులును. మతిక్షమాసరస్వతీప్రభృతులును, స్త్రీపాత్రములగను, దదితరలింగశబ్దవాచ్యంబు లగుకామక్రోధలోభమోహమనోముఖ్యంబులును, వివేకవస్తువిచారవైరాగ్య నిదిధ్యాసనాదులునుఁ బురుషపాత్రములు గనుండు. ఇంక నయ్యాయిపాత్రముల చుట్టఱికములు మొదలయినవియుఁ దత్తద్గుణక్రియాదుల సంబంధమునే యనుసరించును. క్రోధగుణముతో హింసాక్రియ కవినాభావసంబంధముగావునఁ, గ్రోధునకుహింస భార్య యని చెప్పఁబడియె. ఈలాగుననే మాయాపరమేశ్వరులయు, మనఃప్రవృత్తినివృత్తులయు, రతికాములయుఁ, దృష్ణాలోభులయు, మత్యుపనిషద్వివేకులయు, మిథ్యాదృష్టిమహామోహులయు దాంపత్యంబునకును, మహామోహాదులకును వివేకాదులకును గలజ్ఞాతిత్వమునకును, వారివారి పరివారమునకును వారికిని గల స్వామిభృత్యభావంబులకును గారణముల విచారించుకోవలయును.

శృంగార హాస్య కరుణ వీరరౌద్ర భయానక బీభత్సాద్భుత శాంతముల నెడునవరసముల లోపలను శాంత మనునది వృత్తిశూన్యంబు గావున నది నాటకాభినయయోగ్యంబును మనోరంజకంబును గాదని, లౌకికవ్యా[illegible] [illegible] లకడమయెనిమిదిరసంబులే శాకుంతలాదులయందు వర్ణి[illegible] [illegible] నాటకములయం దష్టరసములే వర్ణింపఁబడు ననుట [illegible]

[illegible]

గీ॥ [illegible]రసములకును నాశ్రయంబైనయే। భవ్యనాటకమున భరతమౌని।
తేర్పరించెమిమ్ము నెలమిదానిఁగనంగ।దివిజభర్తకొలువుదీరియుండె॥"

అయినను గృష్ణమిశ్రుఁడు నిజప్రజ్ఞావిశేషంబున మనోజ్ఞతాదుల నేమి
ప గొరంతయుఁ గొంచెంత లేకుండ నీనాటకమును శాంతరసప్రధానముగా ర
చియించినాఁడు. నాటకములలో శృంగారాదులం బ్రకటించునవి చుకొలవ
లె లెక్కకు మీఱి యున్నవిగాని, శాంతరసమును బ్రకటించునది యిదియొక్క
టిమాత్రమే యగుటచేత నీనాటకము తనయభిధానము నీవిధమునను సార్థక
పఱచుకొనుచున్నది. ఈనాటకము పుట్టి యనేకశతసంవత్సరము లయినను,
నీనివంటిది వేఱొక్కటి యెన్నఁటికిని మరలఁ దలయెత్తక పోవుటయే, యిట్టి
విషయమున దృశ్యప్రబంధ నిర్మాణము దుష్కర మని దృఢపఱిచి,దీనికి సర్వ
నాటకప్రాముఖ్యమును సంపాదింపఁ జాలియున్నది.

ఈనాటకమందలి భావములను గ్రహించుటయందుఁ జదువరులు మిగు
ల సూక్ష్మబుద్ధితో నుండవలయును. భావవిషయమున నిది యితరనాటకము
లవంటిది గాదు. ప్రాయికముగా నిందలిభావము మొదటినుండి తుదవఱకు
వ్యర్థిగా నుండును. చూడుఁడు. ప్రథమాంకములోఁ గాముఁడు వివేకాదుల
నను దమకును గలచుట్టఱికమును రతితోఁ జెప్పుపట్టున, నీశ్వరసంగమువలన
మాయయందు మన స్సనెడుకుమారుఁడు గలిగె ననియు, నతఁడే యీమూఁ
డులోకములను సృజించి తమ్మును వివేకాదులనుగూడఁ గనియె ననియుఁ జె
ప్పఁబడియున్నది.

ఈవాక్యము భావము మన మీలాగు విచారింపవలెను. శ్రు॥ బ్రహ్మ
ణోవ్యక్తః, అవ్యక్తాన్మహత్, మహతోహంకారః, అహంకారాత్పంచతన్మా
త్రాణి, పంచతన్మాత్రేభ్యః పంచమహాభూతాని, పంచమహాభూతేభ్యో[illegible]
లంజగత్॥ తాత్పర్యము॥ అద్వితీయపరబ్రహ్మమువలన నవ్యక్తము, [illegible]నివల
న మహత్తు,నందువలన నహంకారము, దానివలనఁ బంచతన్మాత్రలు, వానివ
లనఁ బంచభూతములు, వానివలనఁ బదునాల్గుభువనములుఁ బుట్టె నని సృష్టి
క్రమము వేదమునఁ జెప్పఁబడియున్నది. కావునఁ బయిని జెప్పఁబడినయీశ్వ
రుఁ డద్వితీయపరబ్రహ్మ మనియు, మాయయనునది యవ్యక్త మని[illegible]
[illegible]తుదయించినమనస్సు మహత్తనియుఁ,దన్మూలముననే దాహ్యాభ్యంతర
[illegible]ఁచం బెల్లనుద్భవించె ననియు భావింపవలెను. మనస్సువలననే మన
[illegible] గోచరించుచున్నది. (మనస్సువలననే మనమఁ [illegible]
[illegible]గాని లుద్ధుచున్నది.) మనస్సులీనమయిపోయిన [illegible]

మన కెదియుఁ దెలియవచ్చుట లేదు, ఏతలంపును బుట్టుట లేదు. కాఁబట్టి యీ యుపాయ మే సరి యయినదే యని యనుభవమునకుఁ దెచ్చుకొని యానందింప వలెను.

ఈలాగు ప్రత్యంశమును సూక్ష్మదృష్టితోఁ బండితసాహాయ్యమున మనము విచారించునెడల నీనాటకములోని ప్రతివాక్యమునకును వేదశాస్త్రప్రమాణ్యము గావలసినట్లును, దాదృశప్రమాణ హీనముగా నిం దొకవాక్యమును నేకొలుపఁబడ లేనట్టును, జతుర్దశవిద్యాపరిపూర్ణవైదుష్యముతోడను, నాస్తికాదిమతాంతరనిరసనాప్రధృష్యప్రాగల్భ్యము తోడను నిది రచియింపఁబడినట్టును దోఁచుటయే కాక, భావభేదమునుబట్టి యీప్రబంధము లౌకికవైదికార్థములు జోడించి కావించినయపూర్వద్వ్యర్థి నాటక మనియు నిశ్చయముగా స్ఫురింపఁ గలదు.

ప్రబోధచంద్రోదయ మనఁగా, (మేలుకువ యనెడుచందమామ పొడుపని యర్థము. ఈనాటకములోని ముఖ్యకథ యంతయు దీనిపేరిలోనే యిమిడియున్నది. మనోవిజృంభణమున స్వస్వరూపము మఱచిపోయి యసత్యమయిన సంసారము సత్యముగా నెంచుకొని సదా తత్పరతం జరియించుట యాత్మకు నవిద్యారూప మయిననిద్ర. అందుండి మేలుకొనుట యనఁగా మనస్సును మోహాదిసహితముగా నిగ్రహించి, తత్కార్య మయినయనృతజడదుఃఖాత్మకసంసారమును బాడక, సచ్చిదానందరూప మయినయాత్మయే తానయి యుండుట ప్రబోధము. అట్టిప్రబోధము శాంతమును సంతాపహారకమును గావున దానికిఁ జంద్రసామ్యము చెప్పఁబడినది. అంతియేకాని కేవలతమోపహారక మని కాదు. అట్లయినచోఁ జంద్రునికంటె సూర్యుఁ డెక్కుడు ప్రకాశము గలవాఁడుగావునఁ గవి దీనికిఁ బ్రబోధసూర్యోదయ మనియే పేరుపెట్టి యుండును. మఱియుఁ బ్రస్తుతనామకరణము దీనిశాంతరసప్రధానతను గూడఁ జెప్పకయే చెప్పుచున్నది. కాఁబట్టి యట్టిప్రబోధచంద్రుఁడు తనయందు నుదయ మగుటకుఁ బ్రతిపురుషుఁడు నేలాగు ప్రయత్నము చేయవలయునో తత్ప్రకార మంతయు నీనాటకమునఁ జక్కఁగ వివరింపఁబడియున్నది. సుకృతపరిపాక మయినవారికి దీనియందలిభావము మనమున కెక్కి శాశ్వతసుఖము సంఘటిల్లును.

ఈనాటకమున నా అంకములు గలవు. మొదటియంకమున, వివేకమహామోహాదులయుత్పత్తియు, వారలవైరమునకుఁ గారణంబును, మహామోహనిర్మూలనమునందు వివేకుఁడు కృతనిశ్చయుఁ డగుటయుఁ జెప్పఁబడి

నవి. రెండవయంకమున, వివేకనిశ్చయమెఱింగి మహామోహుఁడును దత్పరిజను లగుదంభుఁడు, నహంకారుఁడుఁ, జార్వాకుఁడుఁ, గ్రోధుఁడు, లోభుఁడు మొదలుగాఁ గలవారు వివేకుని మచ్చమాపుటకును నతనికి నుపనిషత్సమాగమము కాకుండఁజేయుటకును బ్రయత్నించుట వర్ణింపఁబడియె. మూఁడవయంకమునఁ, బాషండు లయినయార్హత సౌగత కాపాలికుల మతసిద్ధాంతంబులును బరిహాసపాత్రము లయినతత్తద్వర్తనములును యథావిధముగాఁ దేటపఱపఁబడియె. నాలవయంకమున, వివేకుఁడు తనపరిజను లగువస్తువిచారుఁడు సంతోషుఁడు క్షమ మొదలగువారితో యుద్ధోద్యోగముఁజేసి పోరితంబున కాయితంబయి రథ మెక్కి కాశీపట్టణమునకేగుట తెలుపఁబడియె. ఏనవయంకమున, యుద్ధప్రకారంబును యుద్ధములోఁ జచ్చిపోయినకామక్రోధలోభాదులకొఱకు మనస్సు విలపించుటయుఁ నాతనికి వ్యాసరస్వతియు వైరాగ్యుఁడును దుఃఖోపశమనము సేయుటయు వివరింపఁబడియె. ఆఱవయంకమున, జీవుఁడు సంసారసాగరమును దరించి, వివేకోపనిషత్సమావేశమువలనఁ గలిగిన ప్రబోధచంద్రునిఁ గౌఁగిలించుకొన్ని జీవన్ముక్తుఁ డగుటయుఁ దత్ప్రకరణమునఁ దార్కికాదిమతపూర్వపక్షంబును నద్వైతమతసిద్ధాంతంబును బ్ర[illegible]ంపఁబడియె. కథ దెలియుట కిట్లు మిగుల సంగ్రహముగాఁ దెలిపితిని గాని యీయాయంకములలో వచ్చువిశేషములు మఱియు ననేకములు గలవు. తత్తద్విషయము లన్నియు జాగరూకతతోఁ బరికించునెడలఁ జీఁకటింటికి దీప మెంతయావశ్యకమో మనుష్యమాత్రునకీనాటకమంత యావశ్యక మని యెల్లవారికినిఁ దోఁచఁగలదు.

ఈనాటక మేకాలమునఁ జేయఁబడినదో, దీనిని జేసినకవి యేదేశమునందుండెడివాఁడో యీగ్రంథమునందు స్పష్టముగాఁ జెప్పఁబడక పోయినను, వానిని దెలియఁగోరువారికిఁ దత్సూచకము లగుకొన్నియంశములు మాత్రమిందుఁ గానఁబడుచున్నవి. గ్రంథకర్తపేరు కృష్ణమిశ్రుఁ డని నిస్సంశయముగా నిందే తెలియ వచ్చుచున్నదిగదా! విశాఖపురి మొదలుగాఁగల తూర్పుదేశమునందు నియోగిబ్రాహ్మణుల కందఱకును బంతు లనుపదమువలె, మిథిలాదేశమందలి విద్వద్బ్రాహ్మణులకెల్ల మిశ్రపదము వారివారి నామములతో సుప్రయుక్త మగుట వాడుక యయినట్లు పెద్దలు చెప్పుచున్నారు. ఈనాటక మింగ్లీషుభాషలోనికి భాషాంతరీకరించిన జే. టైలరను నైరోపీయుని గ్రంథమందలి యాంగ్లోభాషాపీఠికగూడఁ బూర్వోక్తాంశమునకు సాక్ష్య మిచ్చుచున్నది. ఆదేశమం దటివ్యవహారము సహజ మగుటచేతనే కాఁబోలు మొదలుసంబంధ

మెకుడుగాఁ గలయుత్తర రామచరిత్రనాటకమునందు మిశ్రశబ్దప్రయోగ
ము తెలుచుగాఁ గానవచ్చుచున్నది- దీనింబట్టిచూడఁగా నీకవి మిథిలాదేశీయుఁ
డయినట్లు పొడకట్టుచున్నది- మఱియు నీకవి యీవిధ మైననాటకము చేయు
టకూడ నాతనియునికిపట్టును దెలిసికొనుటకుఁ గొంత సాయ మగుచున్నది.
ఈగ్రంథము నామూలాగ్రముగాఁ జదివి చూచినవారికి, నాకాలమందు బౌ
ద్ధాదిమతములకుఁ బ్రాబల్యంబును నద్వైతమతమునకు దౌర్బల్యంబును గలిగి
యుండె నని తోఁచకపోదు. అట్టి ప్రాబల్యము వేఱుచోటులఁగాక తానున్న
దేశమందే యామతములకుఁగలిగినయెడల నద్వైతశాస్త్రమందుఁ బూర్ణ
పాండిత్యంబును విశ్వాసంబును దదనుభవమును గల యీకృష్ణమిశ్రునివంటి
మహావిద్వాంసుఁడు పరమతనిరసనపూర్వకముగా స్వమతస్థాపనము చేసికొ
నక యూరకుండుట యెంతమాత్రము సంభవింపదుగదా! ఈనాటక మెవని
సమ్ముఖమున నభినయింపఁబడె నని కవిచేతఁ బ్రస్తావనయందుఁ దెలుపఁబడి
యెనో యాకీర్తివర్మ, తన్మిథిలాదికబహుదేశములమీఁద నధికారము గలమ
హారాజు. అతఁడు క్రీస్తుశకము ౧౦౬౦వ సంవత్సరమందు మగధమును బాలిం
చుచు నెసంగినవాఁడు. ఆమగధమునకు బేహార మనువేఱొకపే రెల్లవారు నె
ఱింగినదే. విహారము లని వ్యవహరింపఁబడు జైనబౌద్ధులదేవళము లాదేశ
మందు సాంద్రముగా నుండుటచేత దాని కయ్యపరనామము సార్థక మయి
సంభవించినది- తాదృశబౌద్ధాదివిపక్షమతభూయిష్ఠరాష్ట్రములోనివాఁడు గ
నుకనే మతాంతరుల యొత్తుడువలన నీలాటినాటక మాకాలమునఁ దప్పక చే
యవలసినయవసర మాకృష్ణమిశ్రునకుఁ దటస్థించి యుండు ననియు స్ఫురించు
చున్నది.

కీర్తివర్మమహారాజుపేరోలగమున నీనాటకము ప్రయోగింపఁబడినట్లు
స్పష్టముగా నిందుఁ జెప్పఁబడియున్నది గనుకను, దత్కీర్తివర్మ క్రీస్తుశకము
౧౦౬౦వ సంవత్సరమందు మగధరాజుగా నుండెనట్లు తెలియవచ్చుచున్నది గ
నుకను, క్రీస్తుశకమున నేడవ శతాబ్దము ప్రారంభమునఁగాని కించిదూనము
గాఁ దన్మధ్యమునఁగాని యీగ్రంథము విరచిత మయినట్లు లూహింప నయ్యె
డిని. పూర్వము మిశ్రబిరుదాంకితు లగుబ్రాహ్మణు లందఱిలో సుప్రసిద్ధుఁడు
ను బూర్వమీమాంసాశాస్త్రమునం దప్రధృష్యుఁడును నయి కర్మమువలననే
మోక్షప్రాప్తి యనియు,సన్న్యాసము కూడ దనియు వేదాంతశాస్త్రమునకుఁ
బ్రబలవిరోధి యయి వాదించెడుమండనమిశ్రుని శ్రీమచ్ఛంకరభగవత్పాదుల
వా రోడించి యాయనచేత నద్వైతమతము నొప్పించి చిట్టచివర కాయనకుఁ

గూడ సన్న్యాస మిప్పించి తనశిష్యునిగాఁ జేసికొన్నట్లును, దరువాత మండనమిశ్రుఁడుగూడ నద్వైతసిద్ధాంతగ్రంథములు గొన్ని రచియించినట్లును బుస్తకములవలనఁ దెలియవచ్చుచున్నది గావున, నేతన్నాటకకర్త యయినకృష్ణమిశ్రునకు ముం దనేకశతాబ్దములక్రిందట బూర్వమీమాంసామతమే మిశ్రులలోఁ బ్రబలియుండి కాలక్రమమున నీతని నాఁటికి వారిలోనద్వైతమతము పరిపాటి యయినట్టులు మాత్రమేకాక, పూర్వమీమాంసకులయభిప్రాయము గూడ వేదాంతశాస్త్రమునకనుకూలముగాఁ గొంతవఱకు మాఱినట్లును నేతద్గ్రంథమువలనఁ దెలియ నగుచున్నది. దీనియందాఱవయంకములోఁ, గుమారిలస్వామిబుద్ధికి మెచ్చి వివేకుఁ డాతని నాయుష్మంతుఁడవు గమ్మని యాశీర్వదించినట్లు వ్రాయఁబడియున్నది. ఈకుమారిలస్వామియనునాతఁడు పూర్వమీమాంసావార్త్తికాదిమహాగ్రంథములు రచియించి క్రీస్తుశకము నేడవశతాబ్దమునడుమ బౌద్ధమతోన్మూలనమునకయి పాటుపడి బహుప్రసిద్ధిని బొందినవాఁడు. కాఁబట్టి పయియంశములను సామరస్యముతోఁ బరిశీలించినఁ గృష్ణమిశ్రుఁడును గుమారిలస్వామియు సమకాలీను లయి యంతకుఁబూర్వము పరస్పరవిరుద్ధములుగా నెంచఁబడుచున్నకర్మబ్రహ్మప్రతిపాదకపూర్వోత్తరమీమాంసాశాస్త్రములకు నైకమత్యము గల్పించి విమతమతవిధ్వంసకులును నిజమతసంస్థాపకులును నయి, యన్యోన్యమైత్రిని నెగడినారని బహుధా గోచరించుచున్నది. అయినను మొత్తముమీఁద నీయంశ మనుమేయము గావున విశేషజ్ఞులసువిమర్శనమే దీనికిముఖ్యప్రమాణము.

క్రీస్తుశకము ౧౫ వశతాబ్దము కడపటఁ గృష్ణదేవరాయలతండ్రి యగునృసింహరాజుకాలమున నెగడియున్నట్లు దెలియ వచ్చెడునందిమల్లయ్య, ఘంటసింగయ్యయను మేనమామమేనల్లు రిరువురుకవులు గలసి యీనాటకమును బూర్వము దెలిఁగించి యున్నారు. అయినను వారు దీని నాటకరూపముననుంచక కావ్యధోరణికి మార్చుటచేత నక్కడక్కడ మూలములో లేనిసంగతులు గూడఁ జేర్చి కొంత పెంచి వ్రాసియున్నారు. ఆకావ్య మయిదాశ్వాసములు గలది.

నేను దీనిని నాటకరూపముననే యాంధ్రీకరించితిని గావున నెక్కడఁగాని మూలభిన్నముగా మార్పవలసిన యవసరము నాకుఁ దటస్థింపలేదు. అయినను బుద్ధిమాంద్యమున నే నిందుఁ జేసినలోపము లనేకము లుండవచ్చునని నిశ్చయముగాఁ దలఁచుచున్నాను. లోకోపకారు లయినపండితులు వానిని విమర్శించి తెలిపినయెడల వారి కనేక వందనములు చేయుచు వీ లయినప్పు డా

తప్పులను సవరించుకొనెదను.

నే నీగ్రంథము వ్రాసి ముగించి యించు మించుగా రెండు సంవత్సరములు గావచ్చినది; కాని వెంటనే ముద్రాయితము కాక పోవుటం జేసి యెల్లయెడల వ్యాపింపక యింటిలోనే గుంట పూవులు పూచుచుండెను. అట్లుండఁగా ౧౯౧౨ వ సంవత్సరము నవంబరు నెలలో.—

సీ॥ ఒకనాఁడు నే బడి నుండ నాకస్మిక మరుదెంచి యాచార మాచరించి।
"చదువ్రఁ జాలించి నీసన్నిధి వీడొకని యేలూరిలో నే వకీలుపనిని।
గుదిరియున్నది మొదలొకని లోఁ దలంతు మీపొత్త మేదైన నచ్చొత్తఁ జేయ
నాకోర్కి తీఱుభాగ్యం బెన్నినాళ్లకుఁ జేకూఱె; నే నాదు చెలిమి కాఁడు।
గూడె స్థాపించినా మచ్చుఁగూట మొకటి। గాగితముమాత్ర మింపువే (గంబ మీప్ర
బోధచంద్రోదయమ్ము సమ్ముద్రితమ్ము। నర్పియంపింతు" నని సవిన (యతఁబలికి॥

తోడనే యీనాటకము దనతోఁ దీసికొనిపోయి శక్య మయినంత త్వరలోఁ దనవాగ్దానమును జెల్లించుకొని, యీకాలమునఁ గూడ నుపాధ్యాయులయందుఁ బ్రేమగలవిద్యార్థులు లేక పోలే దనుమాటకుఁ బ్రథమసాక్షియగు సత్తిరాజు సీతారామయప్రధానుని నెనరున కలరి యాతనికి దీర్ఘాయురారోగ్యాదులు ప్రసాదింప వలయు నని యీశ్వరుం బ్రార్థించుచున్నాను.

మఱియు నేతదుత్తమోత్తమనాటకము నాంధ్రీకరించునప్పుడు నాకవ్యాజప్రేమమున మహాసహాయు లయినయాకుండి వ్యాసమూర్తి శాస్త్రిల వారికిఁ గృతజ్ఞతతో నభివాదనము సేయుచున్నాను.

౧౬-౫-౧౯౧౩ విజయ సం॥ వైశాఖశు౧౩ శుక్రవారము. శా॥ ౧౮౩౫ సంవత్సరము. రాజమహేంద్రవరము.	వడ్డాది సుబ్బారాయఁడు.

శుద్ధపత్రిక.

పుట.	పంక్తి.	తప్పు.	ఒప్పు.
౪	౧౦	షాధము	షాధమ
౧౪	౧౫	దంభుఁడు	దంభము
౨౧	౨	ప్రభువు	ప్రభావు
౨౩	౧౭	చంద్రార్ధ	చంద్రార్ధ
౩౦	౨	సర్వధా	సర్వథా
,,	౧౮	నె మెట్టు	న నెట్టు
,,	౧౯	ణణా	రణా
౩౧	౨౭	ఈలా	యీలా
౩౨	౨౧	గలదు	గలఁడు
౪౨	౪	సఖీ?	సఖీ!
,,	౨౬	భృచ్ఛిల	భృచ్ఛిల
౫౦	౧౪	నివిగో	నిదిగో
,,	౧౬	మసరు	మసక
౫౬	౧	శ్రద్థ	శ్రద్ధ
,,	౨౦	ధాత	ధాత
,,	౨౧	మాంతకు	మాంతకుఁ
,,	,,	బహుధా	బహుథా
౫౭	౧౮		శ్రద్ధా
౫౮	౬	కానిః	కానీ.
,,	౧౨	గాగిలించు	గాఁగిలించు
౬౦	౨౪	సదృశము;	సదృశము,
౬౨	౨౭	దేనిఁ బ్ర	దేని ప్ర
౬౫	౧౭	నెకొడి	నెకొడ
౬౬	౧౨	నర్థ	నర్థ
,,	౩౦	సర్గంబులం	సర్గులఁ
౬౮	౧౭	గొక్కడికి	గొక్కడికు
౭౩	౧౦	ఎవ్వనిచేజనించు	ఎవ్వనియందుఁ దోఁచు
౭౫	౧౭	నకొడి	నకోడ

పుట.	బంతి.	తప్పు.	ఒప్పు.
౧	౨౬	గొందఱఁకు	గొందఱకు
౪	౭	మేదేనినొక	మేదేనియొక
౫	౮	జకనం	జనకం
,,	౧౪	ప్రభృతులును.	ప్రభృతులును,
,,	౨౧	మిధ్యా	మిథ్యా
౭	౧౮	జూడక.	జూడక,
౮	౪	కాకుండజేయు	కాకుండఁజేయు

ఈనాటకమందువచ్చు పాత్రములు.

ప్రథమాంకమున.

సూత్రధారుఁడు—నాటకము నడుపువాఁడు.

నటి—సూత్రధారునిభార్య.

కాముఁడు—మహామోహుని సేనానాయకుఁడు.

రతి—కామునిభార్య.

వివేకుఁడు—కథానాయకుఁడు, రాజు.

మతి—వివేకునిభార్య.

ద్వితీయాంకమున.

దంభుఁడు—మహామోహకింకరుఁడు.

అహంకారుఁడు—మహామోహకింకరుఁడు.

వటువు—దంభుని శిష్యుఁడు.

మహామోహుఁడు—వివేకునిశత్రువు.

చార్వాకుఁడు-వానిశిష్యుఁడు—నాస్తికులు,మహామోహపరిజనులు.

దౌవారికుఁడు—మహామోహద్వారపాలకుఁడు.

పురుషుఁడు—మహామోహునకును త్తరము దెచ్చినవాఁడు.

క్రోధలోభులు—మహామోహుని సేనానులు.

తృష్ణ—లోభునిభార్య.

హింస—క్రోధునిభార్య.

విభ్రమావతి—మహామోహునిపరిచారిక.

మిథ్యాదృష్టి—మహామోహుని భోగస్త్రీ.

తృతీయాంకమున.

శాంతి—వివేకునిపరిచారిక.

కరుణ—శాంతికిసఖి.

దిగంబరసిద్ధాంతుఁడు—క్షపణకుఁడు, ఆర్హతమతస్థుఁడు, మహామోహకింకరుఁడు, పాషండుఁడు.

శ్రద్ధ—క్షపణక బుద్ధాగముల పరిచారిక. తామసి.

భిక్షువు—బుద్ధాగముఁడు, సౌగతుఁడు, మహామోహకింకరుఁడు, పాషండుఁడు.

కాపాలికుఁడు—సోమసిద్ధాంతుఁడు, మహామోహకింకరుఁడు, పాషండుఁడు.

కాపాలిని—కాపాలికుని పరిచారిక, రాజసశ్రద్ధ.

చతుర్థాంకమున.

మైత్రి—శ్రద్ధకుఁ బ్రియసఖి.

శ్రద్ధ—సాత్త్వికి, వివేకునిపక్షమునఁ బని చేయునది.

ప్రతిహారి—వివేకునిపరిచారిక.

వస్తువిచారుఁడు—వివేకుని సేనాని.

క్షమ—వివేకుని సేనానాయకురాలు.

పురుషుఁడు—వివేకసేవకుఁడు.

సారథి—వివేకుని తేరుగడపువాఁడు.

పంచమాంకమున.

విష్ణుభక్తి—వివేకుని యిష్టదేవత.

మనస్సు—వివేకమహామోహాదులజనకుఁడు.

సంకల్పుఁడు—మనస్సు బిడ్డలలోనొకఁడు.

సరస్వతి—మనస్సు నూఱడింప వచ్చిన దేవత.

వైరాగ్యుఁడు—మనస్సుకుమారుఁడు, వివేకునిపక్షమువాఁడు.

షష్ఠాంకమున.

పురుషుఁడు—జీవుఁడు

ఉపనిషత్తు—శాంతిశ్రద్ధాదుల ప్రయత్నమున వివేకునకు లభించినపట్టపురాణి.

నిదిధ్యాసనుఁడు—విష్ణుభక్తిదేవి వివేకునికడకుఁ బంపినదూత.

ప్రబోధచంద్రుఁడు—వివేకోపనిషత్తులకుఁ గలిగినపుత్త్రరత్నము.

శ్రీరస్తు.

ఇష్టదేవతాప్రశంసనాదికము.

శ్రీమదనంత మచింత్య మ
నామయ మద్వయ మఖండ మానంద మజం
బై మానిధ్యేయం బగు
ధామంబుఁ బ్రశాంత మే సదా సేవింతున్॥

చ॥ నిదురయు నోగిరం బుడిగి నిండ గడించి సువిద్యవిత్తమున్
బదిలము సేసి పుస్తకపు భాండములన్ దివిఁ జన్నపెద్దలన్,
గొదుకక యక్కొటార్లు విడఁగొట్టి యుదారత నక్షయార్థముల్
గొదగొనువారి కిచ్చుచును గూర్చుచు నున్నబుధాళి నెన్నెదన్॥౨॥

తే॥గీ॥ వీరశృంగారమయ వేణివిక్రమోర్వ
శీయములఁ మున్ను దెల్గు చేసితి;మ తిపుడు
శాంతమయ మవ్యయానందజనక మగుప్ర
బోధచంద్రోదయం బాంధ్రముగ నొనర్తు॥౩॥

చ॥ తెలిసినవాఁడ నంచు నిది దెల్గొనరింపఁ దలంప; నీశ్వరా
త్యలఘుఘృణోపలబ్ధకవితామృతవాహిని నద్దగింపఁగా
నలవి యొ కింత గామిఁ జూఁడి; యార్యులు దీనిరసంబుఁ గ్రోలుఁడీ
నలుసులు సద్విమర్శనమునన్ వడఁబోసి శుచిం బొనర్చుచున్॥౪॥

తే॥గీ॥ సకలవేదాంత సిద్ధాంత సారవేది
కృష్ణమిశ్రుని గూఢార్థకృతి యిదేడ?
దీని తెన్నింత యెఱుఁగక తెనుఁగు సేయఁ
బూను నే నేడ? నీశుఁడే పూనిక నెఱపు॥౫॥

క॥ అని యిష్టదేవతాసే
వనమును, విద్వత్కవిస్తవనమును, విజ్ఞా
పనమును, మాతృకగుణ భా
వన మొనరిచి రచన కెలయుఁ॥సు॥రాయకవిన్॥౬॥

శ్రీ ర స్తు.

శ్రీ పరమాత్మనే నమః.

ప్రబోధచంద్రోదయము.

నాంది.

పట్టపగంటి వేవెలుఁగుభాసుల వెల్లువయట్టు లక్షతన్
గట్టిగఁదోఁచిముజ్జగము, క్రమ్మఱ స్రక్ఫణిభోగభాతి నెం
దట్టియడంగుఁదజ్జ్ఞనకు, నయ్యమలంబును స్వాత్మబోధమౌ
నట్టియఖండచిత్సుఖమహస్సు నజస్ర ముపాస్తిఁజేసెదన్॥

మఱియు-

శా॥ అంతర్నాడిని జంద్రమౌళి నియతిం బ్రాణావరోధంబు నం
తంతం జేయఁ, బ్రశాంతచిత్తత సహస్రారంబునన్ సౌఖ్యచి
త్సాంతత్యంబునఁదోఁచు పూర్ణమగు ప్రత్యగ్జ్యోతి, తద్వ్యక్తఫా
లాంతర్దృక్పటుస్ఫుటీకృతమునా నత్యున్నతిన్ వర్తిలున్॥౨॥

(నాంద్యంతమున)

సూత్రధారుఁడు——అతివిస్తరమేటికి? సమస్తసామంతచక్ర చూడామణి మరీచిమంజరీనీరాజితచరణారవిందుండును, బలవదరినివహావక్షస్తట కవాటపాటన ప్రకటితనరసింహరూపుండును, ప్రబలతరనరపతికుల ప్రళయమహార్ణవమగ్న మేదినీసముద్ధరణ మహావరాహుండును, నిఖిలదిగ్విలాసినీ కర్ణపూరీకృత కీర్తిలతాపల్లవుండును, సకలకకుబంత తుండాల వ్యాలోలకర్ణతాళాస్ఫాలన బహుళతరపవనసంపాత నర్తితప్రతాపానలుండును నగు శ్రీమద్గోపాలుండు నన్నవలోకించి సబహుమానంబుగా——"సూత్రధార! మామక సహజసుహృదుండగు నీకీర్తివర్మమహారాజు దిగ్విజయవ్యాపారంబుకతంబున బ్రహ్మానందరసా

నుభూతి కభ్యంతరంబు సంభవించుటంజేసి బహువాసరంబులు సము
న్మీలిత వివిధవిషయరసస్పర్శదూషితంబుగాఁ గాలక్షేపంబుఁ జేసితిమిగా
ని, యిప్పుడు మేము కృతకృత్యతను బొందినారము.

మ॥ మథియింపంబడి రుర్వరాధిపు రిపుక్ష్మాపాలముఖ్యుల్; జగ।
త్ప్రథితామాత్యులచే సురక్షవడ సెన్ ధాత్రీతలం బెల్లఁ; దత్।
పృథుసామ్రాజ్యము, ధారుణీశమకుట శ్రేణీసమర్చ్యంబుగాఁ,।
బృథులాంభోనిధిమేఖలావలయితోర్వీంబర్వె నిర్వ్యగ్రమై॥ ౩॥

మేమందుచేత నియ్యవసరంబున శాంతరసప్రాయ ప్రయోగాభినయంబు
నవలోకించి యానందింపఁ గోరుచున్నాము. పూర్వము జగద్విశ్రుతుండగు
కృష్ణమిశ్రుండు ప్రబోధచంద్రోదయంబను నాటకరత్నంబును నిర్మించి, త
త్ప్రయోగంబున సర్వజనహృదయాహ్లాదంబుగావింప మీకభ్యనుజ్ఞ దయ
చేసియుండెనుగదా! ఇత్తఱి మీరీకీర్తివర్మమహారాజు సమక్షంబునఁ దదు
త్తమప్రబంధంబు నభినయింపవలయు- సదస్యులతోఁగూడఁ దత్ప్రయో
గంబుఁజూడ నియ్యేకిమీఁదు వేడుకపడుచున్నవాఁడు." అని నాకానతిచ్చి
నాఁడుగదా! నేనింటికిఁబోయి నాభార్యనుబిలిచి సంగీతమారంభించెదను.
(నడచి తెరవంకఁజూచి) కొమ్మా! ఇటురమ్మా.

నటి—(ప్రవేశించి) ఇదిగో! వచ్చితినార్యపుత్ర! నాకేమి సెలవు?

సూత్ర—ప్రియురాలా! నీవెఱిఁగినదేగదా!

మ॥ కలఁ డక్షీణవిపక్షపార్థివ చమూకాంతార మూర్ఛన్మహా।
జ్జ్వలతేజోదహనావలీఢ భువనశ్వభ్రుండు, విశ్వప్రపూ।
ర్ణలసత్కీర్తి, శితాసిమాత్రనిజమిత్ర త్యాజితాసుద్విష।
త్కులభూస్థాపితకీర్తివర్మనృపుఁడా గోపాలచంద్రుండిలన్॥ ౪॥

మ॥ సమరక్షోణులు నేఁడు నున్మదపలాశస్త్రీ కరాస్ఫాలనో।
ద్యమవల్గన్నృకపాలతాలరవ నృత్యద్భూతసంఘాతలై।
తుములప్రక్రియఁబాడు నుద్ధతమరుత్క్షుభ్యద్వ్యపోత్థుంభవా।
టమహాయశుహావస్ఫుటధ్వనులతోడన్ దద్యశశ్చంద్రికల్॥ ౫॥

అమ్మహామహుండిప్పుడు శాంతపథప్రస్థితుండై వినోదార్థము ప్రబో
ధచంద్రోదయనాటకము నభినయించుట కనుజ్ఞయొసంగినాఁడు. కా
వున భూమికాపరిగ్రహణార్థము భరతవర్గమున కాదేశింపుము.

నటి—(ఆశ్చర్యముతో) ఆర్యపుత్ర! ఆశ్చర్యమాశ్చర్యము. అ[illegible]

భుజబల విక్రమైకనిర్భర్త్సిత నిఖిలభూపాలవారుండగు నాగోపాలవీరుం డాకర్ణాకృష్ట కఠినకోదండదండ బహుళవర్ష చ్ఛరనికర జర్జరీకృత తురంగతరంగఘాలంబును, నిరంతరనిపత త్తీక్ష్ణనిక్షిప్త నిస్త్రింశసహస్ర పర్యస్తోత్తుంగమాతంగమహీధరంబును, భ్రమద్భుజదండ ప్రచండమందరాభిఘాత ఘూర్ణత్సకలపదాతిసలిలసంఘాతంబును గాఁ గర్ణసైన్యసాగరంబును, దుగ్ధపాథోనిధానంబును మధుమథనుండునుంబోలె నిర్మథించి, సమంచద్విజయలక్ష్మీ మంగళకరగ్రహణంబు గావించినవాఁడుగదా! అట్టియద్భుతోదార వీరచరితున కిట్టిసకలమునిజనశ్లాఘనీయ మహోపశమం బెట్లు గలిగెను?

సూత్ర—ప్రేయసీ! బ్రాహ్మణతేజంబు నిసర్గసౌమ్యంబుగదా! ఏదియేనికారణంబున నెప్పుడేనివికారంబునొందినను, గ్రమ్మఱ నదిస్వభావంబునే పొందుచుండును. సకలభూపాలకుల ప్రళయకాలాగ్నిరుద్రుండగు చేదిపతిచేతఁ, జంద్రాన్వయపార్థివుల పృథివ్యాధిపత్య మున్మూలితంబుకావుటం జేసి, తదీయపునరుద్ధారణంబున కమ్మహాత్మున కట్టిసంరంభంబు పొడమిన యది- అదియట్టిదయగుఁబాడు.

గీ॥ చటుల కల్పాంతసంభూత సప్తసప్త
వాతసంఘట్ట లంఘితావనిధరాగ్ర
మగు మహోదధి కెప్పటియట్లకావె
స్థైర్యమర్యాదలును బ్రసాదమును బిదప॥౬॥

మఱియు నోమధురవాణీ! తథావిధపౌరుషభూషణులగు పూరుషరత్నంబులు, శ్రీమన్నారాయణాంశంబున భూతహితార్థంబు భూతలంబు నందవతరించి, నిష్పాదితాత్మీయప్రయోజనులయి పెండియుఁ బ్రశాంతభావంబునే పొందుచుందురు. ఇందుకు శ్రీభృగురామమూర్తియే మనకునిదర్శనము. చూడుమమ్మహామహుండు.—

శా॥ రాజన్యోచ్ఛ్రితరాంసకూటదళనా రంభారటద్ఘోరధా
రాజిష్ణుస్వపరశ్వథక్రథిత సర్వస్త్రైణవృద్ధార్భకో
ద్భ్రాజిష్ణుండయి, తద్వసాపిశిత మేదఃపంకిలాసౌఘవే
ణీజాతావభృథుండుగాఁ డెకడిమిన్ ద్రిస్సప్తపర్యాయముల్॥౭॥

క॥ ఆపరశురాముఁడును నటు
భూపతులోన్మూలనమున భూమిభరంబుం

ప్రబోధచంద్రోదయము.

చాపి,తపంబున సంప్రాప్త।
కోపానలుఁడై ప్రశాంతిగాని మునిగాఁడే॥౮॥

ఆలాగే కృతకృత్యతవల ననిప్పుడు గోపాలుండును బరమోపశమనిష్ఠాగరిష్ఠుండై యున్నవాఁడు. చూడు.

క॥ కలికి! వివేకుఁడు మోహు।
న్బలెఁ గర్ణుని గెలిచి, బోధునకుఁ బోలెను దాఁ।
గలిగింపఁడె యభ్యుదయము।
నిలలోఁ బ్రియకీర్తివర్మ నృపతిలకునకున్॥౯॥

(తెరలో)

ఆ! పాప! శైలూషాధము! మేము బ్రతికియుండఁగానే, మాస్వామియగు మహామోహునకు, వివేకునివలనఁ బరాజయమును జెప్పుచున్నావురా?

సూత్ర—(తొట్రుపాటుతోఁ జూచి)

ఉ॥ గుత్తపుగబ్బిగుబ్బ లెదగ్రుచ్చిచనన్, బులకించుబాహులం।
బిత్తరి తన్ రతీయువతి బిగ్గఁగవుంగిటఁజేర్చ, లోకముల్।
మత్తిలఁజేయుచున్,మదవిలాసవిఘూర్ణిత నేత్రపద్ముఁడై,।
క్రొత్తముదంబు గన్నులకుఁగూర్చుచుఁ గాముఁడొయారి వచ్చెడున్॥

నేనిప్పుడన్నమాట కితఁడుకాతాళంబెత్తినట్టు గనుపట్టుచున్నవాఁడు; కాఁబట్టి యిట్టిపట్టున మనకిచ్చోటనుండి సురుఁగుటయే మహాశ్రేయము.

(నిష్క్రమించుచున్నారు-ప్రస్తావన.)

(తరువాత ముందుచెప్పినచొప్పునఁ గందర్పుఁడును రతియుఁ బ్రవేశించుచున్నారు)

కాము—(క్రోధముతో) ఆ! పాప! శైలూషాధమ! మేము బ్రదికియుండఁగానే మాస్వామియగు మహామోహునకు వివేకునివలనఁ బరాజయమును జెప్పుచున్నావురా? ఓరోరిభరతాధమ!

ఆ॥ వె॥ ఎంతదాఁకఁదాఁక నిందీవరాక్షుల।
సోయగంపు వాలుఁజూపుఁదూపు।
లంతదాఁక నేకవా కనంబడు శాస్త్ర।
భవవివేక మెట్టిప్రాజ్ఞునకును॥ ౧౦॥

ఉ॥ నీటగుహర్మ్యమాలికలు, నిద్దపుఁజూపుల నూత్నబాలికల్,
తేటులపాటలంబొలుచుతీవలు, వెన్నెలరేలు, మల్లికా।

వాటులకమ్ము దెమ్మెర లవంధ్యశరమ్ము లివన్నినాక హాహా।
మేటివివేక వైభవ మిఁకేటిప్రబోధమహాహాదయం బిలక్॥౧౨॥

రతి—ప్రాణనాథ! మనమహామోహమహారాజునకు వివేకుఁడు భీకరప్రతి
పక్షుండనియే నేననుకొనియెదను.

కాము—ప్రాణేశ్వరీ! స్త్రీస్వభావమువలన సులభముగా, నీకిట్టికొంత
మాలిన పిఱికితనంబుగలిగినయది. అంతెగాని వివేకునివలన నేమిభ
యము? చూడుచూడు.

క॥ నావిలునమ్ములు, నవలా!
పూవులెయౌఁగాక, త్రుటియు, ముజ్జగముల స।
ద్దేవాసురులైన, మదా।
జ్ఞావర్తులుగాకపోవఁ, గలవేగుండెల్?॥౧౩॥

అపునుగదా—

మ॥ పురుహూతుండు మహర్షి పత్నియన కజ్ఞుం దొజ్జయిల్లాలు నా।
కరవిందాసనుఁ డట్లుబిడ్డన కహల్యం, దార, వాణిఁ గరమిం।
పరె? నాచేఁ దఱుచెవ్వఁడిట్లు పెడతోవల్ద్రొక్కఁ డూహింప మ।
త్కరకాండంబుల కేభరంబు భువనోన్మాథక్రియాధుర్యతక్॥౧౪॥

రతి—ప్రాణేశ్వరా! అవునదిసత్యమే, గాని, మహాసహాయసంపన్నుండుగా
వున శాత్రవుండు మనకు భయనిదానుఁడు; అతనికి మహాబలులగు యమ
నియమాదు లమాత్యులని వినుచుందుముగదా!

కాము—ప్రాణేశ్వరీ! యే యమనియమాదులువివేకున కమేయబలాఢ్యులగు
నమాత్యులని నీవెంచుచున్నావో, వారందఱు మేము మోహరించునంతన
విచ్ఛిన్నమొగ్గుగం బలాయనంబు నొందుదురు. ఇదినిశ్చయముచూడు.

గీ॥ క్రోధుఁడెగువ, నహింస దా రూపుసెడదె?
యబల! నామ్రోల బ్రహ్మచర్యాదు లెంత?
తెలియ, సత్యాపరిగ్రహాస్తేయులనఁగ।
లోభవీరున కొకకెక్కిలోనివారె?॥౧౫॥

యమ నియ మాసన ప్రాణాయామ ప్రత్యాహార ధ్యాన ధారణాసమా
ధులు, నిర్వికారైకచిత్తసాధ్యులుగావున, వారినుమ్మాలించుట తృణప్రాయ
ము; విశేషించి యీయెనమండ్రకు, జవరాండ్రు మృత్యుప్రాయలు, కాఁబ
ట్టి వీరు తప్పక నాచారింబడినవారే. సందేహమేమి?

క॥ పరిహాస విలాసేక్షణ।
పరిరంభణ ఖేలనములు భాషలటుండన్।
దరుణుల సంస్మరణంబును।
గరిగమన! మనోవికార కారణముగదా!॥౧౬॥

సుందరీ! యింకొకటి యాలకింపుము మనమహారాజున కత్యంతప్రియు లగు మదమాత్సర్యదంభాదుల కోహటించి తుట్టతుదకు వీరందఱుఁ దత్ప్రధానమంత్రియగు నధర్మునే యాశ్రయింతురు.

రతి—ఆర్యపుత్ర! మీకును శమదమవివేకాదులకునుగూడ నుత్పత్తిస్థాన మేక మేయఁట.

కాము—ఆ! ప్రియురాలా! మాకుత్పత్తిస్థాన మేకమన నెంత?అందఱకును జనకుఁడే యభిన్నుఁడు. చూడు.

క॥ మునుపీశ్వరసంగంబున।
మనసను విశ్రుతుఁడు సుతుఁడు మాయకుఁబుట్టెన్।
దనకలిమి నతఁడు మున్జగ।
మును జేసి,కులద్వయముగఁ బుట్టించెమమున్॥౧౭॥

వినుమామనస్సునకుఁ బ్రవృత్తియు, నివృత్తియునని యిద్దఱుభర్మపత్నులు. అందు మహామోహప్రధానమగుకులము ప్రవృత్తికిని, వివేకప్రధానమగు కులము నివృత్తికినిగలిగినయవి.

రతి—ఆర్యపుత్ర! అట్టులయినచో నన్నదమ్ములకు మీకీలాటిపరస్పరవైర మేమికారణము?

కాము—సుందరీ!

క॥ ఏకామిషమునఁ గలుగును।
బ్రాకటముగ సోదరులకుఁ బటువైరము ల।
ట్లాకురుపాండవులకు,గో।
త్రాకారణ ముగ్రసాంపరాయము గాదే?॥౧౮॥

ఈసర్వజగత్తును మాపితార్జితము;పితృవాల్లభ్యమున నదియంతయు మేమే యాక్రమించుకొని యున్నవారము. వారలప్రచార మిందువిరళము-అందుచేత నప్పాపాత్ములిప్పుడు దండ్రిని మమ్మునుగూడ నున్మూలింతమని తదుద్యోగంబు సేయుచున్నవారు.

రతి—హరిహరీ! ఈమాత్రపు వైరముచేతనే వారింతటి పాపకర్మము

కొడిగట్టినారాకొట్టనిందు- అందుకువారాలోచించిన యుపాయమేమి?
కాము—ఇందుబీజము కొంచెమునిగూఢముగా నున్నది.
రతి—అట్లయిన నదియుగ్గడింప రేమి యార్యపుత్ర?
కాము—అబలా! నీవుస్త్రీస్వభావమువలన బెగడుగుదు తువని యాచెడుగుల దుడుకుదనము నుడువకున్నాను.
రతి—(భయముతో) అదియేలాటిది ప్రాణనాథ?
కాము—ప్రేయసీ! వెఱవకు వెఱవకు-ఇది యూరకయాయభాగ్యుల యడియాసయేసుమా-ఈకింవదంతి నాలకింపుము. మాకులమందుఁ గాళరాత్రికల్ప యగు విద్యయనునొకక్రూరరాక్షసి పుట్టఁగలదఁట.
రతి—అయ్యోయ్యో! మనకులమందే రాక్షసియనుటచే నాగుండె లదలిపోవు చున్నవి.
కాము—ప్రియురాలా! జడియకుజడియకు. ఇది వట్టి పుక్కిటిపురాణమే గాదా?
రతి—నాథా! ఆరక్కసియేమి సేయును?
కాము—ప్రేయసీ! ఆలకింపుము.

"మ॥ పురుషుండుజ్ఝితసంగుఁ డాయనకు నొప్పంజాయ మాయాఖ్యఁ దాఁ
బురుషస్పర్శమెఱుంగకే, మనసునాఁబుత్రుంగనెన్ ; వాఁడనం
తరమీలోకముఁగాంచె ; నాతనికి విద్యాకన్యసంజాతయై
పరిమార్చుందలిదండ్రులన్, సహజులన్ ; భక్షించువంశద్వయిన్"॥౯॥

అనిప్రాజాపత్యసరస్వతి (ముండకోపనిషత్తు) చెప్పుచున్నది.
రతి—అయ్యో! ఆర్యపుత్ర! రక్షింపుమరక్షింపుము (కౌఁగిలించుకొనుచున్నది)
కాము—(స్పర్శసుఖమునభినయించుచుఁదనలో)

మ॥ గరుపాఱంగనునంగకంబులు, భయోత్కంపోన్నతోరోజని
ర్భరసంగంబలరారఁగాఁ, దరలతారవ్యాకులాలోకయై
హరిణీలోచన, రత్నకంకణరవప్రాంచద్భుజావల్లులం
బరిరంభంబునొసంగ, నాకుముదముల్, మైపారవశ్యం బగున్॥౧౦॥

(గాఢాలింగనముఁజేసికొనిప్రకాశముగా) ప్రియురాలా! వెఱవకు వెఱవకు మే ముజీవించియుండఁగా విద్యోత్పత్తి యెట్లులగును?
రతి—నాథా! ఆరాక్షసిపుట్టుట మీప్రతిపక్షుల కిష్టమగునా?
కాము—ఆ! వారికెంతయుసంతోషము.అదివివేకున కుపనిషద్దేవియందుఁ బ్ర

బోధచంద్రుఁడను సహోదరునితోఁగూడఁ బుట్టనున్నది- ఆవిషయములో నీ శమదమాదులందఱును మహోద్యోగంబుఁజేయుచున్నారు.

రతి—ఆర్యపుత్ర! ఆక్రూరరాక్షసి వారికిఁగూడ వినాశకారిణియేయైనపక్షమునఁ, దదుత్పత్తి యాదుర్వినీతుల కెందుకిష్టము?

కాము—సుందరీ! కులక్షయమునకుఁబ్రయత్నించెడు పాపకర్ములకు, స్వపరవినాశప్రత్యవాయ మొకటిలెక్కలోనిదా? చూడు.

ఆ॥ వె॥ వనిత! సహజమలినవక్రభావులభవం।
బాత్మహాని, జనకహాని దెచ్చుఁ।
దోయధరపథంబు ధూమంబువొందిఁ, తా।
ననలుతోడఁగూడ నడఁగిపోదె?॥౨౧॥

(తెరలో)

ఆ! పాప! దురాత్మ! మమ్మే పాపకారులనిదూఱుచున్నావురా. ఓరి చెడుగ! విను.

క॥ నిరతము కార్యాకార్యము।
లరయ కహంకారకలితుఁడై చెడుఁ దెరువుల్।
మరగి చరియించుమొఱకును।
నిరాకరింపంగవలయు నిజగురునైనన్॥౨౨॥

అనిపురాణవిదు లీపౌరాణికగాథ నుదాహరించుచున్నవారు- చూడు మహంకారానువర్తియయి మాజనకుఁడు జగత్పతియయిన పరమపితనే నిర్బంధించినాఁడు- అతనింగలిసి మోహాదులాబంధమును మఱింతబిగితముసేయుచున్నవారు.

కాము—(అవలోకించి) ప్రియురాలా! ఇదిగో! మాకులంబునం బెద్దవాఁడగు వివేకుఁడు దేవియయినమతితోఁగూడ నీలాగేవచ్చుచున్నాఁడు. చూడుమీమానధనుండు.

ఉ॥ ఏదియుశంకలేక, తమయిచ్ఛకువచ్చినదారి నేగురా।
గాదులచేతఁజెన్నఱి, కృశాంగమునన్ వెఱువేకిదాఁకిన।
గ్లాస్యై, దళమైనమంచుగవియం గలుషంబగుకాంతితోసుధా।
పాదుఁడునాఁ, గడుంగలఁతవాఱినదామతితోడఁదోఁచెడున్॥౨౩॥

కావున నిఁకమనకిక్కడనుండుట యుచితముగాదు.

(నిష్క్రమించుచున్నారు.)—విష్కంభము.

———

(తరువాత రాజయినవివేకుఁడును మతియుఁ బ్రవేశించుచున్నారు.)

రాజు—(ఆలోచించి) ప్రాణేశ్వరీ! ఈదుర్వినీతవటుని మదోన్మత్తప్రలాపము విన్నావుగదా! వీఁడు మమ్మే పాపకారులని యాక్షేపించుచున్నాఁడు.

మతి—ఆర్యపుత్ర! లోకులు తమతప్పుతా మెఱుంగుదురా?

రాజు—ప్రియురాలా! చూడు.

క॥ దురహంకారపరుల్, కడు
దురాత్ములు, మదాదు లమిత దుష్పాశములన్,
జిరము, చిదానందమయున్
నిరంజనునిఁ గట్టి, దీనునిఁ జేసి రజున్॥౨౮॥

అట్టి తామేమో పుణ్యకారులఁట! తన్మోక్షణమునకుఁ బ్రయత్నించు మేమే మో పాపకారులమఁట! ఆహా! దురాత్ముల గెలుపు!

మతి—ప్రాణేశ్వరా! ఆపరమేశ్వరుఁడు సహజానందసుందర స్వభావుండు, నిత్యప్రకాశుండు, విస్ఫురత్సకలత్రిభువనప్రచారుండు నని వినుచుందుము గదా! ఇట్టివాని నీదుర్వినీతు లేలాగున బంధించి మహామోహసాగరంబునం బడఁ ద్రోయఁజాలిరి?

రాజు—ప్రియురాలా! విను.

ఉ॥ సంతతధీరుఁడుం, బరమశాంతుఁ డవాప్తమహాదయుండు న
త్యంతనయుండు స్వస్థుఁడు నుదారమనీషుఁడు నయ్యుఁ బూరుషుం
డింతులమాయచేతఁ ద్యజియించెడు నైజపుధైర్యముం జెలీ!
యెంతయుఁ దన్నుఁ దా మఱచె నీతుఁడు నట్టులె మాయ చేరికన్॥౨౯॥

మతి—ప్రాణనాథా! అంధకారలేశవలన సహస్రమయూఖునకుఁ దిరస్కారము గలుగ నేర్చునా? విస్ఫురన్మహాప్రకాశసాగరుండగు నప్పరమేశ్వరున కున్మాయాభిభవ మట్టిదే గదా!

రాజు—ప్రాణేశ్వరీ! అవిచారసిద్ధయగు నీమాయ వారవిలాసినిలాగున నసత్యములైన భావములను దోఁపించుచుఁ బరమపురుషునిఁ బ్రతారించుచున్నది. చూడు—

ఉ॥ స్ఫాటికరత్నసన్నిభ విభాసురమూర్తికి విశ్వభర్తకున్,
గ్రాటముగా నొకానొకవికారమొనర్చె ననార్యమాయ యి
మ్మేటికి నిర్వికారునకు మేరుచి జాఱుదుగాని దానిదౌ
కూటమి ధైర్యపుంధనముఁ గోల్పడి దీనతఁ గానవచ్చెదున్॥౩౦॥

మతి—నాథా! ఆలాగయిన మఱి యాదుర్వినీతురా లయ్యుదారచరితు నీరీతిం బ్రతారించుట కేమి కారణము?

రాజు—రామా! యీమాయ యాయననట్లు చేయుట కొకప్రయోజనముగాని కారణముగాని గానరాదు. స్త్రీపిశాచికల కిదిస్వాభావికముగదా!

క॥ చొక్కింతురు, సోలింతురు, ।
సుక్కింతురు, వెక్కిరింతురున్, వెఱపింతురు ।
కొక్కింతు రేమి సేయరు ।
చక్కెరఁబోండ్లైపలఁదూఱి సదయులనరులన్?॥౨౭॥

ఇటవేలు కారణమును గలదుసుమీ.

మతి—స్వామీ! యదియేమి?

రాజు—ఈదురాచారురా లీలీలనాలోచించినది. "నేనువయసుదీఱినవృద్ధురాలను. ఈయనయును బురాణపురుషుఁడుగదా! విశేషించి స్వభావముచేతనే విషయసుఖపరాఙ్ముఖుఁడు. కాఁబట్టి నాపట్టినే పారమేశ్వరపదమునఁ బ్రవేశపెట్టెదను." అనితలపోసిన తనతల్లియభిప్రాయము ననుసరించి, నితాంతప్రత్యాసన్నతంజేసి తాదాత్మ్యమునొందినట్లున్నమనస్సు తాను నవద్వారపురంబులనిర్మించి.

ఆ॥ వె॥ ఒకరుఁడైనజనకుఁ బెకుఁడెలంగులఁ ।
దునిమినట్ల యందుఁద్రోసి, తనదు ।
పనులనెల్ల సతనిపైఁబెట్టుచున్నాఁడు ।
మహా, జపాదు లమలమణినిబోలె॥

మతి—ఆర్యపుత్ర! తల్లిచాతే పిల్లచాలందురుగదా!

రాజు—అనంతరము చిత్తజ్యేష్ఠపుత్త్రుం డగునహంకారుఁడను ముమ్మనుమఁడుదన్నాలింగనంబుఁజేసికోఁగా నప్పరమేశ్వరుండు-

చ॥ జనకుఁడితండు, తల్లి యిది, జాతుఁడ నేను, గళత్త్రబాంధవుల్, ।
తనయులు, శత్త్రుమిత్త్రులుఁ, గులంబు, బలంబుఁ, బొలంబు, విద్యయున్ ।
ధనమని చిత్తకల్పనలఁ, బాబుధుఁడయ్యు నవిద్యపేర్మిని ।
దను దనువిస్మరించి, వివిధంబగునిట్టికలల్ గనుంగొనున్॥౨౮॥

మతి—ప్రాణేశ్వర! ఇవ్విధంబున దీర్ఘదీర్ఘతరనిద్రావిద్రావితప్రబోధుండగు నప్పరమేశ్వరునకుఁ బ్రబోధోత్పత్తియెట్టులగును?

రాజు—(సిగ్గునమోమువాంచుకొనుచున్నాఁడు)

మతి—ఆర్యపుత్ర! యేమిది గురుతరలజ్జాభరంబున నమితశేఖరులై యుం
టిరి?

రాజు—ప్రేయసీ! ప్రాయికముగా మానవతులహృదయంబులీర్ష్యావంతం
బులుగావున నన్ను సాపరాధునిఁగా శంకించుకొనుచున్నాను.

మతి—ప్రాణేశ్వర! ధర్మార్థవ్యాపారప్రసక్తుండయి స్వసుఖప్రవృత్తుఁడగు భ
ర్తకు నిచ్ఛావిఘాతంబు సేయుస్త్రీలు గలరుగాని వారు వేఱు.

రాజు—ప్రియురాలా!

చ॥ చిరవిరహాభ్యసూయ వగఁజెందెదు మానిని, శాంతిముఖ్యతే।
చ్చరికను సాయమై, యుపనిషత్సతి నన్ను నుగూర్చి రేని, నీ।
వురువిషయంబులంటక ముహూర్తము మిన్నకయుంటివేని, జా।
గరము, సుషుప్తి, స్వప్నమును గామిఁ, బ్రబోధసుతోదయంబగున్॥ ౩౦॥

మతి—ఆర్యపుత్ర! దృఢగ్రంథినిబద్ధుం డగుకులప్రభునకు బంధమోక్షం బగు
నేనియయ్యుపనిషద్దేవితో దేవర నిత్యానుబంధులయి యుండవలయునని
నాపూర్వాభిమతము.

రాజు—దేవి యిట్లు ప్రసన్నురాలయినపక్షమున మామనోరథములు సి
చినవే. చూడు.

శా॥ ఓయింతీ! జగదాద్యు, నద్వయుని, నిత్యుం, బూరుషుంజేర్చి, మో।
న్మోహాంశంబులనార్చి, కట్టి, పుత్రులం ముందో్రసి, మృత్యుస్థునిం।
జేయంజాలినబ్రహ్మఘాతులకు, నేఁ జేయించి ప్రాణాంతిక।
ప్రాయశ్చిత్తము విద్యచేత, మరలన్ బ్రహ్మైక్యమున్ సల్పెదన్॥ ౩౧॥

కానీ ప్రబోధోత్పత్తికొఱకుం బ్రస్తుతవిధానమునకు శమదమాదుల నియో
గింతము.

(నిష్క్రమించుచున్నారు)

ఇది, శ్రీపరమేశ్వరవరప్రసాదలబ్ధసరసకవితాధురంధర వడ్డాది-
సాధువంశక్షీరనీరాకరరాకాసుధాకర రాచ్చనామాత్యపౌత్ర
హరితసగోత్ర పవిత్ర గుణకదంబలక్ష్మాంబాగర్భ
శుక్తిముక్తాఫల సూరపరాజప్రధానత
నూభవ విబుధవిధేయ సుబ్బరాయనామధేయాం
ధ్రీకృతంబగుశాంతరసాసార ప్రబోధచంద్రోదయనాట
కంబునందుఁ బ్రథమాంకము.

శ్రీ ర స్తు.

శ్రీ పరమాత్మనే నమః.

ప్రబోధచంద్రోదయము.

ద్వితీయాంకము.

(తరువాతదంభుఁడుప్రవేశించుచున్నాఁడు.)

దంభుఁడు—మహామోహమహారాజునాతో" వత్సా! దంభుఁడ! ప్రబోధోదయార్థము నిజామాత్యసహితముగా వివేకుఁడు కృతప్రతిజ్ఞుఁడయి, తత్తీర్థంబులకు శమదమాదులం బంపినాఁడు; కావున మనకు సంభవించెడు నీకులక్షయమునకు మీరవహితులయి ప్రతివిధానము చేయవలయును. ఈధారుణీమండలమున వారణాసీపురము పరమముక్తిక్షేత్రము. కాఁబట్టి నీవానగరమున కరిగి చతురాశ్రమంబులకును నిశ్శ్రేయసవిఘాతంబుకొఱకుఁ బ్రయత్నింపవలయు." ననియానతిచ్చినందున నే నీకాశీపట్టణము నించుమించుగా లోఁబఱుచుకొని యథానిర్దిష్టముగా స్వామికార్యము నెఱవేర్చితిని. నాపూనినవారిప్పుడు.

మ॥ వెలపూఁబోఁణుల యాననాసవపుఁదావిం జొక్కి, తన్మందిరం।
బులఁ, గందర్పమహోత్సవంబులను మాపుల్ వెన్నెలంబుచ్చి, మా।
నులు, సర్వజ్ఞులు, దీక్షితుల్, చిరహుతాగ్నుల్, బ్రహ్మవిజ్ఞానవం।
తులు దామంచును మోసపుత్తురు జగత్తుక్ ధూర్తులౌచుంబగల్॥౧॥

(చూచి) ఇదిగో! భాగీరథిను త్తరించి యెవ్వఁడో యొకతెరువరి యీలాగు వచ్చుచున్నాఁడు.

తే॥ గీ॥ జగములను బ్రింగుభంగి, వాగ్జాలమునను।
దాను గర్జించులాగభిమానమునను।
బ్రజ్వలించువిధంబునఁ, బ్రజ్ఞ చేతఁ।
బరిహసించెడు నట్లు చూపట్టు నితఁడు॥౨॥

ఈపురుషుఁడు రూఢిగా దక్షిణాధ్రప్రదేశంబునుండి వచ్చినవాఁడు గాఁ గలఁడు. కాఁబట్టి యీతనివలనఁ బూజ్యుఁడయినయహంకారునిసమాచా ర మెఱింగెదను.

తరువాత ముందుచెప్పిన లాగహంకారుఁడుప్రవేశించుచున్నాఁడు.)

అహం—ఓహో! జగమంతయు మూర్ఖబహుళ మయిపోయినది.

సీ॥ గురుమతం బశ్రుతిగోచరం బనవగతంబు కౌమారిలదర్శనంబు।
శాలికవాక్తత్త్వసార మజ్ఞాతంబు వాచస్పతిప్రోక్తభాష లెఱుఁగ।
రమ్మహోదధిసూక్త మైనఁ గ్రహింపరు తద్దురుక్తముమాట దలఁపనేల?।
మతిమంతులై పాశుపత శాస్త్రసంహతి సావధానంబుగాఁజదువుకొనరు॥
ఆ॥ వె॥ వాస్తవముగఁజూడ వస్తువిచారణ।
సూక్ష్మములకునెల్ల సూక్ష్మమౌర!।
స్వస్థచిత్తులగుచు సర్వజ్ఞులట్టు లె।
కఱణి నున్నవారు నరపశువులు?॥౩॥

(చూచి) వీర లర్థావధారణములేక, కేవలస్వాధ్యాయాధ్యయనమున నాసక్తు లగుచున్నారు; నిజముగా వీరు వేదవిప్లావకులు. (మఱియొకచోటికిఁ బోయి) వీరును దండిగా భిక్షలు దొరకునని సన్యసించిన పండితంమన్యులు; వీరూరక వేదాంతశాస్త్రమును వ్యాకులపఱిచెదరు.

(నవ్వి) తే॥ గీ॥ మహిని బ్రత్యక్షముఖ్యప్రమాణసిద్ధ।
మగుపదార్థంబునకు విరుద్ధార్థమరసి।
దెలుపువేదాంతములె శాస్త్రములగునేని।
బౌద్ధులం దేమితప్పు గన్పట్టుఁజూడ॥౪॥

ఛీ! వీరితోడి సంభాషణమును బాపహేతువు. (ఒందుకడకేగి) వీరు దురభ్యస్తాక్షపాదమతులగు శైవపాశుపతాదులు. కేవలము వీరు పశుప్రాయులు, పాషండులు. వీండ్రతోడ మాటలాడి నంతమాత్రమున నరులకు నిరయప్రాప్తి నిశ్చయంబు. కాబట్టి దృష్టిపథంబునుండి వీరిని దూరము గాఁబరిహరింపవలయును. (వేఱుచోటికిఁబోయి) ఓహో! వీరా—

మ॥ ఘనగంగౌఘతరంగ శీతలశిలాఘట్ట బ్రుసీబద్ధప
ద్మనిషణ్ణుల్, కుశముష్టిమండితభుజాదండుల్, కరండోజ్జ్వలుల్,।
మునివేశ్యక్ జరిగించుచున్ జపసరంపుం బూస లొకొక్కటిన్,।
ధనికద్రవ్యములన్ హరింతురు మహాదంభంబునన్ దాంభికుల్॥౫॥

(మఱియొకచోటికిం బోయి) ఇదిగో! వీరు త్రిదండివ్యపదేశంబునం బొట్టవోసి కొనుచున్న ద్వైతాద్వైతమార్గపరిభ్రష్టులు. (వేఱొకట-యెడకేగిచూచి) ఓహో! ద్వారోపాంతంబునంబాఁతి, యెత్తుగాఁగట్టిన వెదురుదండెంబుపయి, నుదికి యాఱవయిచిన వలిపెనీరాఁవి మడిదోవతులు తాండవింప, నితస్తతోవిన్యస్తంబులయిన కృష్ణాజినదృషదుపల చమసచషాలోలూఖల ముసలంబులచేతను, ననవరతహుతాజ్యగంధంబులై శ్యామలీకృతవ్యోమసీమంబులగు ధూమంబులచేతను నంగుమీఱి, గంగాతరంగిణికి నాతిదూరంబునం బొడకట్టు నీయాశ్రమపద మెవరిదిచెపుమా? ఎవ్వనిదే నొకగృహస్థునిదికాకతప్పదు. కానీ- ఈనెలవు పరమపవిత్రము. రెండుమూఁడుదినములు మా నివాసమున కిదియనువుపడును-(ప్రవేశించిచూచి) ఓహోహో!

చ॥ మొగము, భుజోదరంబు లురముం, జుబుకోరువు లోష్ఠజానువు।
స్థగళకపోలముల్, పాలుపెసంగఁగ మృత్తిలకాంకితంబులై,।
సిగతుద, వీనుదోయిఁ, గటిసీమను, గేలఁ గుశాంకురంబు లొ।
ప్పఁగనెలకొల్పి, వీఁడు వాడవాండినదంభుఁడువోలెఁ దోఁచెడున్॥౬॥

కానీ-వీనినిసమీపించెదను- (సమీపించి) కల్యాణంభవతామ్.

దంభు—(హుంకారమునవీనినపల్కుచున్నాఁడు)

వటువు—(ససంభ్రమముగావచ్చి) అయ్యా! బ్రాహ్మణా! నీవుదూరముగానే నిలుచుండుము- పాదప్రక్షాళనను చేసికొనిగదా యీయాశ్రమమునఁ బ్రవేశింపవలయును?

అహం—(క్రోధముతో) ఛీ! పాపపుఁదురుష్క-దేశమునఁ బ్రవేశించితిమి-శ్రోత్రియులయిన యతిథుల, నాసనపాద్యాదులచేతనయిన గృహస్థు లిక్కడ సత్కరింపకున్నారు.

దంభు—(హస్తసంజ్ఞచే నూఱడించుచున్నాఁడు)

వటు—దూరదేశాగతు లయినతమ కులశీలాదికములు మాకు లెస్సగాఁదెలియవన్యోనని పూజ్యపాదులవారు సెలవిచ్చుచున్నారు.

అహం—ఆ! ఎట్టెట్టూ! ఇక్కడ మాకును గులశీలాదిపరీక్షలా? అవుఁగాక- ఆలకింపుఁడు.

శా॥ సారానుత్తమగౌడరాష్ట్రమున నిస్సామ్యంపు రాఢాపురిన్।
భూరిశ్రేష్ఠిక ధామమున్నత మటన్ బూజ్యోత్తమాభిఖ్యవా।

ప్పారుణ్మత్ప్రిత,తత్సుతుల్ భువనవిఖ్యాతుల్గదా! వారిలోఁ।
జారుప్రజ్ఞ,వివేకధైర్యవినయాచారాదులన్ ముఖ్యుఁడన్॥౭॥

దంభు—(వటువునుజూచుచున్నాఁడు.) (నుఁడు.

వటు—(రాగిచెంబును జేతఁబూని) మహాత్మా! పాదప్రక్షాళనము జేసికొ

అహం—(తనలో) కానీ-ఇట్లు చేసిన నేమిదోసము. (కాళ్ళుగడుగుకొనిదగ్గఱ
బోవుచున్నాఁడు)

దంభు—(పటపటఁబండ్లుగీఁటుచు) దూరను దూరము- గాలివాటున నీచెమ
టబొట్టులు మామీఁదికివచ్చును.

అహం—ఓహో! ఈబ్రాహ్మణ్య మపురూపముగానున్నదే.

వటు—అయ్యా! అవునదినిజమే.

తే॥ గీ॥ వినుతరాజాధిరాజు లస్ప్రష్టచరణు।
లగుచుఁ,జూడామణీధగద్ధగిత లలిత।
కాంతిసంతతిచే నివాళింతు రీత।
పోధనుని పాదపీఠాంత భూతలంబు॥౮॥

అహం—ఓహో! ఈదేశము దంభగ్రాహ్యము-కానీ- ఈయాసనమునఁగూ
రుచుండెదను.

వటు—అయ్యా! ఈలా గారాధ్యపాదులవారి పీఠముమీఁద నన్యులు కూరు
చుండఁగూడదు.

అహం—హా! పాప! దక్షిణరాఢాపుర ప్రసిద్ధశుద్ధుల మగుమేమును నీపీఠము
నఁ గూరుచుండఁదగమా? వినురామూర్ఖ!

ఉ॥ శ్రోత్రియవంశజన్మపరిశుద్ధిని మాయమకెక్కు-దౌటటి!
గ్గాత్రిని బెండ్లియాకతనఁ దండ్రినిమీఱుచు,భార్యయన్నకున్।
మిత్రుని మేనమామ సుతమీఁదనురాఁగ నిరాపనింద,దు।
ష్పాత్రపు బాంధవంబని వెసం బ్రియకాంతఁ బరిత్యజించితిన్॥౯॥

దంభు—బ్రాహ్మణోత్తమా! అదియట్లేకావచ్చును- అయినను మావృత్తాంత
ము మీ తెలియుంగరుగదా!

చ॥ నలినజునోలగంబు నొకనాఁడు గనుంగొన నేనబోవ,నం।
దలిమును లున్నతాసనకదంబము డిగ్గిరి దిగ్గు దిగ్గునన్॥
నలువయు నొట్టుఁబెట్టుకొని, నన్ బతిమాలుచు,గోమయంబుతో।
నలికి నిజోరుపీఠి,నను నచ్చట నుంచుకొనెన్ రయంబునన్॥౧౦॥

అహం—(తనలో) ఏమీ! ఈదాంభికబాహ్మాణునియత్యుక్తి! (ఆలోచించి) కాదుదంభునిదే యనవచ్చును- అయిననేమియిదిగో (క్రోధముతోఁబ్రకాశముగా) ఆ! యేలయీలాగుగర్వించెదవు?

ఉ॥ ఓరి! సురేంద్రుఁడెంత? కమలోద్భవుఁ డెంతటివాఁడురా? నిరా।
ధారులజన్మభూములను దాకొనుమెట్టివొ-మత్తపోబలో।
దారతఁజూడు, వాసవశతంబును, బ్రహ్మశతంబు,మౌనిబృం।
దారశతంబు నొక్కట వితాకువడంగను బిట్టుగూలెదుర్ ॥౧౧॥

దంభు—(చూచిసంతోషముతో)ఓహో! ఈయనమాపితామహుఁ డహంకారుఁడు- అయ్యా! లోభునికుమారుఁడను దంభుఁడను;మీకు నమస్కరించుచున్నాను.

అహం—వత్సా!ఆయుష్మంతుఁడవుగమ్ము! నీవుచిన్నవాఁడ వయియుండఁగా నిన్ను ద్వాపరాంతమునఁజూచినాను. కాఁబట్టి చిరకాలవిప్రకర్షమువలనను,వార్ధకగ్రస్తుఁడ నగుటవలనను నిన్నిప్పుడానవాలుపట్టలేకపోయినాను. నాయనా! నీకుమారున కన్నృతునకుఁ గుశలమేగద!

దంభు—అయ్యా! కుశలమే. వాఁడును మహామోహమహారాజునాజ్ఞచొప్పున నిప్పుడిక్కడనే యున్నవాఁడు- వానినివిడిచి క్షణమయినను నేను జీవింపలేనుగదా?

అహం—సరే, నీతలిదండ్రులు తృష్ణాలోభులుసుఖమున్నారా?

దంభ—అయ్యా! వారును నిక్కడనేయున్నారు- నేనునిముసమయిన వారినేమఱియుందునా? మీరిప్పు డిచ్చటి కేమిపనిమీఁద విచ్చేసితిరి.

అహం—నాయనా! మహామోహునకు వివేకునివలన, సత్యాహితముగలుగునని విన్నవాఁడనయి తద్వృత్తాంతము నరసిపోవవచ్చినాను.

దంభు—అట్లయినచో మీరాకసఫలితమే- మహారాజును స్వర్గలోకమునుండి యిచ్చటికివిజయంచేయునని వినవచ్చుచున్నది- ఆయన యీవారణాసీనగరమునే రాజధానిగా నేర్పఱుచుకొన్నాఁడట.

అహం—మహామోహుఁ డట్లు వారణాసియందే పూర్ణముగానుండ నిశ్చయించుకొనుట కేమికారణమో?

దంభు—అయ్యా! వేఱుకారణమేమియుండును? వివేకుని నిరోధించుటకే.

తే॥ గీ॥ బ్రహ్మపట్నము కాశి నిరత్యయము,ప్ర
బోధవిద్యోదయములకుఁబుట్టినిల్లు;

గానవిచ్ఛలు నిటనుండఁగా వివేకుఁ
డిచ్ఛగించెను గులనాశ నేచ్ఛఁడగుట॥౧౨॥

అహం — అట్లయయినచో నీవిషయమునఁ బ్రతీకార మశక్యమే.

క॥ పరమపదంబు నెఱుంగని
నరులకు మరణావసరమునఁ బురహరుఁ డిం
డురుకరుణను భవభయకా
తర తారకసుప్రబోధదానము సేయున్॥౧౩॥

దంభ — అవునుగాని కామక్రోధాద్యభిభూతులకు నది దుర్లభముగదా!

క॥ హృదయముఁ, గరములుఁ, బదములుఁ,
జదువుఁ, దపము, యశము నివి సుసంయతభంగిన్
బాదలు నెవని కాతనికే
గద తీర్థఫలంబు సమధికస్థితి నొదవున్॥౧౪॥

(తెరలో) ఓహో! జనులార! యిదిగో! దేవర మహామోహమహాప్రభువు
వారు విజయంచేయుచున్నారు- కాఁబట్టి.

ఉ॥ స్ఫాటికరత్నవేదికలఁ జందనవారిని సంస్కరింపుఁడు
ఘాటితయంత్రమార్గ జలధామములం బ్రసరింపనిండు ప
న్నీటిని; గట్టుఁ డుజ్జ్వలమణిచ్ఛటఁ దోరణరాజి; నెత్తుఁడీ
హాటకహర్మ్యమూర్ధముల నైంద్రధనుస్స్ఫురితధ్వజావళిన్॥౧౫॥

దంభ — అయ్యా! ప్రభువువారు సమీపించుచున్నారు. మీ రెదురువోయి యా
యనను సంభావింపుఁడు.

అహం — అలాగేయవుఁగాక (ఇద్దఱును నిష్క్రమించుచున్నారు) (ప్రవేశకము)
(తరువాత మహామోహుఁడును, విభవమునుబట్టి పరివారమును బ్రవేశించు
చున్నారు.)

మహామో — (నవ్వి) ఔరా! జడమతులు నిరంకుశులుగదా!

శా॥ ఆహా! దేహముకంటె వేఱుగఁ గలండా యాత్మయం చాకరుం
డో హోహో! పరలోకమందు ఫల మేదో పొందునా యాతఁడీ
యూహల్ చూడ, నభోవనీరుహమునం దుద్భూతమై పూవు, తీ
పౌ హృద్యోరుఫలం బొసంగు నను పేరాసం దలంపించెదుర్॥౧౬॥

స్వకపోలకల్పనా వినిర్మితపదార్థంబు నవలంబించి యీదుర్బుద్ధు
సర్వజగత్తును మోసపుచ్చుచున్నారుగదా!

శా॥ లేనేలేనిపదార్థ మున్నదని పేర్మిన్మిథ్యాప్రజల్పాస్తికుల్।
నానాభంగుల సత్యవాదులను నన్యాయంబు నిందింతు రే।
లా నాస్తిక్యుల? మేనుగోసి కనినారా యెవ్వ రేఁ గాని య।
న్యానుంజీవునిఁ బంచభూతపరిణామోద్భూతచిచ్ఛిన్నునిన్?॥౧౭॥

అయ్యో! వీరు జగత్తునుమాత్రమే గాక తమ్మునుగూడ వంచించుకొనుచున్నారే.

మ॥ వదనాద్యంగకతుల్యముల్ తనువు లీవర్ణక్రమం బేటిదో।
యదియుంగాక పరాంగనల్, పరధనం బన్ భేద మేలాటిదో।
మది కింపౌగతి స్త్రీలఁబొందుటను, హింసన్, దత్పరార్థాపహృతిన్।
సదసద్బాధ లొనర్చ రేమిటికొ తోఁచంబోదు నిష్పౌరుషుల్॥౧౮॥

(ఆలోచించిసశ్లాఘముగా) ఓహోహో! సర్వథా లోకాయతమే శాస్త్ర మనఁదగినది; దానియందుఁ బ్రత్యక్షమొకటియే ప్రమాణము. పృథివ్యప్తేజోవాయువులే తత్త్వములని, అర్థకామములే పురుషార్థములని, భూతములే జ్ఞానజనకములని, పరలోకమన్నది సున్నయని, మరణమే మోక్షమని యిట్లు మామకాభిప్రాయానుసారి యగువాచస్పతి తచ్ఛాస్త్రమును రచియించి చార్వాకునకు సమర్పించినవాఁ డయ్యెను- ఆతండును శిష్యప్రశిష్యులమూలమున నాతంత్రమును లోకమంతట వ్యాపించునట్లు గావించెను.

(తరువాతఁజార్వాకుఁడును శిష్యుఁడును బ్రవేశించుచున్నారు.)

చార్వా—ఓరిశిష్యా! దండనీతియే విద్యయని, వార్త (అర్థానర్థవివేచనవిద్య) తదంతర్భూతమని, వేదత్రయము ధూర్తప్రలాపమని నీ వెఱుఁగ నేయెఱుఁగుదువు. చూడు.

శా॥ హోమాదుల్ పచరించుఋత్విజులు, నాహోమప్రధానక్రియా।
సామగ్రుల్, సముపార్జితార్హ సమిదాజ్యాద్యుజ్జ్వలద్రవ్యముల్।
దా మెల్లన్ నశియించిపోవ, మఱిమీఁదన్ స్వర్గముంబొందిరా।
సోమాసుల్, దవదగ్ధభూజములుఁ గాంచుంబో ఫలంబుల్మహిన్॥౧౯॥

తే॥ గీ॥ జన్నములఁ జారుహింసించి చంపునట్టి।
పశువులకు స్వర్గ మబ్బెడుపక్షమందు,।
నాత్మజనకుల నటు సోమయాజులెల్ల।
నులిచి వధియించి స్వర్గాన నిలుపరాదె?॥౨౦॥

క॥ చచ్చినప్రాణికి శ్రాద్ధము।

ద్వి తీ యాం క ము.

సాత్త్విగః బరితృప్తిహేతువే యయ్యెడుచో।
నచ్చుగ నాఱినదీపముఁ।
గ్రచ్చుల వెలిఁగించుఁజమురు గ్రమ్మఱఫరలో॥౨౧॥

శిష్య—స్వామీ! అన్నపానములే పురుషునకుఁ బరమార్థము లయినపక్షమున నేమినిమిత్త మీతైర్థికులు సాంసారికసుఖంబులం బరిత్యజించి ఘోరతరం బులయిన పారాక సాంతపన షష్ఠకాల ప్రభృతిదుఃఖంబుల నిర్విఘ్నంబున బాధపడుచున్నారు?

చార్వా—ఓరీ! ధూర్తప్రణీతాగమప్రతారితు లగుసీమూఢమతులకు నాశ మోదకంబుల నిట్టితృప్తి గలుగుచున్నదిగాని చూడు.

తే॥ గీ॥ భుజనిపీడిత నిజబాహుమూల భగ్న।
తుంగత స్తన మంగనాలింగమేడ?।
నసిశభిక్షోపవాసవ్రతార్క కిరణ।
వాహదేహోపశోషణత్వం బిదేడ?॥౨౨॥

శిష్య—ఆచార్యోత్తమా! "సాంసారికసుఖంబు దుఃఖమిశ్రితంబు; కావునదీనిని బరిహరింపవలయు"నని తైర్థికు లనుచున్నారు.

చార్వా—(నవ్వి) ఆహా! నరపశువులదుర్బుద్ధివిలసనము!

<u>ఉత్సాహ</u>॥ విషయసంగమజసుఖంబు విపులదుఃఖమిళితమఁట।
మిషను విడువవలయు ననుట మిగులఁ దెలివిలేమియే;।
తుషకణోపహితములనుచుఁ ద్రోయునే హితార్థిపూ।
రుషుఁడు ధవళతండులాఢ్యరుచ్య శాలిధాన్యముల్॥౨౩॥

మహామో—ఆహాహా! పెద్దకాలమునకు సప్రమాణము లయినవాక్యములు నాకు శ్రవణసుఖమును సంపాదించుచున్నవి. (చూచిసంతోషముతో) ఓహో! నాప్రియమిత్రుఁడు చార్వాకుఁడా?

చార్వా—ఓహో! ఈయన మహామోహమహారాజు- (సమీపించి) జయముజయముమహారాజ! ఇదె చార్వాకుఁడు మ్రొక్కుచున్నాఁడు

మహామో—చార్వాకా! నీకు స్వాగతము. ఇటఁ గూరుచుండుము.

చార్వా—(కూరుచుండి) దేవా! ఇది కలిపురుషుని సాష్టాంగనమస్కారము

మహామో—ఓయీ! కలికి భద్ర మవ్యాహతమే గద?

చార్వా—ఏలినవారిప్రసాదమువలన సర్వత్రభద్రమే. అతఁడు కర్తవ్యాశే మును గూడ నిర్వర్తించుకొని మఱి దేవరపాదమూలమును సందర్శింపఁగో

రుచున్నారఁట- అదియుచితమేగదా!

ఉ॥ దాయలరూపుమాంపఁ దలఁదాలిచి యేలికశాసనంబుఁ,దా।
నాయురుకృత్యముల్ నెఱపి యప్పుడ, మోము వికాసమొందఁగాఁ।
బోయి,మహాప్రసాదమున భూపతి దర్శనమీయ డాసి,చే।
దోయిమొగడ్చి తత్పదనతుల్ పొనరించును ధన్యుఁ డిమ్మహిన్॥౨౮॥

మహామో—అటులయిన నిప్పు డాతనివలన నేమట్టునకుఁ బనిజరిగినది?

చార్వా—దేవా! అవధరింపుము.

మ॥ ఉరుసంధ్యాజపహోమముఖ్య నిగమప్రోక్తక్రియల్ మానుచుం।
బరనారీగమనంబుఁ, బానముమొదల్ స్వచ్ఛందచేష్టల్ మహా।
పురుషుల్ వెల్లడి సల్పుచుండ్రు; కలినాబోంట్లింతకున్ వారిఁదేఁ।
దరమా నా? ప్రభుమన్ననం బురుషకృత్యం బెల్ల నీడేఱెడున్॥౨౯॥

అటనుత్తరపథికులును, పాశ్చాత్యులును వేదత్రయంబునే విడిచిపెట్టినవారు; ఇఁక శమదమాదుల లెక్కయేమి? అన్యత్రయయినను బ్రాహ్మిను కులిప్పుడు ప్రాయికముగా జీవికామాత్రఫలములుగానే గానవచ్చుచున్నవి.

ఈయంశమాచార్యోక్తమే.

తే॥ గీ॥ అగ్నిహోత్రంబు, వేదత్రయంబు,భస్మ।
గుంఠనంబుఁ,త్రిదండంబు శుంఠలైన।
పౌరుషజ్ఞానహీనప్రవర్తనులకు।
బ్రదుకుఁదెరువని మును బృహస్పతి యనండె?॥౩౦॥

కాఁబట్టి కురుక్షేత్రాదులయందు విద్యాప్రబోధోదయంబు గాఁగలదని కలనయిన వేఱరవారు శంకింపవలవదు.

మహామో—కార్యము కడుఁజక్కగా నెఱవేఱినది- మహత్తరమయ్యునత త్తీర్థము వ్యర్థీకృతంబయ్యెనుగదా!

చార్వా—ఇంకొకమనవి.

మహామో—అదియేమి?

చార్వా—మహాప్రభూ! విష్ణుభక్తియనుపేరుగల మహానుభావురాలగునొకయోగినిగలదు- ఆమెనుగూడ మనకలి మెల్లమెల్లగాఁ దలయెత్తకుండఁ జేసినాఁడు- అయినను నాయోగినిప్రభావమెట్టిదోగాని, తదనుగ్రహపాత్రుఁడయినవాని గో[illegible]

వరవా రీవిషయమున సావధానులయి యాలోచింపవలయును.

మహామో—(భయపడి తనలో) హా! తద్యోగిని సుప్రసిద్ధమహాప్రభావశా లి! మాకు స్వభావవిద్వేషిణి; తదున్మూలనము దుస్సాధ్యముగదా! కాని, (ప్రకాశముగా) ఓయీ! మనము భయపడనేల? కామక్రోధాదిప్రతిపక్షు లుండఁగా దానిమహిమ లెక్కడసాగును?

చార్వా—దేవా! అవునుగాని పగతు నలఁతియేనియు విజిగీషుఁ డుపేక్షింప రాదుగదా!

తే॥గీ॥ అల్పుఁడయ్యు నరుంతుదుం డగుట రిపుఁడు।
ధారుణీభర్తకు విపాకదారుణుండు;।
చరణమం దింతకంటకాంకురము విఱుగ।
దిరుగనిచ్చునె వేదనాకరముగాక?॥౨౭॥

మహామో—(తెరవంకఁ జూచి) ఓరీ యెవఁడురా అక్కడ?

దౌవారికుఁడు—(ప్రవేశించి) దేవా! ఆజ్ఞాపింపుఁడు.

మహామో—ఓరీ! అసత్వంగా! "మీ రేమఱక శీఘ్రముగా విష్ణుభక్తియనుయోగి నిం గడతేర్పవలయు"నని కామక్రోధలోభమదమానమాత్సర్యాదుల కా దేశింపుము.

దౌవా—చిత్తము దేవా! (నిష్క్రమించుచున్నాఁడు.)

(తరువాతఁ బత్రహస్తుఁ డొకపురుషుఁడు ప్రవేశించుచున్నాఁడు.)

పురుషుఁడు—సముద్రతీరమండల పురుషోత్తమ సంజ్ఞితం బగు దేవాయతనం బునుండి మదమానులు పంపఁగా మహారాజసన్నిధానమున కుత్కలదేశ మునుండి నేనువచ్చినాను. (చూచి) ఇదే వారణాసీపురంబు. రాజభవన మిదిగో, లోపలికిఁబోయెదను. (ప్రవేశించి) అదిగో! మహారాజు చార్వా కునితో రహస్యమున నేమోయాలోచించుచున్నాఁడు. దగ్గఱకుబోయెద ను. (సమీపించి) జయముజయము మహారాజ! దేవరవా రీపత్రికను జిత్త గింపుఁడు.

మహామో—(ఉత్తరముపుచ్చుకొని) నీ వెక్కడనుండి రా?

పురు—స్వామీ! నేను బురుషోత్తమమునుండి వచ్చినాను.

మహా—(తనలో) కార్య మేదో యత్యాహితము గాఁగలదు. (ప్రకాశముగా) చార్వాకా! నీ విప్పటికి సెలవుపుచ్చుకొని కర్తవ్యాంశములయందు జాగ రూకుఁడవయి యుండుము.

చార్వా—చిత్తము దేవా. (నిష్క్రమించుచున్నాఁడు)

మహామో—(పత్రికఁజదువుకొనుచున్నాఁడు) స్వస్తి శ్రీవారాణసీ రాజధానీ మండనాయమాన శ్రీమన్మహారాజాధిరాజపరమేశ్వర శ్రీమహామోహప్రభూత్తంసులపాదపద్మములకుంబురుషోత్తమాయతనంబుననుండి, మదమానులు సాష్టాంగనమస్కారసహస్రములతోఁ గావించుకొనువిజ్ఞాపనము. ఇచ్చటభద్రమవ్యాహతము.

తరువాత

దేవా! శాంతిదేవి తనతల్లియగు శ్రద్ధతోఁగూడ వివేకునకు దౌత్యంబు సేయఁగుదిరి, తదీయసంగమార్థ ముపనిషద్దేవి నహర్నిశంబు ననునయంబునం బ్రబోధించుచున్నది. మఱియు వైరాగ్యాదులు కామసహచరుం డయినధర్ముని భేదపఱుచు చున్నట్లు గానవచ్చుచున్నది. ఆధర్ముఁ డక్కడక్కడఁ గామునివలన వేఱుపడి నిగూఢప్రచారంబు సలుపుచున్నాఁడు. ఉక్తార్థంబులనుజిత్తగించి దేవర దివ్యచిత్తానుసారము జరిగింపఁ బ్రార్థించుచున్నాము. (ఇట్లుచదువుకొని క్రోధముతో)

ఆ! యేమిది! ఈయతిముగ్ధులు శాంతికిఁగూడ భయపడుచున్నారు!
ఇంతయు నదిగలుగుట యెట్లు?

చ॥ నలువ శతంబు విశ్వసృజసంబొనరించుఁ; గ్రతుఘ్నుఁ డాహిమా।
చలతనయోపగూఢ సుఖసంగతిఁ దారక లల్లలార్చు; న।
గ్నిలిఁ గమలాకపోల మకరీకలనాంచ దురస్థ్సలంబుతో।
జలనిధిఁ బవ్వళించు హరి; శాంతి యిఁకం బరులందుఁ గల్గునే?॥౨౦॥

(పురుషునితో) జాల్మా! నీవు శీఘ్రముగాఁబోయి కామునిఁగలిసికొని మాయాన్వితిగా నిట్లుచెప్పుము. "ధర్ముఁడు దురాశయుఁడని మాకుఁ దెలియవచ్చినది. వాఁడొక్కముహూర్తమయినను నమ్మియేమఱఁదగినవాఁడుగాఁడు. నీవు వానినిగట్టిగానిర్బంధించి నిలుపవలయును."అని.

పురు—చిత్తముమహాప్రభూ! (నిష్క్రమించుచున్నాఁడు.)

మహామో—(ఆలోచించితనలో) ఈశాంతిని మాయించుటకేమియుపాయము? కానీ- ఉపాయాంతరమెందుకు? క్రోధలోభులే యీకార్యమందుఁ బరమసమర్థులు- (ప్రకాశముగా) ఓరీ! యెవఁడురా అక్కడ?

దౌవారికుఁడు—(ప్రవేశించి) దేవా! ఆజ్ఞాపింపుఁడు.

మహామో—ఓరీ! క్రోధలోభులను బిలుచుకొనిరా.

వైరా—చిత్రము దేవా! (నిష్క్రమించుచున్నారు)

(తరువాతఁ గ్రోధుఁడును లోభుఁడును బ్రవేశించుచున్నారు.)

క్రోధు—శాంతిశ్రద్ధావిష్ణుభక్తులు మహారాజుతోఁ బగఁగొన్నారఁట. ఔరా! నేను బ్రతికియుండఁగానే యింత తెగువకుఁ జొచ్చినారు. వారికి జీవితాశ లేదా యేమి చెపుమా?

క॥ కనునే కృత్యము? హితము
వినునే? చదివినది తెలియునే? నే నంధం
బును, బధిరంబు, నచేతన
మును జేయనె తెలివి మాపి భువనము నెల్లన్?॥౨౯॥

లోభు—ఓరీ! నేను బూనినవారు మనోరథనదీపరంపరనే తరింపఁజాలరు. ఇంక శాంత్యాదులను జింతించుట యెక్కడిమాట? చూడు సఖుఁడా!

మ॥ మదధారాపరిషిక్తగండతలముల్ మాతంగముల్, వేగసం
పదఁ గాలిన్నిరసించు తేజులివి నా వశ్యంబులిట్లింక శ్రీ
యెదుగన్, నాకిదిగల్గెఁ, గల్గునిదియుం జేబ్రోద్దులబాధికఁ
బెదఁ జింతించుదురాశమీ జగమహో యేలీల శాంతింగనున్?॥౩౦॥

క్రోధు—మిత్రుఁడా! నీవు నా ప్రభావ మెఱుఁగుదువా?

మ॥ చదివెం ద్వాష్ట్రుని వృత్రు వజ్రధరుఁ డాచంద్రార్థచూడుండు దాఁ
జిదిమెన్ బ్రహ్మశిరంబుఁ; గౌశికుఁడు గూల్చెం బిట్టు వాసిష్ఠులన్;
చూడు
జదువ ల్లజ్జ్వలకీర్తులన్ సదమలాచారంబులుం బ్రోచ్చతా
స్పద సత్పౌరుషభూషణంబు లన కుత్పాటింతు నే వంశముల్॥౩౧॥

లోభు—తృష్ణా! ఇటురమ్ము.

తృష్ణ—(ప్రవేశించి) ఆర్యపుత్ర! యేమి సెలవు?

లోభు—ప్రియురాలా! ఆలకింపుము.

మ॥ పొలముల్, గోనలుఁ, గొండ లూళ్లుఁ, దుదకున్ భూమండలం బబ్బఁగా
గలలబ్ధాధికచింతనుల్ జనులు, ప్రత్యాశామహాపాశబ
ద్ధులు సూ, తృష్ణ! ప్రసన్నవై పెనిచితే దోరంబుగా నీయెడల్
ఫలజాతప్రభవాండకోట్లనయినన్ శాంతింతురే వారికన్?॥౩౨॥

తృష్ణ—ఆర్యపుత్ర! నేను స్వయముగానే నిత్య మీకార్యమునం దభినివేశము గలదానను; ఇప్పుడు తమయాజ్ఞ కూడ నయినది కాఁబట్టి యిఁకఁ బ్రహ్మాండా

ర్భుదములచేతనయినను నాయుదరము బూరటిల్లదు.

క్రోధు—హింసా! యిటు రమ్ము.

హింస—ఇదిగో! వచ్చితినార్యపుత్ర! ఆజ్ఞాపింపుఁడు.

క్రోధు—ప్రియురాలా! నీవు సహధర్మచారిణి వయినందున, మాతృపితృవధం బయినను నాకుఁ దృణప్రాయముగానున్నది.

మ॥ జనకుం డెంత? పిశాచితల్లి, పురుగుల్ సైసోదు లీపుట్టముల్।
హసనార్హుల్, విటమిత్రచేష్టితులు దాయాదుల్ గడుంగుత్సితుల్।
(చేతులుపిసికికొని)
కసరాపీరలయీకులం బఖిల మాగర్భంబు నిశ్శేషముం।
బానరింపంగనకున్నఁ బెగ్గినుకనిప్పుల్ మేనఁజల్లారునే?॥ ౩౩॥

(చూచి) మహారా జికఁడనున్నాఁడు; సమీపింతము. (అందఱుసమీపించి)

అందఱు—జయముజయముమహారాజ!

మహామో—వినుండు, శ్రద్ధాపుత్రియయినశాంతి మనకుఁ బరమవిద్వేషిణి; మీ రందఱు దానిని నిగ్రహింపవలయును.

అందఱు—దేవా! చిత్తము. (నిష్క్రమించుచున్నారు.)

మహామో—ఇదిగో! "శ్రద్ధాపుత్రి" యనుమాటవలన, నాహృదయమున కిప్పుడు వేఱొకయుపాయము సైతముస్ఫురించుచున్నది- శాంతి శ్రద్ధకుఁ గూఁతురయినందున నది తనతల్లికి లోఁబడినదిగాని స్వతంత్రురాలుగాదు- కాఁబట్టి, యేయుపాయముచేతనయిన నుపనిషత్సకాశమునుండి యిప్పుడు శ్రద్ధను దొలఁగింపఁగలిగితిమా, యతిసుకుమారతనుజేసి మాతృవియోగ దుఃఖంబున బలముడిగి కృశించి యది నశింపఁగలదు- శ్రద్ధ నివల కీడ్చుటకు మిథ్యాదృష్టివిలాసినియే మహాప్రగల్భురాలు- ఆమె నే యికార్యంబున నియోగింపవలయును. (పార్శ్వమునఁజూచి) విభ్రమావతీ! సత్వరముగా మిథ్యాదృష్టిని బిలుచుకొనిరా.

విభ్ర—చిత్తముదేవా! (నిష్క్రమించి మిథ్యాదృష్టితోఁబ్రవేశించుచున్నది)

మిథ్యా—సఖీ! మహారాజునుజూచి చిరకాలమయినది. ఇప్పు డాయన మోము నే నేలాగు సందర్శింతును? నన్నాయన యేమనునోగదా!

విభ్ర—చెలియా! నీమోమును జూచినతోడనే మహారాజు తన్నే తాను మఱచి పోవును; నిన్నేమి యనఁగలఁడు?

మిథ్యా—సఖీ! నాయలీకసౌభాగ్యమును జూచి పరిహసించెదవా?

విభ్ర—సఖీ! నీసౌభాగ్యముయొక్క యతిశయ మెట్టిదో యది యిప్పుడే నీకుం గాన రాఁగలదు. మఱి యోసిప్రియసఖీ! నీలోచనంబులు నిద్రాప్రవాహ తరంగాకులంబులుగాఁ గానవచ్చుచున్నవి. ప్రియసఖి కింతనిదురలేమి కేమి కారణము?

మిథ్యా—సఖీ! లోకములో నొక్కమగఁడు గలయాఁడుదానికే మేలు గన్నవారయుట గడుదుర్లభము. ఇఁక జగమంతె మగలేయయిననావంటిదాని కది యడుగనేల?

విభ్ర—ప్రియసఖీ! యెవ్వరెవ్వరే నీకుమగలు?

మిథ్యా—మొట్టమొదటమహారాజు, పయిగాఁ గాముఁడు, క్రోధుఁడు, లోభుఁడు, నహంకారుఁడు; సఖీ! వేయిచెప్పనేల? వీరి కులంబునఁ బుట్టినవాఁడు బాలుఁడుగాని, పడుచుగాని, వృద్ధుగాని నన్నురేయుంబగలు దమయక్కునఁ జేర్చుకొని క్రీడింపనివాఁడు లేఁడు.

విభ్ర—అటులయినఁ బ్రియసఖీ! కామునకు రతియుఁ, గ్రోధునకు హింసయు, లోభునకుఁ దృష్ణయుఁ బ్రియతమురాండ్రని వినుచున్నామే, వారు, తమభర్తలిట్లు రాత్రిందివము, నిత్యముఁ బ్రియసఖితో రమించుచుండఁగాఁ జూచి యెట్లుసహించుచున్నారు?

మిథ్యా—సఖీ! సహనమునుగుఱించి యడిగెద వేమి? తుదకు వారుగూడ నన్నుఁ జూడ కొక్కనిముస మయినను నిలువలేరు.

విభ్ర—సఖీ! ఇందుచేతనేగాదా నీవంటి సుభగురాలయినస్త్రీ యీపృథివి యందు లేదనవలసివచ్చినది-నీసౌభాగ్యసమృద్ధికి మన సెరియవలసిన నీసవతులుసయితము నీప్రసాదమునకుఁ బ్రతీక్షించుచున్నవారు. సకియా! యిం కొకమాట- నీ వీలాగున నిద్రాకులహృదయవయి, తొట్రిల్లెడు నడుగులం జాఱి మంజీరములు గల్లుగల్లుమన మహారాజును సంభావింపవచ్చుచున్నావు, నిన్నుఁజూచి యాయన యనుమానపడఁడుగద?

మిథ్యా—సఖీ! యిం దనుమానపడవలసిన దేమి? మా కీయవిసయము మహారాజనియుక్తమేగదా! మఱియు నోసఖీ! దర్శనమాత్రప్రసన్నులగుపురుషులచోట మా కేమిభయము?

మహారా—(చూచి) ఇదిగోఁ బ్రియురాలు మిథ్యాదృష్టి; ఈమె—

ఉ॥ వేసలి పూవుబొత్తులరవీడఁగఁ జేనవి దిద్దుసాకునం
గానఁగఁ జేయుచుం గుచనఖక్షతముల్, విరినల్లగల్వచా

లీనెడుచూపు డెంద మెలయింపఁగఁ, బ్రేంఖ విలోల కంకణ
స్వానము మీఱ, భూరికటిభారమునన్ మెలమెల్ల వచ్చెదున్॥ ౩౪॥

విభ్ర—ఇదిగో! మహారాజు, సన్నిధికిఁబొమ్ము ప్రియసఖీ!

మిథ్యా—(సమీపించి) జయము జయము మహారాజ!

మహామో—ప్రియురాలా!

క॥ వలుఁదకుచంబుల నెలవం
కలు దేఱ, మదంకతలము గైకొని, బిగిఁగౌఁ
గిలి యొసఁగుము, శివుసంక
స్థలమున నెలకొనినయచలతనయకు నెనయై॥ ౩౫॥

మిథ్యా—(చిఱునవ్వుతో నట్లుచేయుచున్నది)

మహామో—(ఆలింగనసుఖ మభినయించి) ఓహో! ప్రియురాలియాలింగనము వలన నాకు నవయౌవనము మరల నంకురించుచున్నది.

చ॥ తరుణవయోవిలాసములఁ దా మును పేయది గల్గె నాకుఁ, దత్స్మరజవికార మున్మథితమానస మింద్రియసంగహీనని ర్భరసుఖ మత్యంతప్రియము త్వత్పరిరంభజ మౌచు నెండి యాంతరవివిధప్రవృత్తుల నణంచి వినూతనరీతి భాసిలున్॥ ౩౬॥

మిథ్యా—మహారాజ! నేను నిప్పు డెలజవ్వనమున నివ్వటిల్లుచున్నదానను, భావానుబద్ధ మగు ప్రేమ కొండొకకాలమున కయిన నశింపదుగదా! దేవరవారికి నే నిప్పు డెందునిమిత్తము తలఁపువచ్చితినో యానతిండు మహారాజ!

మహామో—ప్రియురాలా!

క॥ ఇలలో హృదయమునకు వెలుపల నున్నదిగాదె తలఁపువచ్చుటకు చెలియా!
విలసిల్లెదు నాదుమనః
ఫలకముననె నీవు సాలభంజికపోలెన్॥ ౩౭॥

మిథ్యా—దేవా! మహాప్రసాదము- అయినను ముదలయిందు మహారాజ!

మహామో—ప్రియురాలా! నీసర్వావయవములును ప్రకాశితము లగునట్లు సర్వత్ర నీవుసంచరింపవలయును- ఇంతేగాక మానసకుమారుఁడు శ్రద్ధనుపనిషత్తును వివేకునితోఁగూర్చుటకుఁ దాను గుంటెనకత్తె యయినది.

కాఁబట్టి—

క॥ పాపానువర్తినిని దు
ష్ప్రాపం బ్రతికూల నకులభవ నారండక్
వే పాషండులఁ జేరువు
మీపట్టునఁ గొప్పువట్టియీడ్చి మృగాక్షీ!॥౩౮॥

మిథ్యా—దేవా! యీమాత్రపుఁబనికి దేవరవా రింతప్రయత్నము చేయవల యునా? ప్రభువువారిదాసి యయినయాశ్రద్ధ, మాటమాత్రముననే దేవర యాజ్ఞను నెఱవేర్పఁగలదు-"ధర్మము మిథ్య, మోక్షము మిథ్య, వేదమార్గము మిథ్య, సుఖవిఘ్నకారు లీశాస్త్రప్రలాపములు మిథ్యలు, స్వర్గఫలవిద్యమిథ్య" యని దానికి నేను బోధించినతోడనే వేవేగ నది వేదమార్గమునే విడిచిపెట్టఁ గలదు- ఇఁక నుపనిషత్తుమాట వేఱచెప్ప నేల? ఇంతియకాక విషయానందవి ముక్తం బని మోక్షంబున దోషంబు లఁగపఱుచుచు నచిరకాలముననే శ్రద్ధ నుపనిషత్తువలన విరక్తను గావించెదను.

మహామో—ప్రియురాలా! నీ విట్లుచేయఁజాలితివా నామనోరథము లెస్సఁగ నెఱవేర్చినదానవే-(మరలఁగౌఁగలించుకొనిముద్దుపెట్టుకొనుచున్నాఁడు)

మిథ్యా—అయ్యయ్యో! దేవరయిట్లు బహిరంగముగాఁ బ్రవర్తించుటచేత నా కుసిగ్గగుచున్నది.

మహామో—అటులయిన నోసుందరీ! మనము వాసగృహమునకే పోవుదము.

నిష్క్రమించుచున్నారు.

ఇది శ్రీపరమేశ్వరవరప్రసాదలబ్ధ సరసకవితాధురంధర వడ్డాదిసాధు
వంశ క్షీరనీరాకరరాకాసుధాక రాచ్చనామాత్యపౌత్ర హరి
తసగోత్ర పవిత్రగుణకదంబలక్ష్మాంబా గర్భశుక్తిము
క్తాఫల సూరపరాజప్రధానతనూభవ విబుధ
విధేయ సుబ్బరాయనామధేయాంధ్రీకృత శాంతరసాసార
ప్రబోధచంద్రోదయనాటకంబునందు, మహామోహ
విలాసం బనుద్వితీయాంకము.

శ్రీ ర స్తు.

శ్రీ పరమాత్మనే నమః.

ప్రబోధచంద్రోదయము.

తృతీయాంకము

(తరువాత శాంతియుఁ గరుణయుఁ బ్రవేశించుచున్నారు)

శాంతి—(కన్నీళ్లతో) అమ్మా! అమ్మా! నీ వెందుఁబోతివి? నీరూపము నాకన్నుల కగపఱుపుము.

ఉ॥ దండితపంబు సల్పుజడదారులఁ, బున్నెపుఁగోవెలల్, ప్రవ
తాఖండనగంబులుం, బెదరుదక్కినజింకలకాన లిష్టమౌ
చుండెడుతల్లి! శ్రద్ధ! కపిలోగ్ర నిషాదులయిండ్లఁబోలెఁ, బా
షండులచేతులం బడితి; చావక యేవగఁ దక్కు దక్కుటా॥౧॥

ఎందుకు? ఆమెజీవితాశ చాలును.

క॥ తా ననుఁగాన కొనర్పదు
తానము; బోనమును సలుపఁ దలఁపదు; జలముం
బానముసేయదు; శ్రద్ధా
మానిని, క్షణమైన నన్ను మానినమను నే?॥౨॥

శ్రద్ధావిహీన మైనయీశాంతిజీవన మొక్కముహూర్త మయినను నిరర్థకమే; కావున సఖీ! కరుణా! నాకుఁ జితిని బేర్పుము-అగ్నిహోత్రమునఁ బ్రవేశించి నేను శీఘ్రముగా నామెను గలసికొనియెదను.

కరుణ—(కన్నీళ్లతో) ప్రాణసఖీ! నీ వీలాగు విషమజ్వాలనజ్వాలాకుల కర్ణకటు దుస్సహంబు లయినయక్షరంబులం బలుకుచు, సర్వథా నాజీవితమునకు భంగమును గలిగించుచున్నావు- అమ్మా! ప్రియసఖీ! ముహూర్తమాత్రమ్ము నీజీవితమును ధరించుట కనుగ్రహింపుము- మునిజనసమాకులంబు లగుభాగీరథీతీరపుణ్యాశ్రమంబుల నిపుణముగా నిపు డామెను నెమకెదను-ఒకవేళ మ

తృ తీ యాం క ము.

హా మోహానకు జడిసి యెక్కడనేని ప్రచ్ఛన్నముగా నున్న దేమో!

శాంతి—సఖియా! యింక వెదకవలసిన దేమి?

చ॥ పులినములందు నివ్వరులు పొల్చిన వైవనవాసిసత్రముల్
మెలఁగుసరిత్తటంబుల, సమిచ్ఛమసావృత యజ్ఞశాలలన్,
నలుఁదెసలం గాశ్రమంబులను నా కన నట్టి దొకండు లేద; యె
వ్వాలనను దల్లిశ్రద్ధ దొకవార్తయు నాచెవిసోఁక దక్కటా!॥౩॥

కరు—సఖీ! నామాటవిను- సాత్త్వికశ్రద్ధయయినప్పుడామె కీలాటిదురవస్థ తటస్థించునని నేను యోచింపను- అంతలేసి పుణ్యస్వరూపిణు లింతలేసి యసంభావనీయవిపత్తు లెన్నఁడు ననుభవింపరమ్మా.

శాంతి—అయ్యో! చెలియా! దైవము ప్రతికూల మయిననాఁ డది యేలయసంభావ్య మగును?

మ॥ సిరి వైదేహికి రావణాసురునియిల్ చేరంగ నయ్యెన్; నిశా
చరు లొందించిరి పూజ్యురాలిని ద్రయీచంద్రాస్యఁ బాతాళమున్;
వరగంధర్వసుతన్ మదాలస, మిషన్ బాతాళకేతుండు దా
హరియించెన్; విషమంబు వక్రముగదా హా! దైవతంత్రం బిలన్॥౪॥

కానీ పాషండాలయంబులయందే యామెను వెదకుదము.

కరు—అలాగే చెలియా! (నడుచుచున్నారు)

కరు—(భయముతో) సఖీ! రాక్షసుఁడు రాక్షసుఁడు.

శాంతి—ఎవఁ డారాక్షసుఁడు?

కరు—సఖీ! ఒత్తుగా పెత్తుకొనినమలపంకం బొడల దిగజాఱ, బూడ నసహ్యమైనయేవపురూపుతో, నుత్పాటితకేశుండయి, చూడఁగూడని దిస్సమొలతోడఁ, బెద్ద నెమిలిపించియ మొకటి చేతఁబట్టుకొని వాఁ డీలాగే వచ్చుచున్నాఁడు.

శాంతి—సఖీ! మిక్కిలి బక్కచిక్కియున్నాఁడు, వీఁడు రక్కసుఁడుగాఁడు.

కరు—అటులయిన వీఁ డెవ్వఁ డగునో.

శాంతి—సఖీ! నేను వీనిని బిశాచ మనుకొనియెదను.

కరు—ప్రియసఖీ! ప్రస్ఫుర న్మహామయూఖమాలోద్భాసిత భువనాంతరాళంబుగాఁ బ్రచండమార్తాండ మండలంబు వెలుంగుచుండ నియ్యెడఁ బిశాచములకవకాశ మెక్కడ?

శాంతి—అలాగైనఁ జెలియా! వీఁ డిప్పుడే నరకవివరమునుండి వెడలివచ్చిన

యొకానొక నారకి గావలయును.(చూచియాలోచించి) ఆ! తెలిసినది. వీఁడు మహామోహప్రవర్తితుం డగుదిగంబరసిద్ధాంతుండు-సర్వథా వీనిదర్శనము దవ్వులనే పరిహరింపవలయును-(పెడమొగమయికూరుచున్నది)

కరు—సఖీ! ముహూర్తమాత్ర మిక్కడనుండుము- నేను శ్రద్ధను న్వేషించెదను.

(ఇద్దఱు నట్లున్నారు- ముందుచెప్పినట్లు దిగంబరసిద్ధాంతుఁడును బ్రవేశించుచున్నాఁడు)

దిగం—నమోర్హద్భ్యో నమోర్హద్భ్యః

ఆ॥వె॥ ప్రజ్వలించెడును నవద్వార గృహమధ్య
మందు నాత్మ దివ్యచందమునను;
జినవరాభిహితము వినుఁడెది పరమత
త్త్వంబు మోక్షసౌఖ్యదాయకంబు॥౫॥

(నడుచుచున్నాఁడు)

(ఆకాశమందు) ఓహోశ్రావకులార! వినుఁడువినుఁడు.

క॥ మలమయ పుద్గలపిండము
గలజలముల నయిన శుద్ధిగల దగునే? ని
ర్మలమూర్తి యాత్మ, దానిని
నిల ఋషిపరిచరణములను నెఱుఁగఁగవలయున్॥౬॥

ఏమనెదరు? ఋషిపరిచరణమనె మెట్టులా? ఆలకింపుఁడు.

క॥ దూరముననె తచ్చరణాం
భోరుహముల కెరఁగి, వినయపూర్వక మృష్టా
హారమునిడి, వారలు మీ
దారల భోగింప నీర్ష్యఁదగులకుఁడీరల్॥౭॥

(తెరవంకఁజూచి) శ్రద్ధా! ఇటురా. ఇటురా.

ఇద్దఱు—(భయముతోఁజూచుచున్నారు)

(తరువాతఁ దదనురూపవేషముతో శ్రద్ధ ప్రవేశించుచున్నది)

శ్రద్ధ—రాజకులము సెల వేమి?

శాంతి—(మూర్ఛిల్లుచున్నది)

దిగం—పూజ్యురాలా! నీవు శ్రావకకులంబు నొక్కముహూర్త మయినను విడిచి యుండఁగూడదుసుమీ.

శ్రద్ధ—చిత్తము- (నిష్క్రమించుచున్నది)

కరు—ప్రియసఖీ! ఊఱడిల్లు మూఱడిల్లుము. అయ్యో! నామమాత్రమునకే నీవు భయపడియెదవేమమ్మా? అహింస నాతోఁజెప్పినది వినుము, పాషండులకుఁగూడఁ దమఃకుమారి యయినశ్రద్ధ గలదఁట. కాఁబట్టి యిట తామసశ్రద్ధ గాఁగలదు.

శాంతి—(ఊఱడిలి)సఖీ! నీ వన్నది నిజమే.

తే॥గీ॥ తా దురాచారురాలు, దుర్దర్శురా ల్రు
రాశురా లిది మాయమ్మ ననుకరింపఁ
జాలునే? యామె బహుసదాచారురాలు
ప్రాణసహచరి! ప్రియదర్శురాలు గాదే? ॥౮॥

కానీ. సౌగతులలోపల నామెను వెదకుదము. (శాంతికరుణలు నడుచుచున్నారు)

(అప్పుడు పుస్తకహస్తుఁడగుబుద్ధాగముఁడు భిక్షురూపముఁనఁ బ్రవేశించుచున్నాఁడు)

భిక్షు—ఓహో! ఉపాసకులారా!

ఉ॥ ఆక్షణమే నశించెడు నిరాత్మము లర్థము లూర కిట్లుప్ర
త్యక్షము తోఁచు బాహిరములట్టుల యెందయి కల్పితంబు ల
య్యక్షయబుద్ధిధార గళితాఖిలవాసన యౌటఁజేసి,హా!
యీక్షణమందుఁ జకౌ స్ఫురియించెడు నిర్విషయోపరాగమై॥౯॥

(నడచి మరల సశ్లాఘముగా) ఓహోహో! ఈసౌగతధర్మ మెంతమంచిది! దీనియందు భోగమోక్షములు రెండునుగూడ నున్నవిగదా!

ఉ॥ ఉండను మిద్దెమాడుగులు, నొద్దికఁ గూడను ముద్దులాఁడులుం,
బండను బట్టెమంచములుఁ,దారణ కీప్సితవేళ నిష్టమా
తిండియుఁ,గూడుఁగాన,యువతీతతి సత్పెదునఁగరాగపుం
బండువుఁ బండువెన్నెలవిభావరుల న్వరు లందఁగం దగున్॥౧౦॥

కరు—సఖీ! నిట్టతాడనఁ బోడ వయి,కషాయపిశంగచీవరంబు జీరాడ ముండితసచూడశిరఃపింఛుండయి ఈలాగు వచ్చుచున్నవాఁడు; వీఁడెవ్వఁడగునో?

శాంతి—సఖీ! వీఁడు బుద్ధాగముఁడు.

భిక్షు—ఓహో! ఉపాసకులార! భిక్షువులార! మహానుభావుఁడగుసుగతుని వాక్యామృతము నాలకింపుఁడు-(పుస్తకముఁజదువుచున్నాఁడు)నేనీలోకంబుల సుగతిదుర్గతులను దివ్యదృష్టిని జూచుచున్నాను- సర్వపదార్థములును

క్షణికము లయి గోచరించుచున్నవి-ఆత్మ,స్థాయిగా నుండుటలేదు.కాఁబట్టి మీమీదారలను భిక్షువు లాక్రమించునప్పుడు మీ రించుకయు నీర్ష్యనుబొందఁ గూడదు- ఈర్ష్యయే,చిత్తమలముగదా!(తెరవంకఁజూచి)శ్రద్ధా!ఇటురా.

శ్రద్ధ—(ప్రవేశించి)రాజకుల మాజ్ఞాపించునుగాక.

భిక్షు—శ్రద్ధా! నీ వుపాసకులను, భిక్షువులను గట్టిగాఁ గౌఁగిలించుకొని యుండుము.

శ్రద్ధ—చిత్తము- (నిష్క్రమించుచున్నది)

శాంతి—సఖీ! ఇదియును దామసశ్రద్ధయేసుమా॰

కరు—నిజమే ప్రియసఖీ!

క్షపణకుఁడు—(భిక్షువునుజూచియెలుఁగెత్తి)ఓరోరిభిక్షుక! నిన్నొకటి యడిగెద నీలాగురారా-

భిక్షు—(క్రోధముతో) ఆ! పాప! పిశాచస్వరూప! ఏమిరా ప్రేలెదవు?

క్షప—ఓరీ! క్రోధమునువిడువు- నేను శాస్త్రగత మయినయంశమునే యడిగెదను-

భిక్షు— ఓరీ! క్షపణకా! నీకు శాస్త్రముకూడఁ దెలియునఁటరా? కానీ చూతము. (సమీపించి) ఏ మడిగెదవు?

క్షప—భిక్షుకా! మఱిచెప్పు, నీవు క్షణవినాశివిగదా! ఎవనికొఱ కిట్లు వ్రతధారణముసేయుచున్నావు?

భిక్షు—వినురా క్షపణక! అస్మత్సంతతి పతితుండగు కొండొక విజ్ఞానక్షణుండు, సముచ్ఛిన్నవాసనుం డయి, మోక్షంబును బొందఁగలదు.

క్షప.—ఓరోరిమూర్ఖ! యెప్పుడో యొకమన్వంతరమున నెవ్వఁడోయొకఁడు ముక్తుఁ డయినను, నిప్పుడేనశించునీ కిది యేమి యుపకారకము గాఁగలదు. కానీ- ఇంకొకటి యడిగెదను- ఓరీ! నీ కీధర్మ మెవఁ డుపదేశించినాఁడురా-

భిక్షు—ఓరీక్షపణకా! సర్వజ్ఞుఁడైనభగవానుఁడు బుద్ధుఁ డుపదేశించినాఁడురా-

క్షప—ఓరీ! బుద్ధుఁడు సర్వజ్ఞుఁ డని నీ వెట్లెఱుంగుదువు?

భిక్షు—ఓరిక్షపణకా! బుద్ధుఁడుసర్వజ్ఞుఁ డని తదాగమమువల్లనే వెల్లడియగుచున్నది-

క్షప—ఓరియుత్సన్నబుద్ధీ! వానిమాటవలననే వానిసర్వజ్ఞత్వము వెల్లడియగునేని నేనును సర్వజ్ఞుఁడనే విను-నీపితృపితామహప్రభృతు లిరువదియొకతరములవారితోఁగూడ నీవు నాకు దాసుఁడవుగా-

భిక్షు—ఆ! పాపపిశాచ! మలపంకధర! నేను నీకు దాసుఁడనురా?

క్షప—ఓరోరివిహారదాసీభుజంగ! దుష్టప్రవ్రజిత! నేను నీ కవి దృష్టాంతము గాఁ జెప్పినానురా- కానీ నీకు నే నొక్కహితంబును విస్రంభంబునం జేసి యుపదేశించెదను- నామాట విని నీ విఁక బుద్ధానుశాసనమును బరిత్యజించి, యర్హదనుశాసనము నవలంబించుచు, దిగంబరవ్రతమును ధరించు కొనుము.

భిక్షు—ఆ! పాప! నీవు స్వయముగాఁ జెడినదియే గాక యితరులనుగూడఁ జెఱుపఁ దలఁచుచున్నావురా.

క॥ నీకీతిని బాహ్యం బగు
స్వారాజ్యము నుజ్జగించి, సర్వజనంబుల్
గేరుపిశాచత్వంబును
బూనుషుఁ డెవ్వాఁడు గోర బుద్ధిఁ దలంచుఁగే?॥౧౧॥

ఆర్హతధర్మోపదేశము నయిన నెవఁ డాదరించును?

క్షప—ఓరీ! గ్రహనక్షత్రవార చంద్రసూర్యోపరాగ శుక్రరాహు పరమార్థజ్ఞాన సంవాదదర్శనంబుచేత, భగవానుఁ డయినయర్హతునిసర్వజ్ఞత్వము నిరూపిత మగుచున్నది గదా!

భిక్షు—(నవ్వి) ఓహో! అనాదిప్రవృత్తం బగునీజ్యోతిషాతీంద్రియజ్ఞానంబున నీవు వంచితుండ వయి, పాప మతికష్ట మగునీవ్రతము నవలంబించి యున్నవాఁడవు.

క॥ జీవుఁడు తనుపరిమితుఁ డనె
దేవగ ముజ్జగము నాతఁ డెట్లఁగడు? ఘటమం
డే వెలిఁగెడుదీవియ, గృహ
భావములను దాఁ బ్రకాశపఱుపం గలదే?॥౧౨॥

ఓరిక్షపణకా! లోకద్వయవిరుద్ధం బగునార్హతమతముకంటె సుగతదర్శనమే ప్రశస్త మయినది- అది సాత్త్వాత్సుఖావహ మతిరమణీయము.

శాంతి—సఖీ! మనము మఱియొకచోటికిఁ బోవుదము.

కరు—ఆలాగే ప్రియసఖీ! (నడుచుచున్నారు)

శాంతి—(ముందుచూచి) ఇదిగో! మనయెదుట సోమసిద్ధాంతుఁడు- కానీ- అంకరిడకుఁ గూడఁ బోవుదము.

(తరువాతఁ గాపాలికరూపధారి యగుసోమసిద్ధాంతుఁడు ప్రవేశించు చున్నాఁడు)

కాపా—(నడచి)

ఉ॥ మానిసిబొమికెపేరులను మై నెఱసొమ్ములుగా ధరించుచున్,
బోనము సేయుచున్ మనుజుపుఱ్ఱియలోన, శ్మశానవాసి నై
జ్ఞానము యోగకజ్జలవశంబున శుద్ధముగాఁగఁ, గాంచెదన్
నేను మిథఃప్రభిన్నము ననీశ్వరభిన్నముగాఁ బ్రపంచమున్॥౧౩॥

క్షప—ఓహో! ఈపురుషుఁడు కాపాలికవ్రతమును ధరించుచున్నాఁడు. కానీ వీనిని గూడఁ బ్రశ్నచేసెదను-(సమీపించి)ఓరీ! కాపాలికా! నరాస్థిముండ ధారకా! నీధర్మ మెటువంటిది? మోక్ష మెటువంటిదిరా?

కాపా—ఓరిక్షపణక! వినురా మాధర్మమును జెప్పుచున్నాను.

శా॥ మస్తిష్కాంత్ర వసాభిఘూరిత మహామాంసాహుతుల్ పావకో
పాస్తుల్; బ్రహ్మకపాలకల్పిత సురాపానంబు మాపుష్టి; స
ద్యస్తీవ్రాసి నికృత్తకంఠ విగళద్రక్తోగ్ర మర్త్యోపహా
ర స్తుత్యక్ష్మబలిప్రదానముల యర్చల్ భైరవస్వామికిన్॥౧౪॥

భిక్షు—(చెవులుమూసికొని) ఓహో! ఈధర్మచర్య మహాదారుణము గదా!

క్షప—అర్హంతా! అర్హంత! ఎవఁడో ఘోరపాతకుఁ డీతుచ్ఛుని మోసపుచ్చెను గదా!

కాపా—(క్రోధముతో) ఆ! పాప! పాషండాపశద! ముండితముండ! చండాలవేష! కేశోల్లుంఛక! ఓరీ! చతుర్దశభువనోత్పత్తిస్థితిప్రలయప్రవర్తకుండు, వేదాంతసిద్ధాంత ప్రసిద్ధవిభవుండు, భగవంతుండు, శ్రీభవానీధవుండు మోసగాఁడటరా- అటు లయిన మా యీధర్మముమహిమను జూపెదము.

చ॥ హరిహరపద్మసంభవ ముఖ్యామరబృందముఁ దెత్తుఁ గ్రిందికిన్;
దివిఁగఁగ నీక తారలగతిన్ గగనంబున నడ్డగింతు; భూ
ధర నగరాన్వితం బయినధారుణి నీరున ముంచి, వెండి, చె
చ్చెరఁ జెలుఁగుండ పెంచికలచే సలిలం బఖిలంబుఁ ద్రావుదున్॥౧౫॥

—ఓరికాపాలికా! ఇందుచేతనే, యెవఁడో యైంద్రజాలికుఁడు మాయను జూపి నిన్ను మోసపుచ్చినాఁడని నే నన్నాను.

కాపా—ఓరిపాపాత్మా! మరల నస్పరమేశ్వరు నైంద్రజాలికుఁడని యాక్షేపించుచున్నావురా! ఓహో! నీ దౌరాత్మ్య మింక క్షమింపఁ దగినది గాదు-(కత్తిదూసి) నే నిదిగో!

ఉ॥ వేఁడిగ నుచ్చలద్బహుళఫేనిలబుద్బుదరక్తములర్, నా
వాఁడికృపాణిధారను, భవద్గళనాళము లీలఁ దున్మి తూ
టాడి, వడిం దనుద్ధమరుడాంకృతి హూతపిశాచభూతముల్
నేఁ డిటఁ గూడ, భర్గగృహిణీమణికిం దగువిందుఁ జేసెదన్ ॥౧౬॥

(కత్తియెత్తుచున్నాఁడు)

క్షప—(భయముతో) ఓహో! మహాభాగ! "అహింసా పరమో ధర్మ" యందురు గదా! (భిక్షునంకముఁ జేరుచున్నాఁడు-)

భిక్షు—(కాపాలికుని వారించి) ఓయీ మహానుభావ! వినోదముగాఁ బ్రవర్తిల్లినయీవాక్కలహమున నింతకోప మెత్తి యీదీనుని గత్తియెత్తి నఱుకఁ జూచుట యనుచితము సుమా.

కాపా—(క్షమించి కత్తి యొఱలో వేయుచున్నాఁడు)

క్షప—(ఊఱడిల్లి) ఓయిమహాత్మ! నీ ఘోరరోషావేశము నుపసంహరించితివేని నే నిం కొకకఱటి నిన్నడుగఁ గోరుచున్నాను.

కాపా—అడు గడుగు.

క్షప—అయ్యా! నీ దగుపరమధర్మమును విన్నాను- మఱి నీమోక్ష మెట్టిదో కూడ సెల విమ్ము.

కాపా—క్షపణకా! వినుము.

మ॥ కన మెచ్చో విషయానుషంగమునఁ దక్కన్ సౌఖ్య మానందమో
ధను వర్జించినజీవునికి యుపలత్వం బేల తద్వాంఛ? చ
క్కని గౌరీప్రతిరూప కాంత తను బిగ్గం గౌఁగిలింపంగ, నా
యని క్రీడించును ముక్తుఁ డీశ్వరతనుం డై యంచు సోముం డనెన్ ॥౧౭॥

శాంతి—హరిహరీ! ఈలాటిశాస్త్రమునకుఁ గూడ భగవంతుఁడు భవానీభర్త కర్త యనుచున్నాఁడు- ఓహో! దురాత్ములవిజయము.

భిక్షు—మహాత్మా! వీతరాగుఁడు గానివానికి ముక్తి యనుట యవిశ్వసనీయము గదా!

క్షప—ఓరికాపాలికా! నీకుఁ గోపము రాకపోయెనా నే నిం కొకకఱటి యనియెదను- చూడు- శరీరిని సరాగుని ముక్తుఁ డందువు- ఇది వేదవిరుద్ధము.

కాపా—(తనలో) ఓహో! వీరలయంతఃకరణము లశ్రద్ధాత్యస్తంబు లయిన [illegible] కానీ- ఇట్లుచేసెదను- (తెరవంకఁ జూచి ప్రకాశముగా) శ్రద్ధా! ఇటు రమ్ము.

(తరువాతఁ గాపాలినీరూపధారిణి యయినశ్రద్ధ ప్రవేశించుచున్నది)

కరు—సఖీ! రజస్సుత నీశ్రద్ధను జూడుచూడు.

క॥ స్ఫురదిందీవర సుందర
తరలాక్షి,నితంబ జృంభిత స్తనభరమం
థర,నరకీకసమాలా
భరణ,విలాసిని, సుధాంశువదన యి దలరున్॥౧౮॥

శ్రద్ధ—(నడచి)ఇదిగో! వచ్చినాను- స్వామీ! ఆజ్ఞాపింపుఁడు.

కాపా—ప్రియురాలా! ఈదురభిమాని యగుభిక్షుకుని నీవు గట్టిగాఁ గౌఁగిలించుకొమ్ము.

శ్రద్ధ—(భిక్షువును గౌఁగిలించుకొనుచున్నది)

భిక్షు—(సానందముగాఁ గౌఁగిలించుకొని రోమాంచము నభినయించుచు రహస్యముగా) ఓహో! కాపాలినీస్పర్శ మెంతసుఖకరముగా నున్నది!

మ॥ పొగరుంగుబ్బలు సందిటంగుదియ,బల్మోహంబునం గౌఁగిలిం
పఁగలే దెందఱు బాలరండలను శుంభత్పీనవక్షోజలన్?
సుగతస్వాముల యాన,నే నెఱుఁగ నెచ్చో నిట్టి కాపాలినీ
నగపీనోచ్చ కుచోపగూహన భవానందానుసంధానముల్॥౧౯॥

ఓహో! కాపాలికచరిత మెంతపుణ్యము! ఔరా! సోమసిద్ధాంత మెంత శ్లాఘ్యము! ఆహా! ఈధర్మ మత్యాశ్చర్యము గదా! ఓహో! మహానుభావ! సర్వథా నేను బుద్ధానుశాసనమును విడచినాను- మనఃపూర్వకముగా సోమసిద్ధాంతము నవలంబించినాను- నిజముగా నీ వాచార్యుఁడవు! నేనుశిష్యుఁడను- స్వామీ! మా హేశ్వరదీక్షను నా కుపదేశింపుము.

క్షప—ఓరీ! భిక్షుక! నీవు కాపాలినీస్పర్శదూషితుఁడవు,గావున దూరముగాఁ దొలఁగుము.

భిక్షు—ఓరి వెడఁగా! కాపాలినీపరిరంభమహోత్సవము నీ కెట్లుదొరకును? అయ్యో! నీవు మోసపోయినావురా.

కాపా—ప్రియురాలా! క్షపణకునిఁ గౌఁగిలించుకొమ్ము.

శ్రద్ధ—(క్షపణకునిఁ గౌఁగిలించుకొనుచున్నది)

క్షప—ఓహో! అర్హత! అర్హత! ఆహా! కాపాలినీస్పర్శ మెంతసుఖముగా నున్నది! సుందరీ! మరల నిం కొకసారి మాఱు నీబిగువుఁగవుఁగిలి నా కొసంగుము.

(తనలో) అయ్యో! నా కింద్రియవికార మవారణ మగుచున్నదే- దిగంబరుఁడను నే నేలా గిది కప్పుకొనఁ గలను? ఉపాయాంతరము దోఁప కున్న దే-

కానీ- ఈనెమిలిపింఛ మున్నది గదా! దీనితోనే యీయింద్రియోద్రేకమును మూటుకొనియెదను.

(అలాగుచేసి)

క॥ ఓవెలఁదీ! కాపాలిని!
పీవరఘనసుస్తనీ! విభీతమృగాక్షీ!
భావకి వై నీ వెనసిన
శ్రావకి చా నేమిసేయఁ జాలును జగతిన్॥౨౦॥

ఓహో! కాపాలికమత మొక్కఁటే భోగమోక్షములకు సాధనంబు- ఓ మహాయాచార్య! నేను నీ కిప్పుడు దాసుఁడ నయినాను- నన్నుఁ గూడ మహాభైర వానుశాసనముఁనఁ బ్రవర్తింపఁ జేయుము.

కాపా.—మీరు గూరుచుండుఁడు.

ఇద్దఱు—(అట్లు చేయుచున్నారు)

కాపా—(పానపాత్రమును బుచ్చుకొని ధ్యానము చేయుచున్నాఁడు)

శ్రద్ధ—స్వామీ! పాత్రము సురాపూరిత మయినది.

కాపా—(చూచి తాను త్రాగి మిగిలినది భిక్షుక్షపణకుల కిచ్చుచు మంత్రము చదువుచున్నాఁడు)

క॥ అమృతం బిది పరమపవి
త్రము, భవభేషజము, పశువితతిపాశహర
క్షమము, మహాభైరవసూ
క్తము, సౌఖ్యావహము దీనిఁ ద్రావుఁడు దాసుల్॥౨౧॥

ఇద్దఱు—(విమర్శించుచున్నారు)

క్షప—అయ్యో! మా యర్హదనుశాసనమున సురాపానము లేదే.

భిక్షు—కటకటా! కాపాలికుఁ డెంగిలి చేసినయీసుర నే నేలాగు త్రాగుదును?

కాపా—(విమర్శించి రహస్యముగా) ఏమిది- అనుమానించుచున్నారు? శ్రద్ధా! వీరిపశుత్వ మింకను దొలఁగి పోకున్నది- అందుచేతనే, నానోటికి దాఁకిన దని వీ రీకల్లు నపవిత్రముగా నెంచుచున్నారు; కాఁబట్టి యోపూజ్యురాలా! నీవు స్వవక్త్రాసవంబున దీనిం బావనంబు గావించి వీరి కొసఁగుము-"స్త్రీముఖం తు సదా శుచి"యని వైదికులును బలుకుచుందురు గదా!

శ్రద్ధ—చిత్తము స్వామీ! (చషకమును బుచ్చుకొని పీతశేష మిచ్చుచున్నది)

భిక్షు—మహాప్రసాదము- (గిన్నెపుచ్చుకొని త్రాగుచున్నాఁడు)
ఓహోహో!. ఏమి యీసురాపరిమళము!

మ॥ వకుళామోదము సీధువుక్ సువదనావక్త్రాసవోచ్ఛిష్ట ము
త్సుకతక్ వేశ్యలతోడ నెన్నితడవల్ తోరంబుగాఁ గ్రోల మే
మకటా! యిట్టి కపాలినీప్రణయద త్తాస్యాసవామోది మ
ద్యకణం బెన్నఁడు నబ్బమిం జుమి సుధాధారల్ సురల్ గోరుటల్॥౨౭॥

క్షప.... ఓరిభిక్షుక! అది యంతయు నీ వొక్కఁడవే త్రాగివేయకురా-కాపాలినీ వదనోచ్ఛిష్ట మయినమదిర, నాకుఁ గూడఁ గొంచె మిప్పింపుము.

భిక్షు—(క్షపణకునకుఁ బానపాత్ర మందించుచున్నాఁడు)

క్షప—(త్రాగి) ఓహోహో! ఏమిమాధుర్యము! ఆహాహా! ఎంతస్వాదము! అన్నన్నా! ఏమిగంధము! ఔరౌరా! ఏమిసౌరభము! అయ్యయ్యో! చిరకాల మర్హదనుశాసనంబునం బడి యీలాటిహాలారసమునకు దూర మయితిని గదా! ఓరోరిభిక్షుక! నాయొడలు దిరుగుచున్నది; కొంచెము సేపు పరుండి నిద్రపోయెదను.

భిక్షు—అలాగే చేయుదమురా-(ఇద్దఱునట్లు చేయుచున్నారు)

కాపా—ప్రియురాలా! వెల లేకయే కొన్నయిద్దఱుదాసులు మనకు దొరకినారు- కాఁబట్టి మనము నృత్యము చేయుదము-(నృత్యము చేయుచున్నారు)

క్షప—ఓరీ! భిక్షుక! ఈకాపాలికుఁడు, కాదుకా దీయాచార్యుఁడు కాపాలినితోఁ గూడఁ జక్కఁగా నృత్యముఁ జేయుచున్నాఁడు; కాఁబట్టి వీనితోఁ గూడ మనమును నృత్యము చేయుదము.

భిక్షు—అలాగే చేయుదము-(మత్తునఁ దూలితూలిపడుచు నిద్దఱును నృత్యము చేయుచున్నారు)

క్షప— క॥ ఓవెలఁదీ! కాపాలిని!
పీవరఘనసుస్తనీ! విభీతమృగాక్షీ!
భావకి వయి నీ వెనసిన
శ్రీవకి దా నేమి సేయఁ జాలును జగతిక్?॥

(అని పాడుచున్నాఁడు)

భిక్షు—ఆచార్య! ఈదర్శనము మహాశ్చర్యము- ఇందు శ్రమ లేకయే యభిమతార్థసిద్ధు లొడఁగూడుచున్నవి.

కాపా—ఓహో! ఇది యొకయాశ్చర్యమా? చూడు.

మ॥ దొరకుక్ వాంఛితవస్తులందు విషయోద్యోగం బడంగింపకే
పరమాసన్న మహోదయ ప్రణయికిక్ భవ్యాష్టసిద్ధుల్ వశీ
కరణ క్షోభణ మోహన ప్రమథ నాకర్షిక్ యోచ్చాటనల్

ధరణిం బ్రాకృతసిద్ధులీతెగవి విద్యాయోగ విఘ్నాకృతుల్॥౨౩॥

క్షప—ఓరి కాపాలిక! (ఆలోచించి) ఓరి యాచార్య! కాదు, ఓరి రాజకుల! (నడుచుచున్నాఁడు)

భిక్షు—అయ్యో! పాప మలవాటు లేనియీదీనిఁ బతిమాత్రముగాఁ ద్రాగిన వారుణీరసంబున నపస్మారి యయిపోయినాఁడు; కాఁబట్టి మత్తు దిగిపోవుట కేదేని యుపాయము చేయవలయును.

కాపా—అలాగే చేసెదను-(తననోటిలోని తమ్మ క్షపణకున కిచ్చుచున్నాఁడు)

క్షప—(స్వస్థుఁడయి) ఆచార్య! మి మ్మొకటి యడిగెదను- మీరు ధ్యానము చేసి యెక్కడనుండియో సుర నొకనిమిషములోఁ దెప్పించినారే. ఇట్టిసామర్థ్యము స్త్రీపురుషులను రప్పించుటయందుఁ గూడ మీకుఁ గలదా?

కాపా—ఏమీ యిది యొకవిశేషముగా నడిగెదవు!

క॥ సురసుందరినో, విద్యా
ధర తరుణీమణినో, యక్షతరళేక్షణనో,
యురగాంగననో, విద్యా
గరిమను వలసినది యెందుఁ గలిగినఁ దెత్తున్॥౨౪॥

క్షప—ఓహో! నే నిది గణితమువలనఁ దెలిసికొన్నాను-మన మందఱము మహామోహమహారాజు కింకరులము.

ఇద్దఱు—ఆయుష్మంతుఁడా! నీవు తెలిసికొన్నది యథార్థమే.

క్షప—అటు లయిన రాజకార్య మేమయినఁ గొంచె మాలోచింప వలయును

కాపా—అది యేమి?

క్షప—అయ్యా! సత్త్వపుత్రి యయినశ్రద్ధ నీడ్చుకొని వచ్చుటకు మహారాజాజ్ఞాపించినాఁడు.

కాపా—ఆదాని సతిూఁతు ఎక్కడ నున్నదో చెప్పు- ఇదిగో! నావిద్యాబలమున క్షణములో దాని నిటకు రప్పించెదను.

క్షప—ఆలా గయిన నేను గణితము చేసి దానిని నీకుఁ జూపెదను.

(కొడఁపుతో భూమిమీఁద స్థానములు వ్రాసి గణించుచున్నాఁడు)

శాంతి—సఖీ! ఈపాతాకులయాలాపము లస్మద్విషయ మయినవిగా వినఁబడుచున్నవి- మనము సావధానముగా వీనిని విందము.

కరు—సఖీ! ఆలాగే చేయుదము.

ఇద్దఱు—(అట్లు చేయుచున్నారు)

క్షప— ఆ॥వె॥ స్థలమునందు లేదు; జలమందు లేదు; పా
తాళమునను బర్వతముల లేదు;
విష్ణుభక్తితోడ, వెలఁది, మహాత్ముల
యుల్లముల వసించి యున్న దిపుడు॥౭౫॥

కరు—(ఆనందముతో)సఖీ! నీ వదృష్టవంతురాలవు- మీయమ్మ విష్ణుభక్తిదేవికిఁ బార్శ్వవర్తిని యయి యున్న దఁట.

శాంతి—(హర్షము నభినయించుచున్నది)

భిక్షు—మఱి కాముని వలన వేఱుపడినధర్ముని ప్రచార మెకడనో చూడుము.

క్షప—(మరల గణించి)

ఆ॥వె॥ స్థలమునందు లేదు; జలమందు లేదు; పా
తాళమునను బర్వతముల లేదు;
విష్ణుభక్తితోడ బెరసి మహాత్ముల
యుల్లముల వసించి యున్నవాఁడు॥

కాపా—అయ్యో! మహారాజున కత్యాహితము సంభవించెను గదా!

పంచచామరము.

ఎసంగు విష్ణుభక్తి మూల మీ ప్రబోధ సిద్ధికిన్;
పొసంగ నామె యొద్ద సత్త్వపుత్రి శ్రద్ధ చేరెనే;
యసక్తకాముఁ డైనధర్ముఁ డందుఁ దాను గూడెనా,
వెసన్ ఫలించినట్టులే వివేకకృత్య మంతయున్॥౭౬॥

అవుఁగాక, ప్రాణము లయినను వెచ్చఁబెట్టి ప్రభుకార్యము సాధింప వలయును గదా! ధర్మశ్రద్ధాహరణార్థము మహాభైరవవిద్యను బంపుదము.

(నిష్క్రమించిరి)

శాంతి—సఖి! మనము కూడఁ బోయి యీహతాశుల దురాలోచనమును విష్ణుభక్తిదేవితో నివేదింతము- (నిష్క్రమించుచున్నారు)

ఇది శ్రీపరమేశ్వరవరప్రసాదలబ్ధ సరసకవితాధురంధర వడ్డాదిసాధువంశక్షీర
నీరాకర రాకాసుధాకర రాచ్చనామాత్యపౌత్ర హరితసగోత్ర పవిత్ర
గుణకదంబలక్ష్మాంబా గర్భశుక్తిముక్తాఫల సూరపరాజప్ర
ధానతనూభవ విబుధవిధేయ సుబ్బరాయనామధే
యాంధ్రీకృత శాంతరసాసారప్రబోధచంద్రో
దయనాటకంబునందుఁ బాషండవిడం
బనం బనుతృతీయాంకము.

శ్రీ ర స్తు.

శ్రీ పరమాత్మనే నమః.

ప్ర బో ధ చం ద్రో ద య ము.

చ తు ర్థాం క ము.

(తరువాత మైత్రి ప్రవేశించుచున్నది)

మైత్రి—మహాభైరవీ గ్రసనసంభ్రమంబున కద్దుపడి, తనప్రాణములను మహానుభావురా లయినవిష్ణుభక్తి కాపాడుటం జేసి, ప్రియసఖి యయినశ్రద్ధ ధర్మసహిత యయి వర్ధిల్లుచున్న దని ముదితవలన నేను విన్నదానను- నెచ్చెలిని వీక్షించుటకు నాహృదయము కడుం దహతహ పడుచున్నది. ఆమెను నే నెందుం జూడంగలను? (నడచుచున్నది)

(తరువాత శ్రద్ధ ప్రవేశించుచున్నది)

శ్రద్ధ—(సబివికారాలు చూచి భయాకంపముతో)

శా॥ కూళన్, నారకపాల కుండలను, దృగ్గోళోద్భవ చ్చంచలన్,
జ్వాలాభీల పిశంగ కైశికను, దంష్ట్రా చంద్రరేఖాంతర
వ్యాలోలాయతజిహ్వికన్, వికృతరూపన్, భైరవిన్ జెంత నే
నాలోకించుచు నున్నటుల్, కదళిచాయన్ గుండె జల్జ ల్లనున్॥౧॥

మైత్రి—(తనలో) ఓహో! ఇదిగోం బ్రియసఖి యయినశ్రద్ధ, భయసంభ్రమోద్భ్రాంతస్వాంత యయి, సభస్వదుత్కంపిత రంభాతరు తరళంబు లయిన యవయవంబులతోం, దనలోం దా నేమో యాలోచించుకొనుచు, నెదుటనున్నను, నన్నుం జూడకున్నది- కానీ నేనే యీమెను బలుకరించెదను-(ప్రకాశముగా) ప్రియసఖీ! శ్రద్ధా! నీ వేదో తలంపుయారాటమున నన్నుం గూడ జూడకున్నావు.

శ్రద్ధ—(చూచి నిట్టూర్పుతో) ఓహో! ప్రియసఖి మైత్రేయా?

తే॥గీ॥ కాళరాత్రికరాళాస్య గహ్వరాంత
రాళభీషణదంష్ట్రాంతర ప్రవిష్ట

నయ్యో, నే నిన్ను నీజన్మమందె మరలఁ
జూడఁ గాంచితి సఖి! పూర్వసుకృతమునను॥౨॥

ప్రాణసఖీ! ఇటు వచ్చి నన్నొకసారి గట్టిగాఁ గౌఁగిలించుకొనుము.

మైత్రి—(అట్లు చేసి) సఖీ? ఆమహాభైరవి యడచిపాటంతయు విష్ణుభక్తిదేవి యడఁచివేసెను గదా! నీయెడ లిప్పటికిని నిట్లు వడఁకు చుంటకు నిమిత్తమేమి?

శ్రద్ధ—శా॥ కపాలిన్, నార కపాల కుండలను, దృగ్గోళోద్భవ చ్చంచలన్,
జ్వాలాభీల పిశంగ కైశికను, దంష్ట్రాచంద్ర రేఖాంతర
వ్యాలోలాయతజిహ్వికన్, వికృతరూపన్, భైరవిన్ జెంత నే
నాలోకించుచు నున్నటుల్ కదళిచాయన్ గుండె జల్ జల్లనున్॥

మైత్రి—(త్రాసముతో) అమ్మయ్యో! హతాశురా లది యెంత ఘోరదర్శనురాలు! సఖీ! అట్లు వచ్చి యది యేమి చేసినది?

శ్రద్ధ—విను చెలియా!

ఉ॥ వేఁగున వేగపాటువడి, వే నను ధర్ముఁ జె ఱొకసారి చేతితోఁ,
చాఁ గడకాళ్ళు వట్టుకొని, దారున నింగిని బాఱె ఘోర నై
యాఁగక, పాదయుగ్మ నఖరాగ్రములన్ జెఱుఁగోడిపిల్లలన్
దాఁగి హతాత్ము పై నుఱికి తన్నుక పోయెడు గ్రద్దకై వడిన్॥౩॥

మైత్రి—అయ్యో! ఎంతకష్ట మెంతకష్టము! (మూర్ఛిల్లుచున్నది)

శ్రద్ధ—సఖీ! ఊఱడిల్లు మూఱడిల్లుము.

మైత్రి—(ఊఱడిల్లి) తరువాతఁ దరువాత?

శ్రద్ధ—సఖీ! అట్టిమహోపద్రవంబున మదీయార్తప్రలాపంబు లాలకించి విష్ణుభక్తిదేవి నాయెడలఁ గరుణార్ద్రహృదయ యయి దానిపయిం గనిసి—

క॥ భ్రూభంగపాటలంబుగ
వ్యాభుగ్నక్రోధదృష్టి నవలోకింపన్
దా భగ్నశీర్ష నై యది
భూభృచ్ఛిల భిదురనిహతిఁ బోలెం గూలెన్॥౪॥

మైత్రి—అమ్మా! ప్రియసఖీ! బెబ్బులినోరనుండి జాఱి పడినయాఁడు లేడివలె నదృష్టవశంబున దైవానుగ్రహంబునం బ్రతికితివి- తరువాతఁ దరువాత?

శ్రద్ధ—అనంతరము దేవి యీవిషయమున నెంతో యభిమానము గలిదియయి యిట్లు పలికినది- "దురాత్ముఁ డీమహామోహపాతకుఁడు నన్నుఁ గూడఁ జీరికిం గొనక నిరాకరించి తిరుగుచున్నవాఁడు; కావుబట్టి వీనిని శీఘ్రము

గాఁ బట్టి మూలముట్టఁ బెల్లగించివేసెదను." అని శపథము చేసి,యాభగవతి నన్నుఁ జూచి,"శ్రద్ధా! వివేకునితో నీ విట్లు చెప్పుము "వత్సా నీవు కామక్రోధాదులను నిర్జించుటకుం దగినప్రయత్నమును జేయుచుండుము. అంతట వైరాగ్యుఁడును బుట్టఁగలఁడు- నేనును యథాసమయమునఁ బ్రాణాయామాద్యనుపానంబునం జేసి నీకు సైన్యము ననుగ్రహించెదను- ఋతంభరాదు లయినదేవులును, శాంత్యాదులకౌశలంబున నుపనిషద్దేవితోఁ గూడిననీకుఁ, బ్రబోధోదయ మనంతరము గావింపఁగలరు-" అని యాజ్ఞాపించినది; కాఁబట్టి యామెసందేశమును దెలుప నే నిప్పుడు వివేకునిసన్నిధికిఁ బోవుచున్నదానను. మఱి నీ వేవిధమున దినములు వెళ్ళఁబుచ్చుచున్నావు? చెప్పుము ప్రియసఖీ!

మైత్రి—సకియా! మే మకాలెన్ల్లెంద్రము నలువురమును విష్ణుభక్తిదేవియాజ్ఞచొప్పున, వివేకునకు మనోరథసిద్ధి గావలయు నని మహాత్ముల హృదయములయందుఁ బ్రవేశించి యున్నవారము. వారును—

తే॥గీ॥ సుఖులయందు స న్నసుఖులందు ననుకంప,
సుకృతులందు ముదిత, వికలులం దు
పేక్షఁ దలఁచు చుందు రివ్విధి రాగలో
భాది కలుష మయ్యు నాత్మ దెలి॥౫॥

కావున నిట్లు మేము, తోఁబుట్టువులము నలువురమును, దదభ్యుదయవ్యాపారమునసే ప్రొద్దులు గడపుచున్నవారము. ప్రియసఖీ! నీవు మహారాజు నిప్పు డెక్కడఁ గనుఁగొనఁగలవు?

శ్రద్ధ—ఆసమాచారము గూడ విష్ణుభక్తిదేవియే నాతో సెల విచ్చినది. రాఢయనుపేరితో నొకానొకజనపదము గల దఁట. అచ్చటభాగీరథీపరిసరాలంకారభూత మగుచక్రతీర్థమున, మీమాంసానుగత యగుమతిదేవి యెట్టెట్టో తన్నుఁ బ్రాణములతోఁ గాపాడుచుండఁ గలఁతనొందినయంతరాత్మతో, వివేకుఁ డుపనిషద్దేవీసంగమార్థ మహర్నిశ మధికతపస్సుఁ జేయుచున్నవాఁ డఁట.

మైత్రి—అట్టు లయినఁ బోయిరమ్ము ప్రియసఖీ! నేనును నాపనిమీఁద నుండెదను.

శ్రద్ధ—మంచిది చెలియా! (ఇద్దఱు నిష్క్రమించుచున్నారు. విష్కంభము)

(తరువాత రాజును బ్రతీహారియుఁ బ్రవేశించుచున్నారు)

రాజు—ఆ! పాప! మహామోహపాతక! నీమూలమున నీమహాజనుఁడు సర్వ

థా ప్రణష్టుం డయి పోవుచున్నవాఁడు గదరా.

మ॥ తరఁగ ల్లేని యనంతశ క్తియుత శాంతస్వచ్ఛ చిత్సౌఖ్యభా
సుర సత్యామృతవార్ధిలో, మునిఁగియుం జు క్కై ఱిన ట్రోలం డయో!
యరసం జౌమృగతృష్ణి కార్ణవములో, సాయాసతన్ మూర్ఖుఁ డా
తురుఁ డై త్రావును, నాచమించు, దిగు, నీఁదున్, మున్గెదున్, దేలెదున్॥

ఈసంసారచక్రవాహకుఁ డయిన మహామోహునకు నబోధమే మూలము గావునఁ దన్నివృత్తికొఱకుఁ దత్త్వబోధమే కావలసినది.

ఆ॥వె॥ ఆత్మబోధమూల మైనయీసంసార
దుష్టతరువు వేళ్ళతోడఁ బెఱుక,
వే ఱుపాయ మేది విశ్వేశ్వరార్చా ప్ర
భూత మైనతత్త్వబోధ దక్క॥౭॥

తలఁచుగా సుకృతు లవలంబించి చేయుకార్యమునకు దేవతలు సయితము తోడువత్తు రని తత్త్వవిదులు వ్యవహరింతురు- అది యథార్థమే. కామాదిజయమునకు న న్నుద్యోగింపు మని యుఁ, దాను నాపక్ష మవలంబించి యుండు ననియు విష్ణుభక్తిదేవి నాకు సందేశము పంపినది గదా! ఆమె నవారిలోఁ గాముఁ డొక్కఁడు మహావీరుఁడు. వానిని వస్తువిచారుఁడే జయింపవలయును. కానీ. వాని నోర్చుటకు వీనినే నియోగించెదను. వేదవతీ! వస్తువిచారునిఁ బిలిచికొని రా.

ప్రతిహారి—దేవా! చిత్తము. (నిష్క్రమించి వస్తువిచారునితోఁ బ్రవేశించుచున్నది.

వస్తు—ఔరౌరా! నిర్విచారసౌందర్యాభిమాన వర్ధిష్ణుం డగునీకామహతకుని చేత జగతు లన్నియు నిహతము లగుచున్నవి గదా! కా దీదురాత్ముఁ డయిన మహామోహునిచేతనే.

మ॥ బళే! ప్రత్యక్షపుమైలతిత్తిఁ బాలఁతిం, బ్రాజ్ఞుండు నీక్షించి, వ
ర్తులతుంగస్తని, యుత్పలాక్షి, కలితభ్రూవల్లి, పద్మాస్య, స
త్పులినశ్రోణి, మనోహరాంగి యనుచున్ మోదించుఁ, గీర్తించు, మ
త్తిలుఁ, గ్రీడించును మోహదుశ్చరితముల్ తెల్పన్ మహాశ్చర్యముల్॥

మఱియు యథావస్తువిచారవంతు లగుమతిమంతు లయినను, నెఱచిఖురదంజఱచి మఱుఁగుపఱిచినయెమ్ముకలగూఁడు, స్వభావదుర్గంధి, బీభత్సవేష, యోష యని రోసి, దానియం దిసుమంతయు విరక్తిం బొందకున్న వారు. దీనింబట్టి చూడఁగాఁ జేడియలయం దితరగుణారోపము చేసికొ

స్నట్టు స్పష్టపడుచునే యున్నది.

చ॥ మొరయు కడానిపైఁడిచిఱుమువ్వల రత్నపునూపురాలు, మే
త్తరముల ముత్తెపున్నసులు, లత్తుక కుంకుమ మీసురాగముల్,
సురభిళ పుష్పదామములు, సుందరచిత్రదుకూలముల్, జవల్
గరితగఁ జూతు రెంచ నరకంబె గదా దిగ నారిపేరిటన్॥౯॥

(ఆకాశము చూచి) ఆ! పాప! కామచండాల! నిరాలంబముగా సంభావిం
చునీచేత నీజనుఁడు వ్యాకులీభూతుఁ డగుచున్నవాఁడు గదా!

ఔరా! పిచ్చితనము! ఈకామాంధుఁడు.

మ॥ వలచున్ సుందరి నన్నుఁ; జంద్రముఖి నావంక న్విలోకించు; గు
బ్బ లురమ్మాడఁగఁ జేడె నాకుఁ బరిరంభం బిచ్చు నం చుబ్బెడున్;
ఓరిమూఢహృదయా!
వలచున్ నిన్నది? చూచు నేది? పశువా! త్వఙ్మాంస మేదోవసా
స్థుల నిర్మించిననారి కేమెఱు కమూర్తుం డీశుఁడే నిన్గనున్॥౧౦॥

ప్రతి—మహాత్మా! ఇటురమ్ము. (ఇద్దఱు నడుచుచున్నారు)

ప్రతి—ఇదిగో! మహారాజు దయచేసి యున్నారు. చేరువ కరుగుము.

వస్తు—(సమీపించి) దేవా! జయముజయము. వస్తువిచారుఁడు వీఁడె నమస్క
రించుచున్నాఁడు.

రాజు—ఓయీ! వస్తువిచార! ఇటు గూరుచుండుము.

వస్తు—(కూరుచుండి) దేవా! వీఁడె దేవరకింకరుఁడు వచ్చినాఁడు. వీని నా
జ్ఞాప్రదానమున ననుగ్రహింపుఁడు.

రాజు—ఓయీ! మనకు మహామోహునితో యుద్ధము సంప్రాప్త మయినది
ఆపక్షమువారిలోఁ గాముఁడు మొదటివీరుఁడు; వానికిఁ బ్రతివీరునిఁ
గా నిన్ను మే మేర్పఱిచి పిలిపించినారము.

వస్తు—దేవరవా రిట్లు సంభావించుటచేత నేను ధన్యుఁడ నయినాను.

రాజు—అయిన నోయీ! నీ వేవిధ మయినశస్త్రవిద్యచేతఁ గాముని జయిం
చెదవు?

వస్తు—ఆ! పంచశరుఁడు! పంచశరుఁడు! పువ్విలుకానిఁ గదా యి
ప్పుడు మడియింపవలయును. దేవా! ఈమాత్రపుఁబనికి శస్త్రము కూ
డఁబట్టవలయునా? చిత్తగింపుఁడు-

శా॥ ఆరాద్ద్వారపిధానముల్ దృఢతరం బౌరీతిఁ గావించియున్,
నారీసంస్మరణంబుఁ దద్వదనసందర్శంబుఁ బారిష్లించుచో,

నారూఢిం బరిణామసీరసత దేహాత్యంతబీభత్సతన్,
లో రాత్రిందివ మెంచుచున్,విడువ కున్మూలింతు నే గంతునిన్ ॥౧౧॥

రాజు—మేలుమేలు! వస్తువిచార!

వస్తు—దేవా! ఇంకొకటి.

చ॥ అతినిపతజ్ఝరీ మసృణితాశ్మము లద్రితతుల్, విశాలసై
కతములు నిమ్నగల్,ఘనసగంబు లరణ్యము లుండ, వ్యాసభా
షిత శమవాక్యములన్ బుధుల చెల్మియు నుండ, వసాస్థిమాంసశో
ణితమయి నారి గిరి,యవినీతుఁడు కాముఁడు గెల్చుఁ డెక్కడన్॥౧౨॥

దేవా! సుందరియే కందర్పునకుఁ బ్రధానాస్త్రము,అది యవ్విధమున వ్యర్థయయినతోడనే వానిసర్వసహాయులును విఫలారంభు లయి భంగపడుదురు.చూడు.

ఉ॥ చెందొగవిందుఁ,జందనముఁ, జెన్నగువెన్నలరేలు, గుంజదిం
దిందిరసుందరోపవనదేశము లమ్మధువాసరంబులున్,
మందకదంబవాయువులు, మంద్రరవాంబుధరోదయంబులున్,
గందు రతీముఖాప్తులును,గాంతను గెల్చుడుఁ గారె నిర్జితుల్? ॥౧౩॥

దేవా! జాగు సేయక నాకు వేగముగా ననుజ్ఞ దయచేయుఁడు, నే నిప్పుడే—

క॥ అలుఁగులతో గాండివి కురు
బలముల నలిఁజేసి సింధుపతి నెట్టు లటుల్
పలుఁదెలుఁగువిచారంబులఁ
గలఁతపఱిచి పరబలములఁ గంతునిఁ ద్రుంతున్॥౧౪॥

రాజు—(అనుగ్రహముతో) ఓయీ! నీవు శత్రుసంహారార్థము యుద్ధమునకు సిద్ధముగా నుండుము.

వస్తు—దేవా, మహాప్రసాదము, (నమస్కరించి నిష్క్రమించుచున్నాఁడు,)

రాజు—వేదవతీ! క్రోధుని గెలుచుటకు క్షమ నిటు పిలువుము,

ప్రతి—చిత్తముదేవా! (నిష్క్రమించి మరల క్షమతోఁ బ్రవేశించుచున్నది)

క్షమ—క॥ ప్రకటమహాక్రోధతమో
వికటభ్రూకుటియు రూక్షవీక్షణజనిత సాం
ధ్యకిరణుఁ డగుపరు దూషణ
కకంపవారిధిగభీరుఁ డార్యుఁడు సైచున్॥

(తన్నుఁ జూచుకొని సశ్లాఘముగా)

ఉ॥ కాదు వచోధికశ్రమము; గాదు శిరఃపరిపీడనంబునుఁ;
గాదు మనోనుతాపమును; గాదు శరీరవిమర్దనంబు;హిం
సాదికభంగసంఘటన మైనను గాదొకనేను మాత్రమే
క్రోధవిపక్షు నాలమునఁ గూలుచుటం గడుశ్లాఘ్య నారయన్॥౧౬॥

ఇద్దఱు—(నడుచుచున్నారు)

ప్రతి—ఇదిగో! మహారాజుసమీపింపుము ప్రియసఖీ!

క్షమ—(సమీపించి) దేవా! జయముజయము, దేవరసేవకురాలు క్షమ సాష్టాంగనమస్కారము సేయుచున్నది,

రాజు—క్షమా! ఇటు గూరుచుండుము,

క్షమ—దేవరవారిదాసి నెందునిమిత్తము తలఁపుఁజేసితిరో యానతిండు స్వామీ!

రాజు—క్షమా! ఇపుడు పోడమినయీకయ్యంబునఁ జయ్యన నీవు దురాత్ముఁడయినక్రోధుని వధింపవలయును,

క్షమ—మహారాజ! దేవర యనుగ్రహంబున నేను మహామోహుని సహితము మట్టివేయుటకుఁ జాలుదానను! తదనుచరమాత్రుఁడగునీక్రోధుఁ డెంత, దేవా! నేను శీఘ్రముగానే-

క॥ ఆదోసకారిక్రోధుని,
వేదతపో యజ్ఞదేవ పితృహింస్రు, దృగు
త్పాదితవహ్నికణుం, దు
ర్గాదేవి మహిషునిఁ బోలె రణమునఁ గూల్తున్॥౧౭॥

రాజు—క్షమా! ఏదీ నీ క్రోధవిజయోపాయము విందము,

క్షమ—దేవా! విన్నవించెదఁ జిత్తగింపుఁడు,

ఉ॥ కొట్టినఁ బాపముల్ చెదరఁగొట్టుమహోత్సవ మంచుఁ బొంగుచుం,
దిట్టిన దీవనల్ వలికి, ద్వేషినిఁ దేర్చుచు సల్ల నవ్వుచున్,
“గట్ట! మనోరిబు గెల్వమిని గష్టము లీదురదృష్టజంతువుం
బట్టె” నటంచు,లోఁ గరఁగుపట్టునఁ గ్రోధున కెట్టు పుట్టువుల్॥౧౮॥

రాజు—ఓహోహో! బాగుబాగు!

క్షమ—దేవా! క్రోధుని గెలుచుటచేతనే హింసాపారుష్యమానమాత్సర్యాదులు గూడ,నవలీలగా జయింపఁబడఁగలవు.

రాజు—అటు లయినఁ బూజ్యురాలా! నీవు జయమునకుఁ బ్రయత్నింపుము.

క్షమ—దేవా! చిత్తము- (నిష్క్రమించుచున్నది)

రాజు—వేదవతీ! లోభుని గెలువ సంతోషునిఁ బిలువుము.

ప్రతి—చిత్తము దేవా! (నిష్క్రమించి సంతోషునితోఁ బ్రవేశించుచున్నది)

సంతో—(ఆలోచించి జాలిపడుచు) అయ్యో! పాపము!

చ॥ ప్రతివని నబ్బుఁ జెట్లుఁ దియ్యఁబండ్లు యథేప్సితమక్రమంబుగా;
నతిమధురంబు లిచ్చు శిశిరాంబువు లెల్లెడఁ బుణ్యవాహినుల్?
లతికల యందపుందలిరులం దను వాత్తనిమెత్త లేర్పడుఁ;
గుటిలముఁ గాంతు రేల కృపణుల్ ధనవంతులయిండ్ల పొంతలఁ?॥౧౯॥

(ఆకాశముఁ జూచి) ఓరోరిమూర్ఖలుబ్ధ! ఛీ! నీవ్యామోహము దురుచ్ఛేదముగదరా! ఓరిపశువా!

మ॥ ద్రవిణత్ష్ణుద్రమరీచికాబ్ధిజలముల్ డాయంగ నుంకించునీ
వివిధారంభము లెన్ని యెన్నితడవల్ విఘ్నంబులై పోవురా?
యవురా! యిప్పటికైన మాన దట నీ కత్యాశ; నీగుండెయల్
పవిఁతోఁ జేసిన వేమొ కాని,శతధా భగ్నంబులై పోవహో॥౨౦॥

ఓరికుమతీ! లోభాంధకారహతుఁడ వగునీచేష్టితములు మనసునకుఁ జమత్కారకరములురా!

ఉ॥ లభ్యము లబ్ధ మయ్యె నిది; లభ్యము గాఁగల దింక; దానిచే
లభ్యము, దాన లభ్య మని లబ్ధధనంబుఁ దలంచు చుందు; దు
స్సభ్య! యెఱుంగ వీమిష,వెస న్నిను లోభతమంబులోన,సా
లభ్యము దోఁపఁ బట్టి, సకలంబును నాసపిసాసి మ్రింగెడుఁ॥౨౧॥

మఱియును-

ఉ॥ అబ్బె నెటో ధనం బయిన, హానియొవెచ్చమొనీకు దానికిం
గొబ్బునఁ దెచ్చిపెట్టు నతిఘోరవియోగము; రూఢిసుమ్ము,సా
మ్మబ్బక యుంట మేలొ,మఱి యబ్బి నశించుట మేలొ చూడు మ
బ్బబ్బ! సహింప శక్య మగునా మహా లబ్ధవినాశఖేదముల్?॥౨౨॥

కాఁబట్టి—

శా॥ గంతుల్వేయును మిత్తి నెత్తి నెపుడుం; గట్టా! జరావ్యాళి నీ
పొంత న్మ్రింగను బొంచి యున్నది; సతీపుత్త్రాదిగృధ్రంబు ల్లిం
తింతల్ వ్రచ్చు జగంబు; లోభజ రజోహ్య ద్భేదపాథోధి నే
సంతోషామృత వార్ధిమజ్జన సుఖాస్వాదంబు గాంగనుహీ॥౨౩॥

ప్రతి—మహాత్మా! ఇదిగో! మహారాజును సమీపింపుము.

సంతో—జయము జయము మహారాజ! నేను సంతోషుఁడను, (మ్రొక్కుచున్నాఁడు),

రాజు—ఓయీ! ఇటు గూరుచుండుము (స్వసన్నిధిఁ గూర్చుండఁ బెట్టుకొనుచున్నాఁడు!)

సంతో—(సవినయముగాఁ గూర్చుండి) దేవా! దేవరపరిజనున కాజ్ఞయొసఁగుఁడు.

రాజు—ఓయి సంతోష! నీప్రభావము మే మెఱుఁగనిది కాదు. ఇఁక నిట నాలస్య మేమిటికి? లోభుని సంహరించుటకు నీవు వారణాసిం బ్రవేశింపుము.

సంతో—దేవా! చిత్తము. శీఘ్రముగానే నేను—

క॥ పలుమొగముల ముజ్జగములు
గెలిచి సురద్విజులఁ గట్టి కెడపి పెరుఁగుఁనీ
పలుగాకిలోభుఁ దునుముదు
నలవున దాశరథి రావణాసురుఁ బోలెన్॥ (నిష్క్రమించుచున్నాఁడు)

(తరువాత వినీతవేషుఁ డొకపురుషుఁడు ప్రవేశించుచున్నాఁడు).

పురు—జే మహాప్రభూ! విజయప్రయాణమంగళంబులు సర్వసంసిద్ధంబు లయి యున్నవి. మౌహూర్తికావేదితం బగు ప్రస్థానముహూర్తంబును సమీపించినది.

రాజు—ఓహో! అటు లయిన దండులఁ దరలింపుఁ డని పడవాళ్ల కాజ్ఞాపింపుము.

పురు—దేవా! చిత్తము. (నిష్క్రమించుచున్నాఁడు).

(తెరలో) మ॥ ఒనగూర్పం డురుకుంభభిత్తిమద మద్యోన్మత్త భృంగేభపం
క్తిని; బన్నింపుఁడు తేరులన్ జితమరుద్వేగోత్తురంగంబులన్;
ఘనకుంతంబులు నల్లగల్వకొలనిం గల్పింపఁగా రోదసిన్,
జనుఁడీ పాదగు లశ్వవారు లసిభాస్వత్పాణులై దూఁకుఁడీ॥

రాజు—సరే, మేమును గృతమంగళాచరణుల మయి బయలుదేఱుదుము. (పారిపార్శ్వకుని జూచి) ఓరీ! మా యుద్ధరథమును సన్నద్ధపఱిచి తెమ్మని సారథితోఁ జెప్పుము.

పారి—దేవా! చిత్తము. (నిష్క్రమించుచున్నాఁడు)

(తరువాత ముందుచెప్పినట్లు రథము తీసికొని సూతుఁడు ప్రవేశించుచున్నాఁడు).

సూతు—దేవా! ఇదిగో! దేవరయుద్ధరథము సజ్జీకృతం బయి యున్నది. ఆ

యుష్మంతులు దీని నారోహింతురుగాక.

రాజు—(కృతమంగళాచరణుఁడయి రథారోహణము నటించుచున్నాఁడు).

సూతు—(రథవేగమును నిరూపించి) దేవా! చూడుచూడు.

పంచచామరము॥ ధరారజో భరానుమేయ ధావనావధానవ
త్ఖురాగ్ర చుంబితోర్వ్య లౌచు ఘోటముల్ వహింప, మం
దరావనీధ రాదితేయదైత్యమథ్యమాన సా
గరారవంబుతో శతాంగకంబు నింగి నేగెడున్॥౮౮॥

ఆయుష్మంతుఁడా! ఇదిగోఁజూపుమేరదూరమునవారణాసి త్రిభువనపావని గానవచ్చుచున్నది.

మ॥ అవె ధారాజలయంత్ర సంస్ఖలితతోయ స్ఫారఝుంకారముల్
నవశీతాంశుద్యుతి భాసమానములు సాంద్రప్రాంశుసౌధాగ్రముల్
దవణెల్లం బయిఁ జిత్రకేతనము లాడన్, లోనఁ గ్రొమ్మించున
ట్టువ లొప్పారుశరత్సితాభ్రములనీటుల్ గీటునం బుచ్చుచున్॥౮౯॥

మఱియు నివిగోఁ బ్రతిముకులమునను దగులుకొని మొరయుమొకరితుమ్మెదకదుపులరొదలవలనను, బరువంపువిరు లరవిరిసెడు నవసరంబునఁ బట్టుచాలక తొనఁకి తొరఁగెడుమకరందరసపు ముసురువలనను, మసరుక విసి క్రికిఱిఁజిసినపసరాకుగుమురుల నీడ లొసఁగుతరువిసరమువలనను, నలువలఁకులఁ జిఱుతకఱువలులు గుమ్మరించెడుకమ్మ తావులవలనను, నగరపరిసరమున మనోహరము లగుచున్నయీయుద్యానవనభూభాగము లవలోకింపుము, దేవా! ఇచ్చటివాయువులు గూడ గృహీతపాశుపతవ్రతులగుతాపసులరూపునఁ జూపట్టుచున్నవి,

ఆ॥వె॥ మిన్నువాఁకనాని మెయిఁ బరాగముఁ బూని,
రాలుపూల నిందుమౌళిఁ బూజ
సలిపి, మధుపగానముల నుతించుచు, గాలు
లాడుఁ బ్రచలవల్లిహస్తములను॥౯౦॥

రాజు—(ఆనందముతోఁ జూచి)

శా॥ అంతర్దుస్తమ మూడ్చుచుం బగటు నిత్యాత్మప్రభానందమున్;
స్వాంతాకర్షిణి కాశి విద్యవలె మోక్షస్థాన మిందుం ధరా
కాంతా కంఠవిలంబి సత్కుటిలముక్తామాలికాశోభ నై
యెంతే జాహ్నవి నవ్వు నుర్వులను గంటే వక్రపుంగ్రొన్నెలన్॥౯౧॥

సూతు—(పరిక్రమించి) ఆయుష్మంతుఁడా! ఇదిగో నవ్వేలుపుటేటి తీరంబున

కలంకారభూతంబును, త్రిభువనపావనంబును నగువిశ్వేశ్వరాభిధాన త్రిజగద్గురు మహాదేవుని పుణ్యాయతనంబు నవలోకింపుము.

రాజు—(సంతోషముతో) ఓయీ!

క॥ క్షేత్రమహిమఁజూ డీవిభు
క్షేత్రాత్మ యటంచు మిగులఁ గీర్తింతు రిటన్
గాత్రమును దొఱఁగి భక్తులు
చిత్రముగా నితనిలో వసింతురు సుమ్మీ॥౩౨॥

సూతు—దేవా! ఇదిగోఁ గామక్రోధలోభాదులు మనలను జూచి నంతమాత్రముననే యిచ్చటనుండి దూరదూరముగాఁ బాఱి పోవుచున్నారు. చూడుచూడు.

రాజు—అవునవును. కానీ! ఈదేవాయతనంబునఁ బ్రవేశించి యభీష్టసిద్ధికొఱకు భగవంతునిఁ బ్రార్థింతము. (రథము దిగి గుడిలోని కరిగిచూచి) జయ జయ శ్రీవిశ్వేశ్వర ప్రసన్నో భవ.

తే॥గీ॥ సచ్చిదానందరూపాయ చంద్రఖండ
ధారిణే నేత్రభూత వేదత్రయాయ
ధీరనిశ్రేయసప్రాప్తి కారణాయ
మానిహృద్వాసినే నమస్తే నమోస్తు॥౩౧॥

సూతు—మహారాజ! త్రిభువనగురుండు ననాదిపురుషుండు నగుశ్రీమదాదికేశవస్వామియాలయం బిది యవలోకింపుము.

రాజు—అట్లయిన రా, (వెళ్లి యాదికేశవునకుఁ బ్రదక్షిణముఁ జేసి) జయతు జయతు భగవాన్!

దండకము॥ అమరచయచమూచక్ర చూడామణిశ్రేణి నీరాజితోపాంతపాదద్వయీయాంభోజ! రాజన్నఖద్యోతఖద్యోత కిమ్మీరితస్వర్ణపీఠా! స్ఫురద్దైవతవిభ్రాంతిసంతానసంతప్తవందారు సంసారనిద్రాపహారైకదక్షా! క్షమామండలోద్ధారసంభారసంఘట్ట దంష్ట్రాగ్రకోటి స్ఫురద్వైభవచక్రా! క్రమాక్రాంతలోకత్రయా! ప్రబలభుజబలోద్ధృత గోవర్ధనచ్ఛత్ర నిర్వారితాఖండలోద్యోజితాకాండచండాంబువాహాదివర్షత్రసద్గోకులత్రాణ విస్మాపితాశేషవిశ్వా! ప్రభూ! విబుధరిపువధూవర్గ సీమంతసిందూర సంధ్యాయమాఖచ్ఛటోన్మార్జనోద్దామధామాధిపా! త్రస్తదైత్యేంద్ర వక్షస్తటీ పాటనాకుంఠ భాస్వన్నఖశ్రేణి పాణిద్వయప్రస్త విస్తారరక్తార్ణ వామగ్నలో

కత్రయా! త్రిభువనరిపుకైటభోద్దండకంఠాస్థికూట స్ఫుటోన్మార్జితోద్దామచక్రస్ఫురజ్జ్యోతి రుల్లాసితోడ్డామరోద్దండదోర్దండ! ఖండేందుచూడప్రియా! ప్రౌఢదోర్దండవిభ్రాంతమంథాచలక్షుబ్ధదుగ్ధాంబుధి ప్రోత్థితశ్రీ భుజావల్లిసంశ్లేష సంక్రాంతపీనస్తనాభోగపత్రావళీ లాంఛితోరస్స్థలా! స్థూలముక్తాఫలోదార హారప్రభామండలప్రస్ఫురత్కంఠ! వైకుంఠ! నీభక్తుండౌ దేహికిఁ ఘోరసంసారమోహచ్ఛిదం బైనబోధోదయంబుం బ్రసాదింపవే దేవ! తుభ్యంనమో! దేవ తుభ్యం నమో దేవ! తుభ్యం నమః॥౩౨॥

(సాష్టాంగదండప్రణామం బాచరించి నిర్గమించుట నభినయించి చూచి) మేలుమే లిదియే మనకు నివాసోచితప్రదేశము. మన మిక్కడనే పాళెము దిగుదము. (నిష్క్రమించుచున్నారు).

గద్య॥ ఇది శ్రీపరమేశ్వరవరప్రసాదలబ్ధ సరసకవితాధురంధర వడ్డాదిసాధు వంశక్షీరనీరాకర రాకాసుధాకర రాచ్చనామాత్యపౌత్ర హారితసగోత్ర పవిత్రగుణకదంబలక్ష్మాంబా గర్భశుక్తిముక్తాఫల సూరపరాజప్రధానతనూభవ విబుధవిధేయ సుబ్బరాయ నామధేయాంధ్రీకృత శాంతరసాసారప్రబోధచంద్రోదయ నాటకంబునందు వివేకోద్యోగం బనుచతుర్థాంకము.

శ్రీ రస్తు.

శ్రీ పరమాత్మనే నమః.

ప్రబోధచంద్రోదయము.

పంచమాంకము.

(తరువాత శ్రద్ధ ప్రవేశించుచున్నది)

శ్రద్ధ—(ఆలోచించి) ఈమార్గము సుప్రసిద్ధమే గదా!

క॥ జ్ఞాతులవైరంబున సం
భూతం బగుక్రోధ మేర్చుఁ బో, కుల మెల్లన్,
వాతాహత తరుఘర్షణ
జాతానల మడవి గహనచయముం బోలెన్ ॥౧॥

ఔరా! సోదరవ్యసన సంజాతం బగునీదుర్వారదారుణశోకానలంబు వివేకజలధర శతంబులచేత నయినను జల్లారకున్నది!

చ॥ వననిధులున్, మహాద్రులును, వాహినులే నశియించు రూఢిగాఁ;
దునిఁగడు తుచ్ఛపుంద్రుణముతోఁ దులఁదూఁగెడుజంతు లెంతవారై
నను మితిమీఱి, బంధుజననాశమునం జనియించి, చెప్పరా
కనిశము శోకవహ్ని హృదయంబు దహించు వివేకమూర్తి నైన॥౨॥

అయ్యయ్యో! అంతలేసి క్రూరప్రకృతులు గలవా రయినను, దోఁబుట్టువు లయినందునఁ, గామక్రోధాదులు పేరుమాయుటచేత-

కం॥ ఆయములను అంపముతోఁ
గోయునటుల్, మనసు నగ్గిగుండములోనం
దోయునటుల్, మెయి శోషిలఁ
జేయునటుల్ శోకవహ్ని సెగపొఁగ రెగయున్॥౩॥

(ఆలోచించి) ఓహో! విష్ణుభక్తిదేవి నాతో "శ్రద్ధా! నే నీహింసాప్రాయ, మగుసాంపరాయమును జూడఁజాలను; కొన్నిదినంబు లీవారణాసిని విడిచి, సాలగ్రామాభిధానంబునం బ్రసిద్ధం బగువిష్ణుక్షేత్రంబునఁ గాలక్షేపంబు జేసెదను- నీ వచ్చటికి వచ్చి, జరిగినది జరిగి నట్లుగా సర్వవృత్తాంతమును

నాకు నివేదింపుము'' అని యాన తిచ్చినది కాఁబట్టి, నే నమ్మహానుభావు రాలి సన్నిధానమునకుఁ బోయి, సమరవృత్తాంత మంతయు నామెకు విన్నవింపవలయును- (నడచిచూచి) ఇదిగోఁ చక్రతీర్థము- సంసార సాగరోత్తారతరణి కర్ణధారుం డగుశ్రీమన్నారాయణుండు స్వయముగా వేంచేసియున్న దిచ్చోటనే గదా! (నమస్కరించి) ఇదిగో! మహాతపస్విలచే నుపాస్యమాన యగుచు భగవతి విష్ణుభక్తిదేవి, శాంతితో నేమో మంత్రాలోచనము సేయుచున్నది- నేను దగ్గఱకుఁ బోయెదను (నడచుచున్నది)

(తరువాత విష్ణుభక్తియు శాంతియుఁ బ్రవేశించుచున్నారు)

శాంతి— దేవీ! నీ వేమో గాని దురంతచింతా సమాక్రాంత స్వాంతవు గాఁ దోఁచుచున్నావు-

విష్ణు— కుమారీ! మహావీరవార క్షయకారణం బగునీ ప్రవిచారణంబున నవారణబలోత్సాహుం డగుమహామోహుండు మోహరింపఁ, గుఱ్ఱవానికి వివేకునకు నేమిపాటు పాటిల్లెనో యని నాహృదయము చెయివెట్టి కలఁచిన ట్లున్నది.

శాంతి— అమ్మా! నీ కీవిషయంబున విచార మేటికి? దేవి కాయనయందు మహానుగ్రహము గనుకఁ దప్పక వివేకమహారాజునకు విజయమే గలుగు నని నే ననుకొనుచున్నాను.

విష్ణు— కుమారీ!

క॥ న్యాయపథంబున వా రని
ప్రాయికముగ నిశ్చయింపఁబడు నభ్యుదయం
బే; యయినను సుహృదులమది
కేమెడలను మిగులఁ గీడు లే స్ఫురియించున్॥౪॥

విశేషించి మనశ్రద్ధ యింతతడవు రాక మసలుటంజేసి నామనసునకు సంశయము పొడముచున్నది-

శ్రద్ధ— (సమీపించి) భగవతీ! నమస్కరించుచున్నాను- (మ్రొక్కుచున్నది)

విష్ణు— శ్రద్ధా! స్వాగత మా?

శ్రద్ధ— దేవీ! నీ యనుగ్రహమున-

శాంతి— అమ్మా! నమస్కరించుచున్నాను- (శ్రద్ధకు మ్రొక్కుచున్నది)

శ్రద్ధ— కుమారీ! నన్నుఁ గౌఁగిలించుకో-

శాంతి— (అట్లు చేయుచున్నది)

శ్రద్ధ— కుమారీ! నీవు విష్ణుభక్తిదేవిప్రసాదంబున సుఖముగా మునిజన మన

పదంబును బొంది యుండును.

విష్ణు—శ్రద్ధా! మఱి యక్కడ నేమి జరిగినది?

శ్రద్ధ—అమ్మా! దేవియెడలఁ బ్రతికూలముగా నడచువారికిఁ దగి నట్లు.

విష్ణు—ఏదీ యది సవిస్తరముగాఁ దెలుపుము.

శ్రద్ధ—దేవీ! ఆలకింపుము. భగవతి యట్లు లాదికేశ వాయతనంబును విడిచి
వచ్చినతోడనే వేఁడివెలుఁ గించుక పాటలత్వంబు వాసినపిమ్మట, విజయుని
స్సాణఘోషణాహూయమా నానేకవీరవర బహుళసింహనాద బధిరి
త హరి దంతరంబును, సతత రథతురగ ఖరతరఖుర ఖండితభూమం
డలోచ్చలద్విపులరజఃపట లాంతరితసహస్రకిరణంబును, ప్రబలతరకర్ణ
తా ళాస్ఫాల నోచ్చల త్సమదకరికుంభసిందూర సంధ్యాయమానదశ
దిశంబును, ప్రళయజలధర ధ్వానభీషణంబును గా నుభయసైన్యసాగ
రంబు సన్నద్ధం బగుటయు, మనవివేకమహారాజు నైయాయికదర్శనునిచే
త మహామోహునకు రాయబార మంపినాఁడు. అంత నారాయబారి
యు నవ్వైరితో—

శా॥ ప్రో, విష్ణ్వాలయముల్, సరిత్తటములుఙ్, బుణ్యాటవుల్, పుణ్యాశ్ర
చ్ఛావంబుల్ పెడఁబాసి మ్లేచ్ఛభువికిన్ దవ్వ్యేసతోఁ; గానిచో
భాషిం బె ల్లగు ఖడ్గధారితభవత్ప్రత్యంగ రక్తాధిక
సారాస్వాదవిదీర్ణవక్త్రబిలనిర్యత్ఫేరవారావముల్॥౫॥

అని వాక్రుచ్చినాఁడు.

విష్ణు—తరువాత?

శ్రద్ధ—దేవీ! అటుమీఁదట నహ్మాటకుఁ జిటిలిపడి, వికట నిటలతటఘటిత కు
టిలభ్రుకుటి యగుచుఁ, గ్రోధాతిరేకంబున మహామోహుం డతని కిట్లని
యె. ఔరా కావరము! వివేకహతకుఁడు తన దుర్నయపరిపాకమునకు
ఫలము ననుభవించును గాక. అని పలికి వాఁడు, పాషండాగమసమూ
హంబును పాషండశాస్త్ర సంచయంబుతోఁ దోలుదోలుతఁ బోరితంబున
కాయితంబుఁ జేసి పంపెను. అంతలోనే మన సేనాముఖంబునందు—

క॥ వేదము లుపవేదంబులు,
వేదాంగ పురాణములును, వెస, స్మృతు లితిహా
సాదులుఁ దోడుగ, శారద
ప్రాదుర్భవ మొందెఁ గమలపాణి శశిరుచిన్॥౬॥

విష్ణు—తరువాత?

శ్రద్ధ—అనంతర మోదేవీ! వైష్ణవశైవసౌరాది సకలాగమసమూహంబును దచ్ఛారదాదేవి సమక్షమున సాక్షాత్కరించెను.

విష్ణు—తరువాత?

శ్రద్ధ—దేవీ! అప్పుడు—

మ॥ బలవత్సాంఖ్య కణాదగౌతమవచో భాష్యాది సచ్ఛాస్త్ర సం
కుల మైయొఁ న్యాయసహస్రబాహువుల దిక్కుల్ శోభిల్లన్, ధర్మని
ర్మలచంద్రాస్య, త్రయీత్రినేత్ర,రణదర్పం బొప్ప మీమాంస,వా
గ్లలనాసన్నిధిఁ దోఁచెఁ దా నపర యాకాత్యాయనీ దేవినాన్ ॥

శాంతి—అమ్మా! పరస్పరవిరోధు లగునీయాగమ సమూహములకును దర్క సంచయంబునకును నైకమత్యం బెట్లుపొసఁగినది?

శ్రద్ధ—పుత్రీ! వినుము.

క॥ సమగోత్రభవులు తమలోఁ
దమకు విరోధంబు లున్న, దాయలచే నా
ప్పమి పుట్టువేళ, నలుగురు
గుమి గూడి యెదిర్చి,గెలుపు గొందురు కడిమిన్॥౮॥

కావున వేదప్రసూతము లగునీశాస్త్రముల కవాంతరవిరోధ మేదేని సంభవించినను, వేదసంరక్షణార్థంబును,నాస్తికపక్ష ప్రతిక్షేపార్థంబును, వానికి నైకమత్యమే సంఘటిల్లును. తత్త్వవిచారు లాగమములకు నవిరోధమే చూచు చుందురు.

ఉ॥ శాంత మనంత మద్వయ మజం బగు తేజము,ధాతచక్రి కా
మాంతకుడంచు, నయ్యయి గుణాధికతన్ బహుధా నుతింతు ర
త్యంతము, భిన్నమార్గపు సదాగమముల్ శ్రుతిముఖ్యముల్ జగ
త్కాంతునె చెందు, నీటివఱదల్ పలుదారుల వారిధింబలెన్॥౯॥

విష్ణు—తరువాతఁదరువాత?

శ్రద్ధ—తరువాత నోదేవీ! కరితురగ రథపదాతి బహుళంబు లగుమనబలంబులకును, బరబలంబులకును, నిరంతరశరనికర ధారాసంపాతోపదర్శిత దుర్దినంబుగాఁ దుములసమరంబు జరుగుటయు నయ్యవసరంబున—

క॥ పలపంకిలములుఁ, గంకా
కులములు, శరదళిత మత్తకుంజర శైల
స్ఖలితరయంబులు, ఛత్త్రో
జ్జ్వలహంసము లగుచు నెత్తురువఱదలు వాఱెన్॥౧౦॥

అమ్మహాదారుణ ప్రవిదారణంబునఁ బరాపరపక్ష విరోధంబునం జేసి పాషండాగమంబులచే నగ్రేసరీకృతం బగులోకాయతిక తంత్రం బన్యోన్య సైన్య సంఘట్టనంబునం జేసి వినాశంబు నొందినది. పదపడి పాషండాగమంబులు మూలశూన్యంబు లగుటం జేసి సదాగమ మార్గప్రవాహంబునం బర్యస్తంబు లయ్యె. సౌగతులును, సింధుగాంధార మగ ధాంగ పారసీక వంగకళింగాద్యు లగుమ్లేచ్ఛప్రాయజనపదంబులం బోయిచొచ్చిరి. పాషండ దిగంబర కాపాలి కాదులు పామరబహుళంబు లగుపాంచాల మాళవాభీ రావర్త సాగ రానూపంబుల నిగూఢంబుగా నున్నవారు. న్యాయా ద్యనుగత యగుమీమాంసచేత గాఢప్రహార జర్జరీకృతంబు లయి నాస్తికతర్కంబులు తమయాగమంబులనే యనుసరించి పోయినవి.

విష్ణు—తరువాత?

శ్రద్ధ—తరువాత నో దేవీ! వస్తువిచారునిచేతఁ గాముండు నిహతుం డయ్యె. క్షమచేతఁ గ్రోధ పారుష్య హింసాదులు నేలఁ గూలిరి-లోభ తృష్ణా దైన్యానృతవాద పైశున్య స్తేయ పరిగ్రహులు సంతోషునిచేత నంతంబు నొందిరి. అనసూయ మాత్సర్యుని మచ్చుమాపె. పరోత్కర్ష సంభావన, మదుని సదమదంబు గావించె. పరగుణాధిక్యునిచేత మానుండు గతప్రాణుం డయ్యె.

విష్ణు—(హర్షముతో) మేలుమేలు. బాగుగ జరిగినది. శ్రద్ధా! మఱి మహామోహునివృత్తాంత మెట్లు?

శ్రద్ధ—దేవీ! యాదురాత్ముఁడు యోగోపసర్గులతోఁ గూడ నెక్కడనో యడఁగి, తెలియఁబడక యున్నవాఁడు.

విష్ణు—ఓహో! అటు లయిన ననర్థశేషము గొప్పదే యున్నది. వాఁడు ముఖ్యముగాఁ బరిహరణీయుఁడు గదా!

క॥ మెలఁకువపడి విద్వాంసుఁడు
నిలువర మగుసిరిని గోర నేనియుఁ దీవ్రా
నల శేషము, ఋణ శేషము,
నిల రిపుశేషంబు మిగుల నీకుండవలెఁ॥౧౧॥

సరేగాని మఱి మనస్సువృత్తాంత మెట్లు?

శ్రద్ధ—దేవీ! పుత్రపౌత్రాది వ్యసనజనిత శోకావేగంబున నతఁడును బ్రాణత్యాగంబు సేయఁ బ్రయత్నించెను.

విష్ణు—(చిఱునవ్వునవ్వి)అతఁ డాలాగు చేసినపక్షమున మన మందఱముఁ గృతకృత్యులమే యగుదుము. పురుషుఁడును బరమానందమునకుఁ బాత్రుఁడగును. ఇంతకు నాదురాత్మునకు జీవత్యాగ మెక్కడ?

శ్రద్ధ—దేవీ! నీవిట్లు ప్రబోధోదయార్థము కంకణము గట్టుకొని యుండ నతఁ డింక నెట్లు శీఘ్రముగా శరీరము విడువ కుండఁగలఁడు?

విష్ణు—కానీ? వానికి వైరాగ్యోత్పత్తికొఱకు సరస్వతిని వైయ్యాసికిం బంపుదము.

(నిష్క్రమించుచున్నారు- ప్రవేశము)

(తరువాత మనస్సును సంకల్పుఁడును బ్రవేశించుచున్నారు)

మన—(కన్నీళ్లతో) హా! పుత్రులారా! ఎక్కడఁబోతిరి? నాకొడుకులారా! పలుకరేమి? ఓహోబిడ్డలార! రాగ ద్వేష మద మాన మాత్సర్యాదులార! నాతండ్రులారా! చేరవచ్చి నన్నుఁ గౌగిలించుకొనుఁడు. అయ్యో! నాయవయవములు విడిపోవుచున్నవి. ఆహా! వృద్ధుఁడ నయి, యనాథుఁడ నయిననన్ను నొక్కఁడును జూడరాఁ డయ్యెను గదా! ఓహో! అసూయాదు లయినకూఁతులార! రతిహింసా తృష్ణాదు లయినకోడండ్రార! మీ రందఱు నెందుఁబోతిరే? అయ్యో! మందభాగ్యుఁడ నగునా యీకుమారికలు గూడ నేకకాలముననే, దైవహతకునిచేత నపహృత లయి పోయిరి గదా! (దుఃఖముతో)-

మ॥ విరియంబాఱు విషాగ్నియట్లు; తనువు న్వేధించు; శోకజ్వరం
బెరియించున్ సుఖమర్మముల్; మతిమతిన్ హెచ్చించు నావేదనల్;
హరియించున్ మదిలో వివేకము;మహావ్యామోహ మొందించు;ము
ష్కరతన్ మామకజీవితం బిది బలాత్కారంబు గ్రమింగుం గటా॥

(మూర్ఛిల్లుచున్నాఁడు).

సంకల్పు—రాజా! ఊఱడిల్లు మూఱడిల్లుము.

మన—(ఊఱడిల్లి) అయ్యో! ఏమిది? ఇటువంటిదురవస్థలో నున్ననన్నుఁ బ్రవృత్తిదేవి యయినను నూఱడింప కున్నది!

సం—(కన్నీళ్ళతో) దేవా! ఇంకను నీదేవి ప్రవృత్తి యెక్కడ? ఆమె స్వకుటుంబవ్యసనము విని, శోకానలంబున దగ్ధహృదయ యయి, గుండెయ లవిసి సమసిపోయిన దఁట.

మన—హా! ప్రియురాలా! ఎందుఁబోతివే? పలుక వేమి?

మ॥ కలనైనం బ్రియురాల! నేను వెలిగాఁ గాఁగావింప వేఁక్రీడలన్;
లలనా! నీవు వినాగ నే మృగమునీలిం దోఁచెదన్ నిద్దురన్;
బాలఁతీయోగతి దైవదుర్విలసితంబుల్ ని న్నెడంబాపినన్,
నిలుచున్ జీవముతో మనం బసువు లెంతేనిం దురంతంబులోఁగదే॥

(మరల మూర్ఛిల్లుచున్నాఁడు)

సంక—రాజా! ఊఱడిల్లు మూఱడిల్లుము.

మన—(ఊఱడిల్లి)ఇంక నా కీజీవితముతో నేమి ప్రయోజనము? సంకల్పా!చితిని పేర్పుము. నే ననలప్రవేశమున శోకానలంబును జల్లార్చుకొనెదను.

(సిద్ధపడుచున్నాఁడు)

తరువాత వ్యాససరస్వతి ప్రవేశించుచున్నది)

సర—భగవతి విష్ణుభక్తి నన్నుఁ బంపుచు "సఖీ! సరస్వతీ! అపత్యవ్యసనఖిన్నుఁడయినమనస్సును నీవు ప్రబోధించి యతనికి వైరాగ్యోత్పత్తి యగునట్లు సర్వథా ప్రయత్నింపుము" అని యాన తిచ్చినది గావున, నే నిప్పుడతనిని సమీపించెదను. (సమీపించి) వత్సా! నీ విట్లు మిక్కిలి వికలుఁడవుచున్నా వేమి? పదార్థంబు లనిత్యంబు లగుట నీ వెఱుంగినదే గదా! ఇతిహాసి కోపాఖ్యానంబు లనేకంబు లధిగమించితివి. చూడు—

మ॥ చనరే కల్పశతాయుషుల్ గలిగి స్రష్టల్, శక్రదేవాసురుల్,
మనుముఖ్యుల్, మునులున్, మహీజలనిధుల్, బలోత్కటులింక నేటికిన్?
వనధిప్రోద్భవ బుద్బుదాయితము లో పంచాత్మకంబుల్ గదా
తనువుల్; పంచతఁబొంద, వీని కడలం దగ్నుంజె? మోహమ్ము బహో॥

వత్సా! యిది తెలిసి నీవు భావంబులయనిత్యత్వము సంస్మరింపుము. నిత్యానిత్య వస్తుదర్శి యగువానిని శోకావేగ మంటనేరదు.

తే॥గీ॥ బ్రహ్మ మొక్కండె బుధ మితరము వికల్పి
తమ్మను మ్మేకతను జూచు తత్త్వవిదున
కెవ్విధంబున మోహంబు నివ్వటిల్లు?
నేకతంబునఁ బైకొను శోకవికృతి?॥౫౫॥

మన—భగవతీ! శోకావేగదూషితం బగునామనంబున వివేకమున కవకాశమే లేకయున్నది.

సర—కుమార! ఇది స్నేహదోషము. స్నేహమే సర్వానర్థప్రభవ మను సుప్రసిద్ధమే గదా! చూడు—

మ॥ ప్రియనామ వ్యసనంబు లన్విషలతాబీజంబు లాత్మ న్నరుల్
వయివఁ, వైశమ యందు స్నేహమయముల్ వజ్రాగ్నిగ ర్భాంకు రో
చ్చయముల్ గల్గి, కుకూలపావకము నోజఁ దేహదాహంబుత
ద్దయుఁ గావించెడుదీపి కాయుతశి ఖాంతక్లేశ వృక్షంబు లౌ॥౧౬॥

మన—అమ్మా! అది నిజమే-అయినను శో కానలదందహ్యమానంబు లగునా ప్రాణంబులను క్షణంబును భరింపఁ జాల కున్నాను. దేవీ! అంత్యకాలమున నీదర్శనము సేయఁగలిగినది, ఇది మ హాదృష్టము గదా!

సర—వత్సా! నీ వాత్మహత్య కుద్యమించుచున్నావు. ఇది కేవల మకృత్యము సుమీ. అది య ట్లుండె. నీ కత్యం తాపకారు లయినవారల విషయమ్మున నిమ్మోయి నీవు మ్మలించెద వేల? చూడు-

ఉ॥ మే లిపు డింత గద్దొ? యిఁక మీఁదటఁ గల్గునొ? వెన్కఁ గల్గెనో?
యాలును, బిడ్డ లెందు నను ఖార్థమ, యేరికి నీకె కా దయో!
ప్రీబుతు రాయముల్ విరహవేళఁ దదర్థ మపార్థకంబు గాఁ
బా లయి బాధ లన్నిటికిఁ, బ్రాణులు మిక్కిలి దుఃఖ మొందెదుర్॥౧౭॥

మఱియు-

మ॥ జలపూర్ణల్ తరియింప వెన్నినదు లేశైలంబులం దాఁట వ
త్యలఘు క్రూర విహార ఘోరవను లాహా! యెన్నిలంఘింప వీ
ముబుచల్ ని న్నలిపింప రేమిదురితమ్ముల్? సౌమ్యమత్తామసిఁ
గలుషమ్లానత రాస్యు లౌకునృపులఁ గాసిల్లి దర్శింపవే॥౧౮॥

మన—అక్షను సత్యమే గాని-

క॥ తనవలనఁ గలిగి, లాలన-
మున హృదిఁ జరియించువారు పొలియుట, యనుభే
దనసదృశము; మర్మచ్ఛే
దనమునకన్నను నరుంతుదమ్మ గదమ్మా॥౧౯॥

సర—కుమారా! ఈవ్యామోహము మమత్వవాసనా నిబంధనము సుమీ.

క॥ తమకోడిని మార్జాలము
నమలిన నద్దాన నగుమనస్తాపము, త
న్మమతాశూన్యపుఁ గలవిం
కము నెడ, మూషికము నెడలఁ, గలదే? చెపుమా॥౨౦॥

కావున నోకుమారా! సర్వానర్థబీజం బగుమమత్వంబు నున్మూలింప నవే

శ్యముఁ బ్రయత్నింపవలయును. చూడు—

ఉ॥ కీటము లెన్నియేనిఁ బరికింపు శరీరమునందుఁ బుట్టవో?
మాటికి వానియత్నమున భ్రమం దగఁ జేసినయట్ వెలార్పరో?
యేటివిమోహ మట్టులె మెయిం జనియించినకీటకోటికిన్,
మేటియపత్యసంజ్ఞ యిడి, మేనులు గాసిలఁ జేసికొం డ్రయో॥౧౧॥

మన—దేవీ! నీ వన్నది యథార్థమే గాని యామమత్వగ్రంథి దురుచ్ఛేదము గదా! భగవతీ! చిత్తగించి యీవిన్నప మవధరింపుము.

క॥ నిరతాభ్యాస దృఢీకృత
పరమస్నేహాఖ్యసూత్ర పరిగుంఫిత మ
ద్గురుమమతా పాశమునకు
వెరవెఱుఁగుదె తల్లి! యెట్లు విడుగర యగునో?॥౧౨॥

సర—కుమారా! పదార్థములయెడ ననిత్యతాభావనమే, మమతోచ్ఛేదమునకుం బ్రబల మోపాయము, విను.

చ॥ పితృ పితృసోదరానుజులుఁ, బెండ్లము బిడ్డలునుం, బితామహుల్,
వితత మహాభవాబ్ధిఁ బడి, వేలును లక్షలుఁ గోటు లేగరో?
హితులతటిత్ప్రభాపతన హింస్రము తౌత్క్షణసంగమంబులన్,
మతి నటులే దలంచుచును మాటికి, ధన్యుఁడ వై సుఖింపుమా॥౧౩॥

మన—అమ్మా! భగవతీ! నీప్రసాదమువలన నావ్యామోహము తొలఁగిపోయినది గాని—

తే॥గీ॥ తల్లిరో! నీదు మోముజాబిల్లి కళల
వలనఁ దొనఁకెడునుపదేశవాక్సుధార
సమునఁ బ్రక్షాళితం బయ్యె, నమితశోక
వీచికల, వెండి డెంద మావిలతఁ జెందు॥౧౪॥

కావున నాయుమ్మలింపుఁ బచ్చిగాయముల కమోఘౌషధము నానతిమ్ము భగవతీ!

సర—కుమార! అది మును లిదివఱకే తెలిపి యున్నారు. విను—

తే॥గీ॥ అప్రదరపాత జాతంబు లార్ద్రములును,
మర్మభేదకములు నయి మాన కుండు
గాఢశోకప్రహార సంఘాతములకుఁ,
దలఁచుకో కుంటయే యెందుఁ దగినమందు॥౧౫॥

మన—అమ్మా! అది నిజమే గాని మనస్సు మరలింప రానిది సుమీ!

క॥ మరలింపఁబడియుఁ జింతా
పరంపరలచేత మనసు పరిభూతంబౌఁ
బరిపరిగతులను, మారుత
పరిధూతాభ్రములఁ గుముదబంధుఁడు వోలెన్॥౬౯॥

సర—వత్సా! విను మది చేతోవికారము. దాని నందుండి మరల్చి యొండొక శాంతవిషయమునం బ్రవేశపెట్ట వలయును.

మన—ఆశాంతవిషయ మేదో యనుగ్రహించి యాన తిమ్మా భగవతీ!

సర—నాయనా! యది పరమరహస్యము గదా! కానీ. ఆర్తుల కుపదేశించిన నేమిదోషము? విను—

చ॥ తొలుకరిమబ్బుతోడఁ దులఁదూఁగుశరీరమువాని శౌరినో,
లలితకళానిధిం బులికళాసముఁ దాలుచువాని శూలినో,
తలఁచుచు నెప్డు, జల్లనిహ్రదంబు నిదాఘమునందుఁ బోలెఁ, గే
వలము నిరస్తశోక మగుబ్రహ్మముఁ జేరి భజింపు నిర్వృతిన్॥౭౦॥

(ఆలోచించి నిట్టూర్పుతో) తల్లీ! సర్వథా నీవు నన్ను రక్షించితివి. (పాదములమీఁదఁ బడుచున్నాఁడు)

సర—కుమారా! నీహృదయ మిప్పు డుపదేశసహిష్ణువుగా నున్నది; కాఁబట్టి యిది గూడ నీ కుపదేశించుచున్నాను- విను.

శా॥ నెయ్యం బొందెను, దండ్రి యొండెఁ, గొడుకొండెన్, మృత్యువుం బొందినన్,
వ్రయ్యన్ బొమ్మలు మోదుకొంచు, విలపింపం జొత్తు రజ్ఞుల్ కడున్;
ఖ్యాంబుంబరికామతిక్త మగునిస్సారంపుసంసారమం
దొయ్యన్ వేత్తకు శాంతి వెంచి, విరహం బొందించు వైరాగ్యమున్॥

(తరువాత వైరాగ్యుఁడు ప్రవేశించుచున్నాఁడు)

వైరా—(ఆలోచించి)

మ॥ అరయం ధాతృఁడు నీలనీరజదళోపాంతాతిసూక్ష్మత్వగా
వరణక్రవ్యముగాఁ గళేబర మొనర్పం డేనిఁ బ్రత్యంగని
స్సరదస్రౌఘవిమిశ్రమాంసకబళాశం బైపయి న్మూఁగుస
త్వరదక్షయ్యవృకాత్మఘోషముల నెవ్వం డెవ్విధిం దోలునన్॥

మఱియు నెల్లప్పుడు—

పంచమాంకము.

తే॥గీ॥ శ్రీలు డోలావిలోలంబు లింద్రియరసంబు
లంతవిరసంబు లాపద కనువు తనువు;
లోక మతిశోకము; సతి గిడులకు వసతి;
యైన నీబాములనె గాని యాత్మఁ గనరు॥ ౩౦॥

సర—వత్సా! ఇదిగో! వైరాగ్యుఁడు నిన్నుఁ జేర వచ్చినవాఁడు- వీనిని సం
భావింపుము.

మన—పుత్రా! వైరాగ్య! నీ వెక్కడ నున్నావు?

వైరా—(సమీపించి) తండ్రీ! నేను నమస్కరించుచున్నాను.

మన—పుత్రా! పుట్టినప్పుడే నీచేత విడువఁబడితిని గదా! నన్నుఁ గౌఁగి
లించుకో.

వైరా—(అట్లు చేయుచున్నాఁడు)

మన—నాయనా! నిన్నుఁ జూడఁగానే నాదుఃఖ మెల్లఁ దీఱినది.

వైరా—తండ్రీ! నీ కట దుఃఖమున కవకాశ మెక్కడ?

చ॥ తెరువున బాటసారులగతిన్, నదిఁ గూలినచెట్లభంగిఁ, బు
ష్కరమున మబ్బులుం బలెను, గంధిని బోతవణిక్కు లట్లు, సో
దరులును, దల్లిదండ్రులు, సుతప్రియబంధులుఁ, గూడి పాయుచుం
దురు; విరహంబు సిద్ధ మని తోఁచినతజ్జ్ఞుల కేటిదుఃఖముల్?॥ ౩౧॥

మన—(ఆనందముతో) దేవీ! వైరాగ్యుఁడు చెప్పిన దంతయు యథార్థమే- చూడు

ఉ॥ ఆమెలజవ్వనంబు గలయంగనలే; మగతేఁటిపాటలం
బాయనియానగాలె; విరిమల్లెలతావుల నాలిగాలులో
యాయవె; నైన నిత్తఱి, నుదాత్తవివేక నిరస్తదుస్తమో
మాయత, నెండమావులకు మాదిరి నామది కాసమస్తముల్॥ ౩౨॥

సర—కుమారా! సరే గాని గృహస్థునకు ముహూర్తం బయిన నాశ్రమముఁ
బెడసి యుండరాదు? కాఁబట్టి యిది మొదలుగా, నివృత్తి నీకు సహధర్మ
చారిణి కాఁగలదు.

మన—(సిగ్గుతో) దేవీ! చిత్తము.

సర—వత్సా! శమదమసంతోషాదు లయినపుత్రులు నీ కుపచారము సల్పు
చుందురు. యమ నియ మాదులు నీ కమాత్యు లగుదురు. నీయనుగ్రహము

న వివేకుఁ డుపనిషద్దేవితోఁ గూడ యావద్రాజ్యసుఖ మనుభవించెడును. ఇదిగో! మైత్రీప్రీతికరుణాముదిత లనువీరు నలుగురు సకల సైన్యేంద్రుఁ, విష్ణుభక్తిదేవి ని న్నాదరించుటకు వీరిని బంచినది. సాదరముగా వీరి నామోదపఱుపుము.

మన—అమ్మా! చిత్తము. నీయాజ్ఞ లన్నియు, నేను శిరసావహించుకొన్నాను. (సంతోషముతోఁ బాదములకు మ్రొక్కుచున్నాఁడు).

సర—కుమారా! ఈయమనియమాసన ప్రాణాయామాదులను నీవు సాదరముగా నవలోకింపుము. వీరితోడనే నీవు సామ్రాజ్యము నొందెదవు. నీవు స్వస్థతను బొందితివేని, క్షేత్రజ్ఞుఁడును స్వకీయప్రకృతిని బొందఁగలఁడు. చూడు—

చ॥ జననలయాదిభిన్నుఁ డయి శాశ్వతుఁ డద్వయుఁ డభ్రివిచులం
దినుగతి నీదుసంగతి ననేకతఁ దోఁచును బుద్ధివృత్తులన్;
మనస! యసంఖ్యవృత్తులను మానుక నీ విఁక మిన్న కున్న, మా
యనిముకురంబునందు రవియట్లు నిజాకృతి నాత్మ భాసిలున్॥33॥

కానీ జ్ఞాతుల కుదకదానము చేయుటకయి మన మిఁక నదీతీరమునకుఁ బోవుదము.

మన—అమ్మా! చిత్తము.

(అందఱు నిష్క్రమించుచున్నారు).

ఇది శ్రీపరమేశ్వరవరప్రసాదలబ్ధ సరసకవితాధురంధర వడ్డాదిసాధువంశక్షీరనీరాకర రాకాసుధాకర రాచ్చనామాత్యపౌత్ర హరితసగోత్ర పవిత్రగుణకదంబ లక్ష్మాంబా గర్భశుక్తిముక్తాఫల సూరపర్వాజప్రధానతనూభవ విబుధవిధేయ సుబ్బరాయనామధేయాంధ్రీకృత శాంతరసాసార ప్రబోధచంద్రోదయనాటకంబునందు వైరాగ్యప్రాదుర్భావం బనుపంచమాంకము.

—:0:—

శ్రీ ర స్తు.

శ్రీ పరమాత్మనేనమః.

ప్రబోధచంద్రోదయము.

షష్ఠాంకము.

(తరువాత శాంతి ప్రవేశించుచున్నది)

శాంతి—వివేకమహారాజు నాతో "శాంతీ! ఇది నీ వెఱింగినసంగతియే.

మ॥ పొడ సూపట్టక మోహుఁ డెందొ యొదుఁగన్, బుత్రుల్ నశింపంగఁ,
జేడ్పడి వైరాగ్యునిఁ జేరఁ దీసి, మన సీపట్లం బ్రశాంతత్వముం
బడయన్, గ్లేశము లైదు నొక్క-మొగిఁ బోవం,బూరుషస్వామి సం
దడి లే కివ్యోడ నిచ్చగించు నెచటం దత్త్వావబోధార్థ మై॥౧॥

కాఁబట్టి నీ వుపనిషద్దేవి నతిత్వరిత ముగా ననునయించి నాచెంగటికిం గొ
నితెమ్ము" అని యాన తిచ్చెను. (చూచి) ఓహో! ఇదిగో! మాయమ్మ హ
ర్షముతో నేమో యాలోచించుచు నీలాగు వచ్చుచున్నది.

(తరువాత శ్రద్ధ ప్రవేశించుచున్నది)

శ్రద్ధ—ఓహో! ఆరోగ్యము గలరాజకులమును జూచినందువలనఁ బెద్దకాల
మునకు నాకన్ను లమృతసేచనంబునం బోలెఁ జల్ల నయినవి.

తే॥గీ॥ శతులు మోహాదులకుఁ దగ్గశాస్తి యయ్యెఁ;
బూజ్యు లైనారు శమదమముఖ్యసుకృతు
లహహ! జగదీశ్వరుండు వశ్యానుజీవి
వర్గసంసేవితుం డయి వన్నె మీఱె॥౨॥

శాంతి—(సమీపించి) అమ్మా! నీ వేమో యాలోచించుచు నెక్క-డికో వెళ్ళు
చున్నదానవు?

శ్రద్ధ—కుమారీ! ఆరోగ్యము గలరాజకులమును జూచినందువలనఁ బెద్ద
కాలమునకు నాకన్ను లమృతసేచనంబునంబోలెఁ జల్ల నయినవి.

తే॥గీ॥ శతులు మోహాదులకుఁ దగ్గశాస్తి యయ్యెఁ

బూజ్యు లయినారు శమదమముఖ్యసుకృతు
లహహా! జగదీశ్వరుండు వశ్యానుజీవి
వర్గసంసేవితుం డయి వన్నె మీఱె॥

శాంతి—అమ్మా! ఆలాగయిన జీవస్వామికి నిప్పుడు మనస్సునందితాత్పర్య మేలా గున్నది?

శ్రద్ధ—వధ్యునిమీఁదను నిగ్రాహ్యునిమీఁదను నుండవలసినలా గున్నది.

శాంతి—అమ్మా! అట్లయిన స్వామియే సామ్రాజ్య మలంకరించునా?

శ్రద్ధ—బిడ్డా! అందుకు సందేహ మేమి? ఆత్మానుసంధానముఁ జేసికొనిన, స్వామియే స్వారాట్టును సమ్రాట్టును గూడఁ గాఁగలఁడు.

శాంతి—అమ్మా! సరి గాని మాయయం దాయనయను గ్రహ మిప్పు డేలా గున్నది?

శ్రద్ధ—పుత్రీ! నిగ్రహ మనవలసిన దనుగ్రహ మనియెద వేమి? సర్వానర్థబీజ మని యామాయ నాతఁడు నిర్మూలింపఁ దలంపుగొని యున్నవాఁడు.

శాంతి—అమ్మా! అట్లయినచో రాజకులస్థితి యిప్పు డెట్లున్నదో చెప్పుము.

శ్రద్ధ—పుత్రీ! విను-

మ॥ అనుగుందొయ్యాలి యిప్డు జీవునకు నిత్యానిత్యజిజ్ఞాసగా
నగ్గాన వైరాగ్యుఁడు సత్సుహృత్తు; యమముఖ్యుల్ మిత్రముల్; దాసు లెం
దును మైత్రీప్రభృతుల్; ముముక్షు సఖి; సంతోషాదికుల్ తోడు; దూ
ష్యన్నృశంసారికులంబు మోహ మమతా సంకల్ప సంగాదులుగ్ ॥౩॥

శాంతి—అమ్మా! మఱి ధర్మునికిని స్వామికిని బ్రణయ మెట్లున్నది?

శ్రద్ధ—కుమారీ! వైరాగ్యుఁడు చేరినది మొదలు జీవస్వామి నితాంత మైహికాముష్మిక ఫలభోగ విరసుం డయి చూపట్టెడును. అందుచేత నే-

తే॥గీ॥ పాపఫల మగునరకంబువలనఁ బోలె,
నశ్వరం బని స్వర్గంబునకును వెఱచుఁ;
గాన నాతఁడు మది ఫలకాంక్ష లేక,
యొకొనెడుఁ బుణ్యకర్మంబు నెట్టకేని॥౪॥

స్వామి యిట్టు లాత్మనిష్ఠుం డగుట విలోకించి, నావలనం గావలసిన దయ్యెఁ గదా యని, ధర్ముండు దనకుఁ దాన వ్యాపారంబులం జాలించుకొని యున్నవాఁడు.

శాంతి—అమ్మా! మఱి మహామోహుం డాలాగు యోగోపసర్గములం గూడుకొని, నాఁడు మాయ మయ్యెను గదా! వారలవృత్తాంతం బేమి యయ్యెఁ?

శ్రద్ధ—పుత్త్రీ! తాదృశ దుర్దశం బొందియు మహామోహహతకుండు, జీవస్వామిం బ్రతారించుటకు మధుమతీవిద్యతో నయ్యుపసర్గులం బురికొల్పి పంపెను. స్వామి వారలయం దాసక్తుం డయ్యె నేని, వివేకుం డుపనిషత్తును స్మరింప నయిన స్మరింప కుండు నని వానియభిప్రాయము.

శాంతి—అవురా! తరువాతం దరువాత?

శ్రద్ధ—అంత నయ్యుపసర్గు లాయనయొద్దకుం బోయి కొండొక యింద్రజాలవిద్యం జూపుటయుం దత్ప్రభావంబున నత్యాశ్చర్యకరస్వరూపుం డొకానొకపురుషుండు ససంభ్రమంబుగా స్వామిసన్నిధానంబునకుం జనుదెంచి "ఓమహాప్రభూ! ఏతదుపాసనాసిద్ధుండు-

మ॥ విను సూత్రామడశబ్దముల్; దెలుపుం దద్దేశిహాసాదులన్
మును పాలింపనిగాథలన్: శుచిపదంబుల్ గూర్చి స్వేచ్ఛన్ రచిం
చును గావ్యంబులు శాస్త్రముల్; దిరిగి వచ్చున్ సర్వలోకంబు లా
కరాని మేషంబునం జూచు మేరుమణిశృంగశ్రేణు లిం దుండియే"॥౫॥

అని, మనవిచేసెను. అప్పుడు మధుమతియును జీవస్వామిని దనధామిని బ్రవేశపెట్టుటయు, స్థానాభిమానినులయిన దేవతామానినులాయన కభ్యుత్థానంబు గావించి, యోస్వామీ! యిట నధివసింపుము; ఇచ్చోట జనసమరణంబులు లేవు. ఈప్రదేశము నిసర్గరమణీయము. ఇదిగో! వివిధవిలాసవేష లావణ్యమనోహరలును బుణ్యమయులు నగువిద్యాధరబింబాధరలు మంగళార్ఘ్యవ్యగ్రపాణు లయి ప్రణయపేశలభావంబున నిన్ను సేవింప సమీపించియున్నవారు. ఓమహానుభావా! ఇటు విజయంచేయుము-

చ॥ మిసిమి పసిండిజాలిసుకమిట్టలు వెట్టినపున్నెపున్నదుల్,
పసముదళంబులం గరుడపచ్చలచాయల నీసుకోనలున్,
బిసరుహపాణులుం బృథులబింబనితంబలుం గంబుకంఠు లిం
దెసంగుదు రొండు మిన్నియు యథేష్టతం బుణ్యవశాప్తభోగముల్॥౬॥

అని యాయన కాన చూపిరి.

శాంతి—ఆహా! తరువాతం దరువాత?

శ్రద్ధ—పుత్త్రీ! నే నేమి చెప్పుదు? అప్పు డది విని మాయ యిది శ్లాఘనీయ మనియె; మనస్సు దానిక లెస్సగా నంగీకరించె; సంకల్పుం డందు కనల్పోత్సాహంబు గావించె; స్వామియు నమ్మోయికిం గొండొక సమ్మతించి నట్లు కానంబడియె.

శాంతి—అయ్యయ్యో! క్రమ్మఱ నెప్పటిసంసారవాగురనే దేవర దగులు కొన్నాఁడే.

శ్రద్ధ—లేదులేదు కుమారీ!

శాంతి—మఱి యేమి జరిగినది?

శ్రద్ధ—అప్పుడు తత్పార్శ్వవర్తి యయినతరుకాండు వారి నందఱఁ గ్రోధా వేశకషాయితలోచనంబుల నవలోకించి యేలికతో ని ట్లనియె. దేవా! యే మిది? విషయామిషగ్రాసాభిలాషు లగునేతదాస్థానధూర్తబకంబులచేత యథాప్రకారంబుగాఁ దాదృశవిషమవిష యాంగారంబులం గూలుపంబ డుచు నిన్నే నీ వెఱుంగక యున్నవాఁడవు. ఓస్వామీ!

తే॥గీ॥ వేగ దాఁటంగ సంసారసాగరంబు,
యోగనావను సాగించి తొఁ గదయ్య;
బాగుబా గిప్పు డేది యేమి యాగడంబు?
దోఁగె దది మాని నిప్పులవాఁగులోన॥౭॥

శాంతి—మేలుమేలు! తరువాతఁదరువాత?

శ్రద్ధ—అంత నాతండు తదుక్తవాక్యంబు లాలకించి యోవిషయంబులారా! మీకుం బదివేలనమస్కారంబు లని మధుమతిం దిరస్కరించెను.

శాంతి—ఓహెూ! మహాసంతోషము. అమ్మా!మఱి నీ విలా గక్కడికిబయ లు వెడలినావు?

శ్రద్ధ—పుత్రీ! జీవస్వామి వివేకుని వీక్షింపఁ గోరి యతనిం దోడితె మ్మని న న్నుఁ బంచినాఁడు: కాబట్టి నేను మహారాజుసన్నిధికిం బోవ బయలు దేఱినాను.

శాంతి—అమ్మా! నేను నుపనిష దానయనార్థము మహారాజుచే నియుక్త న యినాను; కావున మన మింక స్వామినియోగము నెఱవేర్తము. పద.

(నిష్క్రమించిరి. ప్రవేశకము)

(తరువాతఁ బురుషుఁడు ప్రవేశించుచున్నాఁడు)

పురు—(ఆలోచించిసంతోషముతో)ఓహెూ! యేమీ విష్ణుభక్తిదేవి మహిమ! ఆమెప్రసాదముచేతనే గదా!

మ॥ మమతావర్తములం దొలంచుకొని,భీమక్లేశ కల్లోలసం
ఘము లంఘించి,కళత్రబంధుమిష నక్రగ్రాహ సంగ్రస్తులక్
శమ మొందించి,క్రుధోగ్రబాడబశిఖల్ చల్లార్చి,తృష్ణా లతౌ
ఘము ఖండించి,భవాబ్ధిపార మహహా!గన్గొంటి నిన్నాళ్ళకున్॥౮॥

(తరువాత నుపనిషత్తు,శాంతియుఁ బ్రవేశించుచున్నారు)

ఉప—సఖీ!న న్యితరజనవనితం బోలె నాథుఁడు, చిరకాల మి ట్లేకాకినిఁగా విడిచి పెట్టెను. ఆలాటినిష్కరుణుని మోము నే నేలాగు చూతును?

శాంతి—దేవీ!అంత లేసియాపదలపా లయినయేలికను నీ వేల నిందించెదవు?

ఉప—సఖీ!నాపడినపాట్లు నీవు చూడ లేదు గావున నీవిధమునఁ బలుకుచున్నావు;విను.

ఉ॥ చేతులకంకణాలు పొడి సేసిరి కెంపులు నుగ్గు నూచ గా;
నాతలమానికం బొలిచినారు కురుల్ చెదరంగ;న న్నయో!
యేతులువల్ స్వదాసిగ గ్రహింపఁ దలంపరు దుర్విదగ్ధులై?
ఘాతుకదైవయత్నమునఁ,గలిగా!వివేకుఁడు దూర మౌటచేఁ॥౯౫॥

శాంతి—సఖీ!ఇది యంతయు మహామోహుని దుర్విలసితము.ఇందు స్వామియపరాధ మేమి యున్నది?కామాదులకారణమున మనస్సును లోభపెట్టుచు, వాఁడే వివేకుని నీకు దూరము చేసెను.అయినను విపన్నుండయినస్వామివిషయ మయి నీ విట్లు సమయప్రతీక్షణము సేయుచున్నదానవు.ఇదే కులస్త్రీలకు నైసర్గికశీలము గదా!సఖీ!నీవింక సమీపించి,నీదర్శనముచేతను, ప్రియాలాపముచేతను దేవరను సంభావింపుము. ఇప్పుడు నీవిద్వేషులు వినష్టు లయిరి-నీకోరికలు ఫలించినవి.

ఉప—సఖీ!ఇప్పుడు నే నిటు వచ్చుచుండఁగా గీతాకుమారి రహస్యమున నాతో "భర్త యగువివేకునకును,స్వామి యగుపురుషునకును బ్రశ్నోత్తరరూపముగా నీ వుత్తర మొసఁగి సంభావింపుము;వైశంబ ప్రబోధోదయంబు గాఁగలదు."అని వాక్రుచ్చినది.గురుజనము నెదుర నే నేలాగు దిట్టతనమును బూనఁగలను?

శాంతి—సఖీ!గీత వలికినయీవాక్యమునకు నీ వింతగాఁ జింతింప వలసిన దేమి?విష్ణుభక్తిదేవియు నీయర్థమే వివేకునకును బురుషునకును జెప్పి యున్నది.కావున నీవు వచ్చి భవద్దర్శనంబున భర్తను, నాదిపురుషుని సంభావింపుము.

ఉప—సఖీ!మంచిది,నీయిష్టము. (ఇద్దఱు నడుచుచున్నారు.)

(తరువాత రాజును శ్రద్ధయుఁ బ్రవేశించుచున్నారు)

రాజు—శ్రద్ధా!ప్రియురాలి నుపనిషత్తును శాంతి చూచి యుండునా?

శ్రద్ధ—దేవా!దేవరయానతిం దల దాల్చి యరిగినది గదా!ఆమె నెట్లు చూడకుండును?

రాజు—ఆమెజాడ దాని కేమి తెలియును?

శ్రద్ధ—దేవా! మందరపర్వతమునందలి మధుసూదనాయతనంబున గీతాదేవి యొద్దఁ దర్కవిద్యాభయంబున నామె దాఁగి యున్నదని, మున్నె విష్ణుభక్తి దేవి దానికిఁ దెలియఁ జెప్పియున్నది.

రాజు—ఆమెకుఁ దర్కవిద్యవలన భయ మెందుచేత?

శ్రద్ధ—అదియంతయు నామెయే దేవరకు విశదపఱుపఁగలదు: దేవర శీఘ్రముగా దయచేయ వలయును; స్వామి తమరాక కెదురు చూచుచు నేకాంతమున నున్నవాఁడు.

రాజు—(దగ్గఱకుఁ బోయి) స్వామీ! నమస్కరించుచున్నాను.

పురు—వత్సా! ఇది ప్రక్రమవిరుద్ధ మయినయాచారము సుమీ-జ్ఞానవృద్ధుండవు గావున, నుపదేశదానంబునం జేసి నీవే మాకుఁ బితృప్రాయుండవు; చూడు.

ఆ॥వె॥ మున్ను ధర్మమార్గమును విస్మరించి, యా
త్మజుల వేల్పు లడుగ దానికొఱకు,
నేలుకమ్మెఁ బరిగ్రహించి తండ్రుల "విన
రయ్యకొడుకులార" యనరె సుతులు?॥౧౦॥

కావున నీవు మాయెడలఁ దండ్రివలెనే ప్రవర్తించునది; అదియే పరమధర్మము.

శాంతి—దేవీ! ఇదిగో! మహారాజు స్వామితోఁ గూడ నేకాంతమున నున్నవాఁడు; సన్నిధి కరుగుము.

ఉప—(సమీపించుచున్నది)

శాంతి—స్వామీ! ఇదిగో నుపనిషద్దేవి పాదాభివందన మాచరింప వచ్చినది.

పురు—అదికూడ దది కూడదు. తత్త్వావబోధోదయంబునం జేసి యీమె మాకు మాతృదేవత. కావున నీమెకే మేము నమస్కరింప వలయును.

సుగంధి॥ అంతె కా దనుగ్రహంబునందు మాత కీమె క
త్యంత మున్న దంతరంబు; తల్లి గాఢబంధసం
క్రాంతుఁగా నొనర్చుఁ గాని, కట్టు లన్ని దేవి యిం
తింతతునకలై చెడఁగ నికృంతనంబుఁ జేసెడున్॥౧౧॥

ఉప—(వివేకునిఁ జూచి నమస్కరించి దూరముగాఁ గూరుచున్నది)

పురు—అమ్మా! నీ విన్నాళ్ళు నెక్కడఁ గాలక్షేపముఁ జేసితివో యానతిమ్ము.

ఉప—స్వామీ! చిత్తగింపుము.

చ॥ జరిపితి నిన్నినాళ్ళు మఠచత్వరసీమల, శూన్యదేవమం

దిరముల,మూర్ఖవాదములఁ జేతిసఁ బ్రేలరిమూఁక చెంగటన్;

పురు—అమ్మా!వారు నీతత్త్వమే మయినఁ దెలిసికొనిరా?

ఉప—లేదు లేదు స్వామి!

మరి,ద్రవిడాంగనల్ నుడువుమాటకుఁ బోలె,మదుక్తకింబొస
ర్తురు విపరీతభావములు,దోఁచినలాగవిచారితార్థులై ॥౧౨॥

కావున వారల కస్మద్విచారణము కేవలము పరధనాపహరణార్థంబు.

పురు—తరువాతఁ దరువాత?

ఉప—పిమ్మట నే నొకప్పుడు—

మ॥ ఘృతవహ్నిస్థ్స బహూ స్రువాదికములుం,గృష్ణాజినంబుల్,పశు
ప్రతతుల్,సోమముఖాధ్వరంబులును,యూపశ్రేణులున్,దర్భలి
ప్తితతుల్ మూఁగఁగఁ,గర్మకాండ ముపదేశింపంగఁ గత్త్వ్యాప
ద్ధతులన్,జెన్నగుచున్న జన్నములవిద్యం గంటి మార్గంబునన్ ॥౧౩॥

పురు—తరువాత?

ఉప—స్వామీ!అప్పుడు నేను—"ఈమెయొద్ద నిన్ని పుస్తకములకట్ట లున్నవి;నా తత్త్వ మీమెకుఁ దెలియక పోవునా?కొన్నిదినంబు లీమెసన్నిధిని గడపెద నని యాలోచించుకొంటిని.

పురు—తరువాత?

ఉప—పిమ్మట నట్టితలఁపుతోఁ దన్నుఁ జేర వచ్చిన నన్నుఁ జూచి యాయజ్ఞవిద్య" ముద్దియా!నీయభీష్ట మేమి?"యని యడుగుటయుఁ,"దల్లి! నే నిప్పు డనాథ నయితిని;కాఁబట్టి నీయొద్ద నుండఁ గోరుచున్నాను"అని పలికితిని

పురు—తరువాతఁ దరువాత?

ఉప—అంత నన్నామె"నీ వేమి పని చేయుదువు?"అని మరలఁ బ్రశ్న వేసినది.

పురు—తరువాత?

ఉప—అందుకుఁ బ్రత్యుత్తరముగా నే నిట్లు పలికితిని.

ఉ॥ ఎవ్వనియందుఁ దోఁచు జగ మెందు రమించు,లయించు నెందులో
నెవ్వనిదీప్తి వెల్గు జగ మేనిది నైజసుఖోజ్జ్వలన్మహ
స్త్వెవ్వఁడు శాంతుఁ డక్రియుఁ డధీశుఁడు నిత్యుఁడు,ద్వైతదూరుఁడై
యెవ్వనిఁ గంద్రు దుర్భవనివృత్తికి,నప్పురుషున్ నుతించెదన్ ॥౧౪॥

అన విని యాసవనవిద్య యొకింత చింతించి యిట్లనియె.

ఆ॥ వె॥ ఈశ్వరుండు కావు టెట్టు లాత్మ యకర్త?

వస్తుధీ భవంబు వాపఁ గలదె
క్రియయె గాక? యట్టిక్రియ లెశాంతమనస్కుఁ
డాచరించి బ్రదుకు నబ్దశతము॥౧౫॥

కావున నిన్నుఁ బరిగ్రహించుట నాతిప్రయోజనం బని నేను దలంచెదను. అయినను గర్తయు భోక్తయు నగుపూరుషుం బ్రస్తుతించుచు నుండఁజాలితివా, నీ వెంతకాలము మాయొద్ద నిలువఁ గోరినను మాకభ్యంతరము లేదు.

రాజు—(సోపహాసముగా) ఓహో! ధూమాంధకారశ్యామలితలోచన యగు యజ్ఞవిద్య యిట్లు కుతర్కోపహత యగుచున్నది; ఏమి! దానిదుష్పాండిత్యప్రకర్షము!

క॥ అచల మచేతన మగునిను
ము చలింపదె చుంబకంబుమం దటు జగముల్
రచియించు మాయ, విభుదృ
క్ప్రేరోదనను; నీశునీశ్వరత్వం బదియే॥౧౬॥

కాఁబట్టి యట్టిదృష్టి తమోంధులకే. అజ్ఞానప్రభవం బగునీసంసారంబును గర్మంబులచేత శమింపం జేయఁ జూచునయ్యజ్ఞవిద్య, యంధతమసంబు నంధకారంబుచే నపనయింపం దలంప దెట్లు?

ఆ॥వె॥ లలి స్వభావలీనములును, దమోమయ
మ్ములును నయినసప్తభువనములను,
వెలయఁ జేయువానిఁ దెలియువాఁ డమృతుఁ డౌ;
భవవిముక్తి కన్యపథము లేదు॥౧౭॥

పురు—తరువాతఁ దరువాత?

ఉప—స్వామీ! అయ్యజ్ఞవిద్య క్రమ్మఱం దనలోఁ దాను విమర్శించుకొని "సఖీ! భవదీయసన్నికర్షంబున దుర్వాసనోపహతు లయి యస్మదంతేవాసులు కర్మంబులమీఁద నపగతాదరులు గాఁగలరు; కాఁబట్టి నాతల్లి! కానాఁటి విచ్చోటు విడిచి, నీయిచ్ఛ వచ్చినయచ్చటికేని విచ్చేయ ననుగ్రహింపుము" అని బతిమాలుకొనెను.

పురు—తరువాతఁ దరువాత?

ఉప—పిమ్మట నే నామెను వీడుకొని బయలుదేఱితిని.

పురు—తరువాత?

శిష—స్వామీ! అటువెనుకఁ గర్మకాండసహచరి యయినమీమాంస నాకుఁ గానఁబడినది.

తే॥ గీ॥ ప్రార్థించ దధికారభాజి కర్మముల క్రమముఁ
దెలిపి, ప్రాప్తిపజే శాతిదేశములను
నొందుచిత్రాంగముల నామె యొప్పచుండు,
నాతి శ్రుత్యాదికప్రమాణయుత యగుచు॥౧౦॥

రు—తరువాత?

శి—స్వామీ! యామీఁదట నామెను గూడ యథాపూర్వముగా నాశ్రయార్థము ప్రార్థించితిని. అంత నామెయు నన్నా! నీ వేమి పనిఁ జేయుదు వని నన్నుఁ బ్రశ్న చేసినది- అందుపయిని "ఉ॥ ఎవ్వనిచే జనించు జగము" ఇత్యాది నే నుత్తర మిచ్చితిని.

రు—తరువాత?

శి—స్వామీ! ఆమాటపయిని మీమాంస, తనసూరెల నున్నశిష్యులయాసనంబు లాలోకించి యిట్లనియె- లోకాంతరఫలోపభోగయోగ్యుఁ డయినపురుషు నుపపాదించుటంజేసి మన కుపయోగ మున్నది; కాఁబట్టి, కర్మోపయుక్త నీమెను జేకొనుఁడు. నావుడు వారలలో నొకఁ డమ్మాటకు సమ్మతించెను గాని, వే ఱొకరుఁడు సుప్రసిద్ధప్రతిష్ఠుండు మీమాంసాహృదయాధిదైవతంబు నాఁ జనువాఁడు కుమారిలస్వామి యనువాఁ డిట్లనియె. దేవీ! ఈమె యకర్తయు నభోక్తయు నగునీశ్వరుం గాని, కర్మోపయుక్తుం డగుపూరుషుం బ్రతిపాదింపదు. కర్మంబుల కీమె యేమాత్రము నుపయోగపడదు. నా విని మఱి యొకరుం డిట్లనియె. ఏమీ! లౌకికపూరుషుండు గాక యీశ్వరుం డని వేఱొండు గలఁడా? అనుటయుఁ బకుపున నవ్వి యకుమారిలుండు వెండియు నిరాయవడి వక్కాణించెను- అవు నోయి కలఁడు.

మ॥ ప్రకటించు జగద్విచేష్టితము లన్యం బుండు మోహాంధుఁ డై
యొకఁ డాసించి కొనుం గ్రియాఫలము లన్యం బర్థి కవ్విద్భుఁ డా
నొకఁ డాజ్ఞాపితుఁ డౌఁ బనుల్ సలుప, నన్యం బీశుఁ డే ప్రాణికో
ట్లకు నిస్సంగుఁడు పూరుషుం డెటు క్రియల్ గావింపఁగాఁ గర్త యా॥

రాజు—(సంతోషముతో) ఓహోహో! తాంత్రికకుమారిలస్వామీ! నీ వ్రుత్కృష్టబుద్ధివి; ఆయుష్మంతుఁడవు గమ్ము.

క॥ రెండు సుపర్ణంబులు జత
నుండుం గూడుకొని యవ్వి యొకవృక్షమునన్;
బండినపిప్పలమును నం
దొండు భుజించున్; భుజింప కొకటిఁడు పొలుచున్॥౨౦॥

పురు—తరువాతఁదరువాత?

ఉప—స్వామీ! పిమ్మట నే నమ్మీమాంసను గూడ వీడుకొని బయలుదేఱితిని.

పురు—తరువాత?

ఉప—స్వామీ! అనంతర మేను బహుశిష్యవర్గోపాస్యమాన లగుతర్కవిద్యలఁ బెక్కుర నవలోకించితిని. వారిలో—

మ॥ తవులున్ విశ్వవిశేషకల్పనచణత్వంబందు నొకర్తు; ఛం
దవిధిన్ సచ్ఛలజాతినిగ్రహమయన్యాయంబులన్ వాదజ
ల్పవితండల్ పచరించు నొర్తు; ప్రకృతిన్ భాగించి యాత్మప్రభే
దవివక్షన్ మహదాదిసర్గసరణిన్ దత్త్వంబు లొక్కర్తెన్నెదున్॥౨౧॥

పురు—తరువాత?

ఉప—స్వామీ! అనంతర మే నాతర్కవిద్యలయొద్ద కేగి,వారు నన్నడిగినమాట కుత్తరముగా "ఉ॥ ఎవ్వనియందుఁ దోఁచు జగము" ఇత్యాది మదీయకర్మంబు నుదాహరించితిని. అంత నేమి చెప్పుదు! నాపలుకుల కాకలుకులు వికవిక నగి యొకసక్కెముగా "ఓసిసైసిమాలినవదరా! విశ్వ మెల్లఁ బరమాణువులవలనఁ గలుగుచున్నది; ఈశ్వరుఁడు నిమిత్తకారణము" అనియొర్తును, "ఓసిదోసీ! యిది యేమే యీశ్వరునే వికారినిఁ జేసీ యాయనకు వినశ్వరత్వంబు నాపాదించుచున్నదానవు? ప్రధానమువలననే విశ్వోత్పత్తి" యని సక్రోధముగా నొకర్తును, నన్ను ధిక్కరించి పలికిరి.

రాజు—ఔరా! దుర్మతు లాతర్కవిద్య లీమాత్రమును దెలియఁ జాలరు! ఘటాదులుం బోలెఁ బ్రమేయజాతంబు సర్వంబును గార్యంబ కావున నిశ్వరమాణుప్రధానోపాదానకారణత్వంబు నుపేక్షణీయంబ.

మ॥ జలశైవాల్పకుఁ డంతరిక్షనగర స్వప్నేంద్రజాలాదులుం

బలెఁ గార్యంబు జగం బసత్య ముదయధ్వంసాదియుక్తంబు; శు
క్తిలసద్రూప్యము స్రగ్భుజంగమము భ్రాంతిన్, స్వప్రకాశున్ హరిన్
దెలియం జాలమిఁ దోఁచి వే చెడును గాదే తత్త్వబోధంబునన్॥

ఇంక సవికారశంకయు ముగ్ధవధూవికల్పవిలసితమే చూడుము.

చ॥ అమలము నిష్కళం బనుదితాస్తనిరంతరభాసముం బ్రశాం
తము నగుజ్యోతి,విశ్వజననంబున నెట్లు వికార మొందు? సాం
ద్రము లసితోత్పలచ్ఛవియుతంబులు సారెకు వారివాహబృం
దము లుదయించినం,దివికి దాన వికారము చేటి దారయన్॥ ౭౩॥

మ—ఓహోహో! ఈప్రజ్ఞావంతునివిమర్శనము నామనము నానందసము
ద్రమున ముంచుచున్నది! (ఉపనిషత్తుతో) తరువాతఁ దరువాత?

ఉ—స్వామీ! తరువాత నాతర్కవిద్య లందఱు నేకమై నామీఁద మండిపడి
మాయురే! యిది విశ్వవిలయంబున ముక్తిం జెప్పుచు నాస్తికపథంబునం
బయలు దేఱినది; దీనిం బో నీకు పోనీకుఁ డని మహాసంరంభమ్మున నొ
క్కుమ్మడి నన్ను నిగ్రహింపం బ్రయత్నించిరి.

మ—(భయముతో) తరువాతఁ దరువాత?

ఉ—తరువాత వారిసంరంభంబునకు నాప్రాణము లడలిపోయి యతిశీఘ్ర
ముగా నక్కడినుండి పరుగువాఱి దండకారణ్యంబునం బ్రవేశించితిని. అ
మ్మాట మందరశైలోపకల్పితం బయినమధుసూదనాయతనంబున కనతి
దూరంబున వారు నన్ను దొరకం బట్టుకొని—

ఉ॥ చేతులకంకణాలు పొడి సేసిరి కెంపులు నుగ్గు సూచగాఁ,
బ్రా,తలమానికం బొలిచినారు కురుల్ చెదరంగఁ; జెంపినా
రా తెలిముత్తియంపుసరు లంగదుకూలము దోఁచివారు—

నా కప్పుట నిత్యావ్యవస్థ సంజాతం బయినయది-

మ—తరువాతఁ దరువాత?

ఉ—స్వామీ! అనంతర మాదేవళంబునుండి గదాపాణులు కొందఱు పురు
షు లేతలవచ్చి నిర్దయంబుగా మర్దించుటం జేసి యాకర్కశురాంధ్రు య
థాయథ లయి దిగంతంబు లతిక్రమించి పాఱిపోయిరి.

మ—(సంతోషముతో) దేవీ! నీవంటివారి నతిక్రమించి వర్తించువారిని భ

గవానుఁడు విశ్వసాక్షి క్షమియింపఁడు గదా!

పురు—తరువాతఁ దరువాత?

ఉప—నే। నాతతభీతి గీతసెల వంతటఁ జొచ్చితి నందె లూడఁగన్॥౭౮॥

అట్లు తనయాశ్రమంబునం బ్రవేశించిననన్ను గీతాకుమారి యాలోకించి, ససంభ్రమంబుగా "నోహోహో! యమ్మ యమ్మ" యనుచుం గ్రుచ్చి కవుంగిలించుకొని నన్నుఁజేర్చుకొనియె. అనంతర మక్కుమారితో నాదుః ఖమును నేను వెడలఁ బోసికొన సది యి ట్లనియె. అమ్మా! ఏతద్విషయం బున నీమనస్సును క్షోభపెట్టుకోకుము- నీయెడం బ్రమాణబుద్ధి లేక యా సురభావంబున విచ్చలవిడిగా నెవ్వరు సంచరింతు రవ్వారలకు నీశ్వరుండే తగినశాస్తి సేయఁగలఁడు. చూడు శ్రీమన్నారాయణుం డట్టివారలంగూ ర్చి గీతలయం దే మనుచున్నాఁడో.

"క॥ క్రూరాత్ముల నే నశుభా
చారులను నరాధములను సంతతవైర
ప్రారంభుల దుస్తరసం
సారాసురయోనులం దజస్రము ద్రోతున్॥" అని పఠించినది.

పురు—(సకౌతుకంబుగా) దేవీ! నీప్రసాదంబునఁ దెలియఁ గోరుచున్నాను. ఆయీశ్వరుఁ డన నెవఁడు?

ఉప—(కోపగించుకొన్నట్టు) తన్నుఁదా నెఱుంగనివానికి నంధునకుఁ బోలె నెవ్వరు ప్రత్యుత్తర మీయఁగలరు?

పురు—(హర్షముతో) ఏమీ! నేనే యాపరమేశ్వరుఁడనా?

ఉప—మ తేమి? చూడు.

క॥ పరులరు గారు సనాతన
పురుషుఁడు నీకంటె,నీవు పురుషునికంటెన్;
సరసున రవివలె నలనీ
విరు వెఱఁగుగ భిన్నుఁ డైతి వింతియ మాయన్॥౭౯॥

పురు—(వివేకునితో) ఓయిమహాత్మా! ఈమహానుభావురా లనుగ్రహించి చె ప్పినదిగాని,తదర్థ మేమో తెల్లగ నాకు బోధపడ కున్నది

క॥ భిన్నుఁ డవచ్ఛిన్నుం డగు
నన్ను జరాప్రముఖధర్మ నశ్వరుని, సమ
క్షున్నత సచ్చిత్సుఖ సం
పన్నాత్మునిఁ గాఁగ దేవి పలికెడు వింటే॥౨౬॥

వివే—స్వామీ! పదార్థాపరిజ్ఞానమే తద్వాక్యార్థము మీకు బోధపడమికి ముఖ్యహేతువు.

పురు—మహాత్మా! అట్లయినఁ దదవబోధమున కుపాయ మేదో యాన తిమ్ము.

వివే—ఇదిగో నిదే—

ఉ॥ కా నిది యంచు వేర్పఱుపఁగా, మదిలోఁ గలతత్త్వముల్ లయం
బైనతఱిఁ, జిదాత్మను త్వమర్థము దోఁచుఁ, దత్త్వమస్యభి
ఖ్యానమహాశ్రుతిఁ హతభవాంధతమిస్ర మనంత మంతర
న్యానసుఖంబు శాంత మలజ్యోతి స్స్వయంప్రభ ముజ్జ్వలం బగున్॥౨౭॥

పురు—(ఆనందముతో, విన్నయర్థమును విమర్శించుకొనుచున్నాఁడు)

(తరువాత నిదిధ్యాసనుఁడు ప్రవేశించుచున్నాఁడు)

నిది—"ఓనిదిధ్యాసనా! నీ వెఱింగినయస్మదభిప్రాయమును, వివేకసన్నిధానమున నుపనిషత్తునకు నిగూఢముగా బోధపఱిచి, నీవు పురుషునియందుండుము." అని విష్ణుభక్తిదేవి నా కాన తిచ్చినది. (చూచి) ఇదిగో నుపనిషద్దేవి, వివేకునితోడను బురుషునితోడను గూడుకొని చేరువనే యున్నది. ఆమెను సమీపించెదను. (సమీపించి యుపనిషత్తుతో రహస్యముగా) అమ్మా! విష్ణుభక్తిదేవి "దేవతలు సంకల్పయోనులు; నీవుగర్భవతి వని నేను యోగధ్యానమునఁ దెలిసికొన్నాను. భవదీయోదరంబునఁ గూరసత్వ యగు విద్యాకన్యయుఁ, బ్రబోధచంద్రుండును నున్నవారు- అందు విద్యాకన్యను, సంకర్షణవిద్యాప్రభావంబున మనస్సునందు సంక్రమింపం జేసి, ప్రబోధచంద్రునిఁ బురుషునకు సమర్పించి, నీవు వివేకునితో నాయొద్దకు నేతెమ్మా." అని నీ కాజ్ఞాపించినది.

ఉప—భగవతి యాజ్ఞ చొప్పునఁ బ్రవర్తించెదను. (వివేకునితో నిష్క్రమించుచున్నది) (నిదిధ్యాసనుఁడు పురుషుం జేరుచున్నాఁడు)

(తెరలో) ఓహో! ఆశ్చర్య మాశ్చర్యము!

స్రగ్ధర॥ నృత్యచ్ఛంపాచ్ఛటా సన్నిభవిభ వెలుఁగన్ దిక్కు లికన్ న్య యోహెూ!
ప్రత్యక్షస్ఫోటితాస్థిప్రచయముగ మనోవక్షముల్ వ్రచ్చి, మోహ
ప్రత్యర్థి ప్రాణముల్, తద్భటులయుసుఖులుం బాపి, వేమాయ మై పో,
సత్యర్థం బీప్రబోధోదయుఁడు పురుష నభ్యగ్ణముల్ దా భజించెన్॥

(తరువాతఁ బ్రబోధచంద్రుఁడు ప్రవేశించుచున్నాఁడు)

ప్రబో—మ॥ ఎది సంప్రాప్త మపోహితం బెది?హృతం బేదీ? సముత్సారితం
బెది? స్యూతం బెది?ద్రావితం బెది?నిజం బిం దేదియున్ లే దెవం
డుదయింపన్, సహజప్రకాశదళితం బుద్య త్త్రిలోకంబు వాం
దదో యస్మాద్కు వితర్క కరకాశత, నేఁ దాదృక్ప్రబోధేందుఁడన్॥

(నడచి) ఇదిగోఁ బురుషుఁడు; సమీపించెదను. (సమీపించి) మహాత్మా! ప్రబోధచంద్రుఁడను నమస్కరించుచున్నాను.

పురు—వత్సా! ఇటు రమ్ము. నన్నుఁ గౌఁగిలించుకొమ్ము.

ప్రబో—(ఆలాగు చేయుచున్నాఁడు)

పురు—(ఆనందముతో) ఓహో! విఘటితతిమిరపటలంబు ప్రభాతంబు సంజాతం బయినయది.

ఆ॥వె॥ తొలఁచి మోహతమము, దూల్చి వికల్పసు
షుప్తి, పొడమె బోధశుభ్రరశ్మి,
శ్రద్ధ మతివివేకశాంతియమాదు లీ
విశ్వ మేనుఁ దోఁచ విష్ణువగను॥౩౦॥

మహానుభావురా లగువిష్ణుభక్తిదేవిప్రసాదంబున, నేను సర్వథా కృతకృత్యుఁడ నయినవాఁడను. ఇప్పు డాయనే నేను.

చ॥ ఎవయక దేనితో, నడుగ కేమియు, దిక్కున కొండె మూల కొం
డెను జనుచుం బ్రయోజనము లేశము లేక యొకండ, బోద్దు గ్రుం
కిన నెలవే నివాసముగ, గేవలముం బ్రశమంబుఁ దాల్చి, స
న్ముని నిపు డౌదు నే నుడిగి మోహకషాయవిషాదభీతులన్॥౩౧॥

విష్ణుభక్తి—(ప్రవేశించి సంతోషముతోఁ బురుషుని సమీపించి) ఓహోహో! చిరకాలమునకు మామనోరథములు ఫలించినవి. వత్సా! నిన్నుఁ బ్రశాంత
విపత్తునిఁగాఁ జూడఁ గాంచితిని గదా!

రు—అమ్మా! నీయనుగ్రహమునకు దుష్కర మేది? (పాదములమీఁదఁ బడు చున్నాఁడు)

శ్ర—(పురుషుని గ్రుచ్చి యెత్తుచు) వత్సా! లే లెమ్ము. నీ కింకను నావలనఁ గావలసినప్రియ మేమో చెప్పుము.

రు—అమ్మా! ఇంతకన్నను నాకుఁ బ్రియ మే మున్నది? చూడు.

క॥ శమితబలదర్పితాఖిల
విమతుఁడుకృతకృత్యతనువివేకుఁడు పొందెన్;
సుమహానందము నరజ
న్మము నగుపదమందు నిలువఁ గలిగితి నేనున్॥౩౨॥

అయినను ని ట్లగుఁగాక. (భరతవాక్యము)

మ॥ కురియుం గావుత వాన బోరునను లోకు ల్మెచ్చఁ బర్జన్యుఁ డీ
ధరఁ బాలింతురుగా కుపప్లవతతు ల్దప్పంగ సత్పార్థివుల్;
పరమాత్మంక మమత్వ దుర్విషయ జంబాలంబుసంసార మన్
శరధిన్, ద్వితత్కృపఁ దత్త్వసంప్లుతతముల్ జ్ఞానుల్ విలంఘింతురన్॥

గద్య॥ ఇది శ్రీపరమేశ్వరవరప్రసాదలబ్ధ సరసకవితాధురంధర వద్దాదిసాధు
వంశక్షీరనీరాకర రాకాసుధాక రాచ్చనామాత్యపౌత్ర హారితసగో
త్ర పవిత్రగుణకదంబలక్ష్మాంబా గర్భశుక్తిముక్తాఫల సూర
పరాజప్రధానతనూభవ విబుధవిధేయ సుబ్బరాయ
నామధే యాంధ్రీకృత శాంతరసాసారప్రబో
ధచంద్రోదయనాటకంబునందు జీవ
న్ముక్తినామకంబు సర్వంబును
షష్ఠాంకము.